

బ్రూనైతో భారత్ సుదృఢ సంబంధాలు 2

ఆ దిశగా కృషి చేస్తానన్న ప్రధాని మోదీ

ఇరు దేశాల దౌత్య సంబంధాలకు 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్రూనైలో పర్యటన

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 4-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 158 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 9.47 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తర పూర్తి; వర్జ్యం: ఉ. 11.17-1.05; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.38; అమృతఘడియలు: రా. 10.06-11.55; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.22 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కాల్పుల్లో పగిలిన కారు అద్దాలు

ఆవుల స్మగ్లర్‌గా భావించి..

ఇంటర్ విద్యార్థి కాల్చివేత

కారుతో 30 కి.మీ.లు వెంబడించి కాల్పులు

ఢిల్లీ-ఆగ్రా రహదారిపై దారుణం

'గో రక్షణ' ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు 2



కష్టాల కడలి దాటి.. పతకంతో మెరిసి..

పారాలింపిక్స్‌లో వరంగల్ అథ్లెట్ దీప్తి జీవాంజి సంచలనం

400 మీటర్ల రేసులో కాంస్యం కైవసం 11

అమీన్‌పూర్‌లో కూల్చివేతలు

హైడ్రా ఆదేశాలతో రంగంలోకి అధికారులు

సర్కారీ భూముల్లో నిర్మాణాల తొలగింపు

అడ్డుకునేందుకు మునిసిపల్ చైర్మన్ యత్నం

పోలీసుల జోక్యంతో వెనక్కి తగ్గిన వైనం! 3

ఐలాపూర్ తండాలో హద్దురాళ్ల తొలగింపు

ఫ్యూజన్ ఇంటర్నేషనల్ స్కూల్ గేటుతోపాటు సెక్యూరిటీ గది, ప్రహరీని కూల్చిన అధికారులు



చుక్కల మందుతో

చత్వారానికి చెక్

ముంబై కంపెనీ కొత్త ఐ డ్రాప్స్

ఒక్క చుక్క వేస్తే ఆరు గంటలపాటు రీడింగ్ గ్లాసెస్ అవసరమే ఉండదు!

అక్టోబరు నుంచి అందుబాటులోకి 2

రాష్ట్రమంతా హైడ్రా

నాలాలు, చెరువులను ఆక్రమిస్తే కూల్చుడే.. అప్పగిస్తే సరే, లేదంటే చర్యలు

హైదరాబాద్ హైడ్రా తరహాలో జిల్లాల్లో కమిటీలు

రాష్ట్రంలో రూ.6 వేల కోట్లు మేర వరద నష్టం

కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి

రాష్ట్రానికి రూ.2 వేల కోట్లు సాయంగా ఇవ్వాలి

ప్రధాని మోదీని రాష్ట్రానికి రమ్మని కోరాం

ప్రజలు కష్టాల్లో ఉంటే కేటీఆర్ జల్సాల్లో..

హరీశ్ హయాంలోనే పువ్వాడ ఆక్రమణలు: సీఎం

మహబూబాబాద్ జిల్లాలో రేవంత్ పర్యటన

వరదల్లో మరణించిన మహిళా శాస్త్రవేత్త సోదరుడికి గ్రూప్ 1 ఉద్యోగం ప్రకటన

బాబును పోగొట్టిన హరీశ్‌కు మా కష్టం కనబడలేదా?.. మీడియాతో రేవంత్ చిట్‌చాట్



మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమయగూడెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీఎం

మహబూబాబాద్, ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా నాలాలు, చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. చెరువులు, నాలాల ఆక్రమణలపై హైదరాబాద్ హైడ్రా చేపట్టినట్లుగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా సీతారాంతండాతో పాటు పురుషోత్తమయగూడెం ఆకేరు వాగుపై ఒకటిన్నర కిలోమీటర్ల మేర ధ్వంసమైన రోడ్డును, కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను ఆయన మంగళవారం పరిశీలించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కలతో కలిసి సీతారాంతండా వాసులను పరామర్శించారు. వరదలో కొట్టుకుపోయిన విద్యార్థుల సర్టిఫికెట్లు, పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, ఇతరత్రా విలువైన పత్రాలను తిరిగి కొత్తవి అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వరద నష్టంపై మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, చెరువులు, నాలాలు, బఫర్‌జోన్లను ఆక్రమించి లే-అవుట్ చేసి అమ్ముకోవడం వల్లే భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు జనావాసాలను ముంచేస్తోందని, ప్రాణ, ఆస్తినష్టం సంభవిస్తున్నాయని చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి కోర్టుల్లో కేసులుంటే చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమించిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఎంతటి

మిగతా 13వ పేజీలో...

బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం

బట్టబయలైంది 2

బుల్డోజర్ నీతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలను స్వాగతించిన రాహుల్ గాంధీ





సీఎం రేవంత్ రెడ్డికి విరాళం అందజేస్తున్న సింధు

సీఎం అంకుల్.. ఇది నా వంతు

కిడ్డీ బ్యాంకులో దాచుకున్న 3 వేలు అందజేసిన మహబూబాబాద్‌కు చెందిన టెన్త్ విద్యార్థిని 13

విరాళాల్లో పోటాపోటీ!

ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్య పోరు

100 కోట్లు ప్రకటించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్.. 130 కోట్లు ఇస్తామన్న ఐకాస చైర్మన్

పింఛనుదారుల ఐకాస రూ.33 కోట్ల విరాళం

పంప్‌హౌస్‌లు గాలికి! 12

నిర్వహణపై నిర్లక్ష్యం.. అధికారుల తనిఖీల్లో వెల్లడి

వట్టెం పంప్‌హౌస్ మునక.. 4 మోటార్లపై ప్రభావం

24కు చేరిన మృతుల సంఖ్య

వానలు, వరదలతో రాష్ట్రంలో తీవ్ర నష్టం

నేడు 4 జిల్లాల్లో భారీ వర్షాలు

రేపు, ఎల్లుండి తేలికపాటి వానలు 13

జల విద్యుత్‌పై నిర్లక్ష్యం

యూనిట్ల రిపేర్లను పట్టించుకోని జెన్‌కో 12

సికింద్రాబాద్-విజయవాడ రైళ్లకు నేటి సాయంత్రం నుంచి అనుమతి!



ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల ఘర్షణ

ఖమ్మంలో బీఆర్ఎస్, కాంగ్రెస్

బాహాబాహీ

వరద బాధితుల పరామర్శ సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదం

పువ్వాడ, జగదీశ్ కార్ల అద్దాలు ధ్వంసం

ఒక బీఆర్ఎస్ కార్యకర్తకు గాయాలు 12



ఎస్‌డీఆర్ఎఫ్

నిధులను వాడండి

రాష్ట్ర సర్కారు వద్ద 1,345 కోట్లు

అందులో కేంద్రం వాటా కూడా..

యూసీలు ఇస్తే మరిన్ని నిధులు

ఈసారీ ఘనంగా విమోచన దినం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి 3

తెలంగాణ

విద్యా కమిషన్



చైర్మన్, ముగ్గురు సభ్యులు.. రెండేళ్ల కాలపరిమితి

ప్రాథమికం నుంచి వర్సిటీ వరకు నాణ్యత పెంపునకు సూచనలు

జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. చైర్మన్‌గా ఆకునూరి మురళి?

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో ప్రమాణాలను పెంచడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. చైర్మన్, ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిషన్ గడువు రెండేళ్ల పాటు ఉంటుంది. ప్రాథమిక నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యతను పెంచడానికి అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై కమిషన్ తగు సూచనలు, సలహాలను ఇస్తుంది. కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను త్వరలోనే నియమించనున్నారు. నిజానికి ప్రత్యేక చట్టంతో కమిషన్ ఏర్పాటు చేసి, చట్టబద్ధత కల్పించాలని తొలుత భావించారు. చివరకు జీవో ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జీవో ద్వారానే ఏర్పాటు చేయనున్నట్టు 'ఆంధ్రజ్యోతి' గతంలోనే చెప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో విద్యారంగం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాల పని విధానం ఉండడం లేదని భావిస్తోంది. ప్రాథమికం నుంచి ఉన్నత విద్య వరకు రాష్ట్ర విద్యా వ్యవస్థలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యారంగాన్ని తీర్చి దిద్దాలనే ప్రధాన లక్ష్యంతో తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను పెంచడానికి, బోధనా పద్ధతుల్లో మార్పులు, చేర్పులు, విద్యాసంస్థల్లో నాణ్యతను పెంచడానికి ఈ కమిషన్ మార్గదర్శ ప్రణాళికను ఇవ్వాల్సి ఉంటుందని

మిగతా 14వ పేజీలో...

వారంలో 'కమిషన్ల' నియామకాలు!?

కసరత్తు పూర్తి చేసిన రేవంత్... రైతు కమిషన్‌కు కోదండరెడ్డి?

బీసీ కమిషన్‌కు నిరంజన్.. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై తర్జనభర్జనలు

సభ్యులతో కలిపి 25 మందికి పైగా పదవులు 14

బాబోయ్.. లేక్ వ్యూ

చెరువు ఫేసింగ్ ఫ్లాట్ల అమ్మకాలపై హైడ్రా దెబ్బ



గతంలో అలాంటి ఫ్లాట్లకు ప్రీమియం ధరలు

ఇప్పుడవి వద్దంటున్న వినియోగదారులు

ఇచ్చిన అడ్వాన్సులూ తీసేసుకునే యత్నం

చెరువుకు దూరంగా ఉన్నా.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉందా అని ఆరా! 3

అలాంటి ఫ్లాట్ల 'సెకండ్ సేల్స్'పైనా ప్రభావం

'లేక్ వ్యూ' అనే మాటే లేకుండా బిల్డర్ల జాగ్రత్త

ప్రచారమంతా 'గార్డెన్ ఫేసింగ్' పేరుతోనే!

భయాజమానలతో పాత ఒప్పందాలూ రద్దు

మా అపార్టుమెంట్‌కు మాంచి లేక్ వ్యూ ఉంది. ఇంతటి ఆహ్లాదకరమైన వాతావరణం హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌లో ఎక్కడ ఉంటుంది? అందుకే మా ప్రాజెక్టుకు డిమాండ్ ఎక్కువ. బుక్ చేసుకుంటే ఇప్పుడే చేసుకోండి. ఆలస్యం చేస్తే లేక్ వ్యూ ఉన్న ఫ్లాట్లు దొరకవు.

..కొద్దిరోజుల క్రితం దాకా హైదరాబాద్ మహానగరంలోని బిల్డర్ల మాట ఇది! కానీ, హైడ్రా దెబ్బకు లెక్కలు మారాయి! 'లేక్ వ్యూ' అనగానే.. అదేదో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టిన అపార్ట్‌మెంట్ అనుకుని వినియోగదారులు భయపడి ఆ వైపు చూడడమే మానేసే పరిస్థితి!! దీంతో బిల్డర్లు అప్రమత్తమయ్యారు. తమ బ్రోచర్లలో, ప్రచారంలో ఎక్కడా చెరువు గురించిన ప్రస్తావనే చెయ్యట్లేదు. దానికి బదులుగా.. 'గార్డెన్ ఫేసింగ్ ఫ్లాట్' అని ప్రచారం చేస్తున్నారు.



మరో 6 గ్రామాలు

విలీనం!

'మహా హైదరాబాద్'లో మొత్తం 51 పంచాయతీలు

ఔటర్‌ను ఆనుకొని ఉన్న గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో కలుపుతూ ఆర్డినెన్స్

త్వరలోనే ఈ పురపాలికలు జీహెచ్ఎంసీలోకి..

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న గ్రామాలు సమీప పురపాలికల్లో విలీనం అయ్యాయి. దీంతో రేవంత్ సర్కారు తలపెట్టిన 'మహా హైదరాబాద్'లో కీలక అడుగు పడినట్లయింది. ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 51 గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. తొలుత 45 గ్రామాలను విలీనం చేయాలనుకున్నప్పటికీ ఈ ప్రక్రియపై ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం మరో 6 గ్రామాలను కలపాలని సూచించింది. ఫలితంగా మొత్తం 51 గ్రామాలను విలీనం చేశారు. కాగా, ఈ విషయమై 'మహా హైదరాబాద్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. కాగా, హైదరాబాద్ నగరం రోజురోజుకూ విస్తరిస్తూ పోతోంది. కోర్ హైదరాబాద్‌లోని ప్రాంతాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉండగా శివారు ప్రాంతాల్లో వివిధ మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాలక్రమంలో ఇవి నగరంలో

మిగతా 14వ పేజీలో...

రూ.1.45 లక్షల కోట్లతో

'రక్షణ' కొనుగోళ్లు

విమానాలు, యుద్ధట్యాంకులు, రాడార్లు, అత్యాధునిక గస్తీ నౌకలు..

99% దేశీయంగా తయారైనవే

ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదం 2

బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్..

9 మంది నక్సల్స్ మృతి

మృతుల్లో ఆరుగురు మహిళలు

అందరూ పీఎల్‌జీ సభ్యులే! 3

5 తుపాకులు, విప్లవ సాహిత్యం స్వాధీనం

బీజాపూర్‌లో 13 మంది నక్సల్స్ అరెస్టు





ప్రేమమ్ హీరో నివిన్ పౌలీపై

అత్యాచారం కేసు 10

వైరముత్తుపై పోరాటంలో వెనకడుగే లేదు: చిన్మయి శ్రీపాద 10



బ్రూనై పర్యటనలో మోదీ



బందర్ సేరి బెగ్వాన్, సెప్టెంబరు 3: భారత్-బ్రూనైల మధ్య సుదృఢ సంబంధాలు నెలకొనేందుకు కృషి చేస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. అధికారిక పర్యటన నిమిత్తం ఆయన మంగళవారం బ్రూనై దేశ రాజధాని బందర్ సేరి బెగ్వాన్ చేరుకున్నారు. బ్రూనైలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని ఆయనే కావడం విశేషం. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమయి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్రూనై సుల్తాన్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టారు. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్', ఇండో-పసిఫిక్ విజన్ విధానాల్లో బ్రూనై భాగస్వామ్యం చాలా కీలకమని గుర్తించారు. అందులో భాగంగానే మూడు రోజుల పాటు బ్రూనైతో పాటు సింగపూర్‌లలో పర్యటించి పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. యువరాజు హాజీ అల్ ముతాదీ బిల్లా స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీకి ఘన స్వాగతం పలకడం విశేషం. బస చేసే హోటల్ వద్దకు బ్రూనైలో నివసించే భారతీయులు చేరుకొని ప్రధానిని సాదరంగా ఆహ్వానించారు. బుధవారం సుల్తాన్ హస్సానల్ బోల్కియా, ఇతర రాజకుటుంబీకులతో ప్రధాని చర్చలు జరపనున్నారు. అనంతరం ప్రధాని సింగపూర్ వెళ్లనున్నారు.

మద్యం కేసులో కేజ్రీవాల్‌కు సమన్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: మద్యం విధానం కేసుకు సంబంధించి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్ సహా మరో నలుగురిపై సీబీఐ దాఖలు చేసిన అనుబంధ అభియోగపత్రాన్ని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో వారిపై దర్యాప్తు కొనసాగించడానికి తగినన్ని ఆధారాలున్నాయని పేర్కొన్న ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌కు ప్రొడక్షన్ వారంట్ జారీ చేశారు. మిగతా ఐదుగురికీ (దుర్గేష్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్ మాథుర్, పి.శరత్‌చంద్రా రెడ్డి) కోర్టు సమన్లు జారీ చేసింది. తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ఈ కేసులో విజయ్ నాయర్‌కు సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ ఇచ్చిన నేపథ్యంలో.. రౌజ్ అవెన్యూ కోర్టు మంగళవారం రిలీజ్ ఆర్డర్ జారీ చేసింది.

ఆ తోడేళ్లను 'ఎన్‌కౌంటర్' చేసేయండి: యోగి

బ్రహయిచ్, సెప్టెంబరు 3: ప్రజల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్లను కాల్చి చంపాలంటూ సీఎం యోగి ఆదేశాలు జారీ చేశారు. బ్రహయిచ్ జిల్లా మహసి ప్రాంతంలో కలకలం రేపుతున్న నేపథ్యంలో మంగళవారం అటవీ అధికారులతో యోగి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగానే తోడేళ్లు కనిపిస్తే కాల్చి చంపేయాలని, అది కూడా చివరి అవకాశంగా మాత్రమేనని సూచించారు. మహసి తాలూకా పండోహియాలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఐదేళ్ల చిన్నారి అఫ్సానాపై తోడేళ్లు దాడి చేశాయి. ఈ జంతువుల దాడిలో ఇప్పటివరకు 8 మంది చనిపోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. మరోవైపు ఆరు తోడేళ్లు గుంపుగా దాడి చేస్తున్నాయని, వాటిలో నాలుగింటిని పట్టుకున్నట్లు అధికారులు ప్రకటించగా, జంతు నిపుణులు మాత్రం దాడి చేస్తోంది రక్తం రుచి మరిగిన ఒంటరి తోడేలు అని, మృతుల శరీర భాగాలను పరిశీలిస్తే ఇది స్పష్టమవుతోందని చెబుతున్నారు.

ప్రైవేట్ బాంబర్ ఎయిర్‌క్రాఫ్ట్ పరీక్ష సక్సెస్

బెంగళూరు, సెప్టెంబరు 3: పూర్తి స్వదేశీ సాంకేతికతతో తాము తయారు చేసిన మానవ రహిత బాంబర్ ఎయిర్ క్రాఫ్ట్ 'ఎఫ్‌డబ్ల్యూడీ-200 బీ'ని విజయవంతంగా పరీక్షించినట్లు బెంగళూరుకు చెందిన ప్రైవేటు రక్షణ సంస్థ ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్(ఎఫ్‌డబ్ల్యూడీఏ) మంగళవారం ప్రకటించింది. ఈ బాంబర్ ఎయిర్‌క్రాఫ్ట్ 15వేల ఎత్తు వరకు ఎగురుతుంది. గంటకు 152 కిలోమీటర్ల వేగంతో, ఏకబిగిన 800 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. 7 గంటల పాటు నిర్విరామంగా గాల్లోనే ఉండగలదు. 30కిలోల దాకా క్షిపణుల్లాంటి ఆయుధాలను మోసుకువెళ్లి లక్ష్యాలపై ప్రయోగించగలదు.

అట్లాస్ సైకిల్స్ మాజీ ప్రెసిడెంట్ సలిల్ ఆత్మహత్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: అట్లాస్ సైకిల్స్ కంపెనీ మాజీ అధ్యక్షుడు సలిల్ కపూర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీలోని తన ఇంటిలోనే లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో తలపై కాల్చుకొని చనిపోయారు. ఆర్థిక ఇబ్బందులు, నలుగురైదుగురి హింస, వేధింపుల వల్లే తాను చనిపోతున్నట్లు అంతకుముందు సూసైడ్ నోట్ రాశారు. ఈ లేఖ పోలీసులకు దొరికింది. సలిల్ భార్య, ముగ్గురు పిల్లలు వేరే చోట నివాసం ఉంటున్నారు. రూ.9కోట్ల చీటింగ్ కేసులో 2015లో ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం సలిల్‌ను అరెస్టు చేసింది. ఆయనపై మరో రెండు చీటింగ్ కేసులు కూడా నమోదయ్యాయి. కాగా, సలిల్ మరదలు నటాషా కపూర్ కూడా 2020లో అదే ఇంట్లో ఉరేసుకొని చనిపోయారు.

పర్వతం పైనుంచి పడి 'ఆడీ' ఇటలీ అధినేత మృతి



రోమ్, సెప్టెంబరు 3: ప్రముఖ కార్ల కంపెనీ 'ఆడీ' ఇటలీ అధినేత ఫ్యాబ్రీజియో లాంగో పర్వతం ఎక్కే క్రమంలో 10 వేల అడుగుల ఎత్తు నుంచి జారి పడి మృతి చెందారు. పర్వతాలను అధిరోహించడం అంటే ఇష్టమున్న ఆయన ఇటలీ- స్విట్జర్లాండ్ సరిహద్దుల్లో ఉన్న అడామెల్లో పర్వతాలను ఎక్కే క్రమంలో పొరపాటున జారి కింద పడ్డారు. ఆయన తోటి అధిరోహకుడు వెంటనే సమాచారాన్ని రెస్క్యూ టీమ్‌కు అందించారు. రెస్క్యూ బృందాలు అక్కడకు చేరుకుని 700 అడుగుల లోయలో ఫ్యాబ్రీజియో లాంగో మృతదేహాన్ని కనుగొని పోస్టుమార్టానికి తరలించారు.

చుక్కల మందుతో చత్వారానికి చెక్



'ప్రెస్‌వూ' ఐ డ్రాప్స్.. ధర రూ.350.. అక్టోబరు నుంచి అందుబాటులోకి

ఒక్క చుక్క వేస్తే 6 గంటలపాటు.. రీడింగ్ గ్లాసెస్ అవసరమే ఉండదు!

న్యూఢిల్లీ, ముంబై, సెప్టెంబరు 3: నాలుగు పదుల వయసు దాటగానే కొందరికి చత్వారం (ప్రెస్బియోపియా) వస్తుంది. పుస్తకాలు చదవడానికి కళ్లజోడు అవసరం అవుతుంది. కానీ అలాంటివారికి కళ్లజోడు అవసరం లేకుండా చేసే చుక్కల మందు మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. ముంబైకి చెందిన ఎన్‌టాడ్ ఫార్మా కంపెనీ 'ప్రెస్‌వూ' పేరిట అభివృద్ధి చేసిన ఈ చుక్కల మందుకు ఔషధ నియంత్రణ సంస్థ అనుమతినిచ్చింది. అక్టోబరు మొదటివారంలో ఈ మందును మార్కెట్లోకి తెస్తామని ఆ సంస్థ వెల్లడించింది. 40 నుంచి 55 ఏళ్ల వయసువారిలో.. కొద్దిపాటి నుంచి ఒక మోస్తరు చత్వారంతో బాధపడుతున్నవారు ఈ మందును కంట్లో ఒక్క చుక్క వేస్తే 15 నిమిషాల్లోనే పనిచేయడం ప్రారంభిస్తుందని సంస్థ సీఈవో నిఖిల్ తెలిపారు. ఒక్క చుక్క వేస్తే ఆరు గంటల దాకా.. రెండు చుక్కలు వేస్తే మరింత ఎక్కువ సమయం పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ చుక్కల మందు ధర రూ.350. నిజానికి.. అమెరికాలో 'వ్యూటీ' పేరుతో 2022లోనే ఈ తరహా ఐడ్రాప్స్ అందుబాటులోకి వచ్చాయి. 'ప్రెస్‌వూ'.. మనదేశంలో తయారైన మొట్టమొదటి ప్రెస్బియోపియా చుక్కల మందు కావడం విశేషం. ఈ చుక్కల మందు.. మన కన్నీటి పీహెచ్ విలువకు తగినట్టుగా వేగంగా తనను తాను సర్దుబాటు చేసుకుంటుందని, కాబట్టి దీర్ఘకాలం పాటు వాడినా ఈ మందుతో ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవని ఎన్‌టాడ్ సీఈవో నిఖిల్ వెల్లడించారు. "ఈ డ్రాప్స్ తయారీలో 'పైరోకార్పన్' మాలిక్యూల్‌ను ఉపయోగించాం. అమెరికాలో సెప్సిస్ సమస్యకు దాన్ని చాలాకాలంగా వాడుతున్నారు. వాస్తవానికి దాన్ని రోజూ వాడడం అంత మంచిది కాదు. కాబట్టి మేం దాని గాఢతను బాగా తగ్గించి.. మన కన్నీటి పీహెచ్ విలువకు దాదాపు దగ్గరగా తెచ్చాం" అని నిఖిల్ తెలిపారు. ఈ చుక్కలు వేయగానే.. అందులోని ఔషధం కనుపాపలు కుచించుకుపోయేలా చేస్తుందని, దానివల్ల 'డెప్త్ ఆఫ్ ఫీల్డ్' పెరిగి కంటి చూపు నిశితమవుతుందని ఆయన వివరించారు.

ఆవుల స్మగ్లర్ అనుకొని

12వ తరగతి విద్యార్థి కాల్చివేత

కారుతో 30 కిమీలు వెంబడించి కాల్పులు.. 'గో రక్షణ' మూకకు చెందిన ఐదుగురి అరెస్టు



'గోరక్షణ' మూక దాడిలో ధ్వంసమైన కారు



ఆర్యన్

ఫరీదాబాద్, సెప్టెంబరు 3 : ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారిలో దారుణం జరిగింది. ఆవుల స్మగ్లర్ అనుకొని కారుతో 30 కిలోమీటర్లు వెంబడించి మరీ ఓ యువకుడిని(12వ తరగతి విద్యార్థి) 'గో రక్షణ' మూక తుపాకీతో కాల్చి చంపింది. ఈ హత్యకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. గత నెల 23వ తేదీన జరిగిన ఈ దారుణ హత్య ఆలస్యంగా వెలుగు చూసింది. ఆవుల స్మగ్లర్లు రెండు ఎస్‌యూవీ కారుల్లో ఫరీదాబాద్‌లో రెక్కీ నిర్వహిస్తున్నారని ఆగస్టు 23వ తేదీ రాత్రి 'గో రక్షణ' మూకకు సమాచారం అందింది. అదే సమయంలో ఆర్యన్ మిశ్రా(19), హర్షిత్, శాంకీ అనే యువకులు తమ స్నేహితులైన మరో ఇద్దరు యువతులతో కలిసి ఎస్‌యూవీ కారులో అటుగా వెళ్లారు. హర్షిత్ కారు నడుపుతుండగా ఆర్యన్ మిశ్రా అతని పక్క సీట్లో కూర్చొని ఉన్నాడు. వాళ్లని ఆవుల స్మగ్లర్లుగా భావించిన 'గో రక్షణ' మూక మరో కారుతో ఢిల్లీ- ఆగ్రా జాతీయ రహదారిలో సుమారు 30 కిలోమీటర్లు వాళ్లని వెంబడించింది. తుపాకీలు చూపి కారు ఆపమని ఆ యువకులను పలుమార్లు హెచ్చరించింది. అయితే, ఆ మూకను దోపిడి దొంగలుగా భావించిన యువకులు వారి బెదిరింపులకు భయపడి తమ వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో గదపురి టోల్ ప్లాజా వద్ద పెట్టిన బ్యారికేడ్లను ఢీకొట్టి వెళ్లారు. దీంతో 'గో రక్షణ' మూకకు చెందిన వారు తుపాకీతో కాల్పులు జరపగా.. ఆర్యన్ మిశ్రాకు బుల్లెట్ గాయమైంది. ఆపై, హర్షిత్ వాహనాన్ని నిలిపివేయగా.. దూసుకొచ్చిన 'గో రక్షణ' మూక సభ్యులు ఆర్యన్ గుండెల్లోకి నేరుగా మరోసారి కాల్చారు. దీంతో ఆర్యన్ మిశ్రా అక్కడికక్కడే మరణించాడు. అనంతరం కారులో మరో ఇద్దరు యువతులను చూసిన 'గో రక్షణ ' మూక తాము దాడి చేసింది స్మగ్లర్లపై కాదని గ్రహించి పరారయ్యారు. పరారైన ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కాగా, ఆర్యన్ మిశ్రా అతని స్నేహితులపై కాల్పులు జరిపింది 'గో రక్షణ' మూక అనేందుకు తగిన ఆధారాల్లేవని ఫరీదాబాద్ ఏసీపీ(క్రైమ్) అమన్ యాదవ్ విలేకరులతో అన్నారు. అయితే, గో సంరక్షణకు సంబంధించి నిందితులు మాట్లాడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇక, ఆర్యన్ మిశ్రా అతని స్నేహితులను వెంబడించిన వారిలో తన కుమారుడు ఉన్న మాట నిజమే కానీ అతను నిరపరాధి అని నిందితుల్లో ఒకరైన అనిల్ కౌశిక్ తల్లి విలేకరులతో అన్నారు. మరణించిన యువకుడు ఉన్న కారులో నుంచే మొదటి బుల్లెట్ వచ్చిందని కౌశిక్ తనకు చెప్పాడని తెలిపారు. గో సంరక్షణ చేస్తూ తన కొడుకు సమాజ సేవ చేస్తుంటాడని ఆమె పేర్కొన్నారు.

లోకం తీరు



బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం

బట్టబయలైంది

» బుల్డోజర్ నీతిపై సుప్రీం వ్యాఖ్యలను స్వాగతించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం బట్టబయలైందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ అన్నారు. నిందితులైనంత మాత్రాన వాళ్ల ఇళ్లను కూల్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన తన ఎక్స్ పోస్టులో ప్రస్తావించారు. బీజేపీ అన్యాయమైన, రాజ్యాంగ వ్యతిరేకమైన బుల్డోజర్ నీతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని చెప్పారు. బుల్డోజర్ల కింద మానవత్వం, న్యాయాలను తొక్కేసిన బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం సుప్రీం వ్యాఖ్యలతో బట్టబయలైందన్నారు. అంతులేని అధికారానికి ప్రతీకగా మారిన బుల్డోజర్ మానవ హక్కులను మంట గలుపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ న్యాయం ముసుగులో భయోత్పాతాన్ని సృష్టిస్తూ పేదలు, దళితుల ఇళ్లను బుల్డోజర్ల పద ఘట్టనలో నేలమట్టం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యతిరేకంగా చేపడుతున్న కూల్చివేతలను ఆపేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్లపై ప్రాణాలు హరీ!

దుర్ఘటనల్లో 43% మరణాలు రోడ్డు ప్రమాదాలతోనే

» మృతుల్లో 86% మంది పురుషులే

» వెల్లడించిన కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: దుర్ఘటనల్లో సంభవించే మరణాలకు రోడ్డు ప్రమాదాలే అతి పెద్ద కారణంగా నిలుస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఒక నివేదిక వెల్లడించింది. దాదాపు 43% మరణాలు యాక్సిడెంట్ల వల్ల సంభవిస్తున్నాయని, అతి వేగమే దీనికి ప్రధాన కారణమని తెలిపింది. అత్యధికులను బలిగొంటున్న దుర్ఘటనల్లో రోడ్డు ప్రమాదాల తర్వాత.. ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగిపోవటం, ఎత్తైన ప్రదేశం నుంచి కింద పడటం, విషప్రభావం, అగ్నిప్రమాదాలు మొదలైనవి ఉన్నాయి. 'దుర్ఘటనల నివారణకు జాతీయ వ్యూహం' పేరుతో కేంద్ర ఆరోగ్యశాఖ రూపొందించిన ఈ నివేదికను ఢిల్లీలో జరుగుతున్న 'దుర్ఘటనల నివారణ, సురక్షిత విధానాలు-14వ అంతర్జాతీయ సదస్సు'లో విడుదల చేశారు. 2022లో దుర్ఘటనల కారణంగా దేశంలో 4,30,504 మరణాలు, ఉద్దేశపూర్వకంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో 1,70,924 మరణాలు సంభవించాయని ఈ నివేదిక వెల్లడించింది. కాగా, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారిలో 86% మంది పురుషులే ఉండటం గమనార్హం. 75.2% రోడ్డు ప్రమాద మరణాలకు అతివేగం కారణమవుతుండగా, 5.8% మరణాలకు రాంగ్‌రూట్ డ్రైవింగ్, 2.5% మరణాలకు మద్యం, డ్రగ్స్ తీసుకొని వాహనం నడపటం కారణంగా నిలుస్తోంది. దేశంలోని రోడ్లలో కేవలం 2.1% ఉన్న జాతీయ రహదారులు.. అత్యధిక మరణాలకు కారణమవుతున్నాయి.

రూ.1.45 లక్షల కోట్లతో 'రక్షణ' కొనుగోళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: రక్షణ శాఖ రూ.1.44 లక్షల కోట్ల కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నేతృత్వంలోని రక్షణ ఉత్పత్తుల సేకరణ మండలి (డీఏసీ) మంగళవారం అనుమతి ఇచ్చింది. రూ.1,44,716 కోట్ల విలువైన కొనుగోళ్లకు సంబంధించిన 10 ప్రతిపాదనలను ఆమోదించింది. ఇందులో 99% దేశీయంగా తయారైన ఉత్పత్తుల కొనుగోలుకే ఖర్చు చేయనున్నారు. సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కొనుగోళ్లు చేపట్టనున్నారు. యుద్ధ ట్యాంకులు, రేడార్లు, విమానాలను సమకూర్చుకోనున్నారు. సైన్యానికి ఎఫ్ఆర్‌సీవీ (భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే యుద్ధ వాహనాలు)లను కొనుగోలు చేయనున్నారు. ఈ అత్యాధునిక ఆయుధాలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా శత్రువులపై పోరాడడంలో ఉపయుక్తంగా ఉంటాయి. అలాగే తీరప్రాంత రక్షణ దళానికి డార్నియర్-228 విమానాలు, గస్తీ నౌకలను సమకూర్చనున్నారు.

హత్యాచారానికి మరణశిక్ష

» బెంగాల్ అసెంబ్లీలో బిల్లు ఆమోదం

» ప్రధాని ఇలాంటి చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గు పడాల్సిన అంశం: మమత



కోల్‌కతా, సెప్టెంబరు 3: అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించేలా రూపొందించిన బిల్లును పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. అపరాజిత మహిళ, శిశు(పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాల సవరణ) పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా.. ముందుగా హామీ ఇచ్చినట్లు బీజేపీ సభ్యులు ఓటింగ్ కోసం పట్టుబట్టలేదు. కేంద్ర చట్టాలు– భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), చిన్నారులపై అత్యాచారాల నిరోధక చట్టం(పోక్సో)లో తగు సవరణలు చేయాల్సిందిగా ఈ బిల్లు సూచిస్తోంది. ముఖ్యంగా.. హత్యాచారాలు, అత్యాచారాలతో బాధితురాలి మానసిక స్థితి దెబ్బతినేలా చేసే నిందితులకు మరణ శిక్ష విధించాలని అపరాజిత బిల్లు స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కాగా, సభలో బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. "మా ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు తరహాలో.. ప్రధాని మోదీ చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గుపడాల్సిన అంశం. ఈ బిల్లును హుందాగా ఆమోదించాల్సిందిగా గవర్నర్‌ను కోరుతున్నాను. సభలో విపక్ష నేత(బీజేపీ) కూడా గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టకుండా, వీలైనంత త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఘటనలో సీబీఐ న్యాయం చేయాలని ఆమె కోరారు. "ఆర్‌జీ కర్ హత్యాచారం ఘటనపై వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ సభ్యులు, నేతలు.. ఉన్నావ్(ఉత్తరప్రదేశ్) ఉదంతంపై ఎందుకు నోరు మెదపలేదు?" అని ఆమె నిలదీశారు. ఉన్నావ్ కేసులో నిందిత చట్ట సభ్యుడిని పూలమాలలతో సత్కరించడం సిగ్గుపడే విషయమంటూ మండిపడ్డారు.

బెంగాల్ సర్కారు కోర్టు ధిక్కరణ!

» సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం

న్యూఢిల్లీ/కోల్‌కతా, సెప్టెంబరు 3: మమతాబెనర్జీ నేతృత్వంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందంటూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. "ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద కేంద్ర బలగాలకు.. ముఖ్యంగా మహిళా జవాన్లకు బెంగాల్ ప్రభుత్వం రవాణా, వసతి సదుపాయాలు కల్పించడం లేదు. మమత సర్కారు ఉద్దేశపూర్వకంగా సహాయ నిరాకరణ చేస్తోంది. ఈ చర్యలు సుప్రీంకోర్టు ఆదేశాలకు విఘాతం కలిగిస్తున్నాయి" అని ఆ అఫిడవిట్‌లో వెల్లడించింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రి వద్ద కేంద్ర బలగాల భద్రతకు సుప్రీం కోర్టు ఆగస్టు 21న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో అవినీతిపై అరెస్టయిన ఆ దవాఖానా మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్, సహ నిందితులు బిప్లవ్ సింఘా, సుమన్ హజ్రా, అఫ్సర్ అలీ ఖాన్‌ను ఎనిమిది రోజుల పాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోల్‌కతాలోని సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది.

సలామ్ సుభాన్



ఎక్స్‌కవేటర్ డ్రైవర్ సుభాన్

ఖమ్మం వరదలో చిక్కుకున్న 9 మందిని కాపాడిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్

» పోతే ఒక్కడినే తిరిగొస్తే 9 ప్రాణాలంటూ సాహసం

» మరో ముగ్గురి సహకారంతో రక్షించిన వైనం





వరద తీవ్రతకు వంతెనపై చిక్కుకున్న బాధితులు, సుభాన్ బదులు మరొకరని సన్మానించిన బీఆర్ఎస్ నేతలు

ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సినిమా హీరోలు తెరపై అద్భుతాలు చేస్తుంటారు. ఒంటి చేత్తో పోరాడి వందల మందిని అవలీలగా కాపాడేస్తుంటారు. నిజ జీవితంలో ఇలాంటివి జరగవు కానీ.. కొందరు తమ ధైర్య సాహసాలతో రియల్ హీరోలుగా నిలుస్తుంటారు. హరియాణాకు చెందిన సుభాన్ అనే ఎక్సకవేటర్ డ్రైవర్ కూడా ఓ రియల్ హీరోనే.. దివ్యాంగుడైనా ప్రకృతిని సవాలు చేస్తూ వరదకు ఎదురెళ్లి ఒకటి, రెండు కాదు ఏకంగా తొమ్మిది ప్రాణాలను కాపాడాడు. పోతే ఒక్కడినే.. తిరిగొస్తే తొమ్మిది ప్రాణాలతో వస్తా.. అనే సంకల్పంతో సాహసం చేసి ఖమ్మంలో వరదలో చిక్కుకున్న వారిని రక్షించి ప్రజలందరితోనూ సలామ్ కొట్టించుకున్నాడు సుభాన్.. ఆ తొమ్మిది మందిని రక్షించడంలో సుభాన్‌కు మరో ముగ్గురు కూడా సహకరించారు. వివరాల్లోకి వెళ్లితే.. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరికి చెందిన ఓజుబోయిన శ్రీనివాసరావు కుటుంబానికి ఖమ్మంలోని మున్నేరు నదీ తీరంలో చికెన్ షాప్ సహా పలు వ్యాపారాలు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో 20 మంది వరకు పని చేస్తుండగా వాళ్లలో ఎనిమిది మంది ఆ దుకాణాల వెనకే నివాసముంటారు. ఎప్పట్లాగే వారంతా ఆదివారం ఉదయం కూడా దుకాణాలు తెరిచారు. కానీ, భారీ వర్షాలకు మున్నేరు పొంగడంతో ఉదయం ఎనిమిద్నర ప్రాంతంలో వరద నీరు ఆ దుకాణాలను తాకింది. చికెన్ కొనుగోలుకు వచ్చిన ఓ వ్యక్తి వరదలో మునిగిపోతుండగా పోలీసులు అతన్ని కాపాడారు. అనంతరం ఆయా దుకాణాల్లో పని చేసే ఎనిమిది మంది అక్కడే ఉండే మరో యువకుడు కలిసి ప్రకాష్‌నగర్ వంతెన దాటేందుకు ప్రయత్నించగా వరద పోటెత్తింది. వారు సగం దూరం వెళ్లేసరికి వెంకటగిరి వైపు కూడా వరద ముంచెత్తగా ఆ తొమ్మిది మంది అక్కడే వంతెనపై ఉండిపోయారు. వాళ్లని రక్షించేందుకు సిద్ధమైన ప్రభుత్వం.. హెలికాప్టర్లు తెప్పించేందుకు యత్నించింది. చాయి. కానీ, ప్రతికూల వాతావరణం వల్ల అది సాధ్యం కాలేదు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రకాష్ నగర్ వైపు నుంచి తాడు సహాయంతో బాధితుల దగ్గరికి వెళ్లేందుకు విఫలయత్నం చేశాయి. అనంతరం పడవలను సిద్ధం చేసినా బాధితులను చేరుకోలేకపోయాయి. ఈలోగా సమయం రాత్రి 11 గంటలు కాగా...వంతెనపైన ఉన్నవారిని రక్షించేందుకు హరియాణాకు చెందిన సుభాన్ ముందుకొచ్చాడు. పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చిన సుభాన్ తన ఎక్స్‌కవేటర్‌తో వంతెనపైకి వెళ్లాడు. కొంతదూరం వెళ్లేసరికి నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో వాహనాన్ని ఆపేశాడు. అయితే, సుభాన్‌తో పాటు వెళ్లిన జవహర్‌లాల్, ఉపేందర్, నాగేశ్వరరావు.. వంతెన పక్కన ఓ చెట్టుకు తాడు కట్టి.. దాని సాయంతో వరదలో చిక్కుకున్న వారి దగ్గరకు వెళ్లారు. తిరిగి అదే తాడు సాయంతో ఒక్కొక్కరిని ఎక్స్‌కవేటర్ వద్దకు చేర్చగా.. సుభాన్ అందరినీ సురక్షితంగా వరద నుంచి బయటికి తీసుకొచ్చాడు. బాధితులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకోగా సుభాన్‌ను ప్రతి ఒక్కరూ ప్రశంసించారు.

వేరే వ్యక్తికి బీఆర్ఎస్ నేతల సత్కారం

వరద బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ఖమ్మం వచ్చిన బీఆర్ఎస్ నేతలు సుభాన్ విషయంలో పొరపాటు పడ్డారు. తొమ్మిది మందిని కాపాడిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్ సుభాన్ అనుకొని మరో వ్యక్తిని అభినందించి సన్మానించారు. సుభాన్ వల్ల వరద నుంచి బయటపడిన ఈ విషయం చెబుతున్నారు. బీఆర్ఎస్ నేతలు సన్మానించిన వ్యక్తి ఎవరో తమకు తెలియదని పేర్కొన్నారు.

తొమ్మిది మంది ఎమ్మెల్యేలున్నా


9 మందిని కాపాడలేకపోయారు

సహాయ చర్యల్లో రాష్ట్ర సర్కారు పూర్తిగా విఫలం.. సీఎం రేవంత్ పాలనపై పట్టు కోల్పోయారు

» బాధితులకు రూ.10వేలు ఇస్తామనడం సిగ్గు చేటు

» ఖమ్మంలో మున్నేరు బాధితులకు హరీశ్ పరామర్శ

» సాయం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచన



కాగిత రామచంద్రాపురంలో స్థానికులతో మాట్లాడుతున్న హరీశ్

ఖమ్మం టౌన్/నడిగూడెం, సెప్టెంబరు 3: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా మున్నేరు వరదల్లో ప్రకాశ్‌నగ్ బ్రిడ్జిపై చిక్కుకున్న 9మందిని బయటికి తీసుకురాలేకపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరదల సమయంలో సహాయ కార్యక్రమాల కోసం కనీసం ఒక హెలికాప్టర్‌ను కూడా అందుబాటులోకి ఉంచలేకపోయిందన్నారు. మంగళవారం బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం ఖమ్మంలో మున్నేరు వరద ముంపు ప్రాంతాలను సందర్శించి బాధితులతో మాట్లాడి పరామర్శించింది. ఆ తర్వాత ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ మాట్లాడారు. రాష్ట్రంలో వరదల్లో 30మంది చనిపోతే సీఎం రేవంత్‌రెడ్డి 16మంది చనిపోయారని చెప్పి వరద రాజకీయం చేస్తున్నారని హరీష్‌రావు దుయ్యబట్టారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు సహాయ చర్యల్లో విఫలం కావటంతో సీఎం సమీక్షలు నిర్వహించారని, ఆ సమీక్షల్లోనూ ప్రతిపక్షాలను తిట్టడం తప్ప సహాయ చర్యలపై ఏం నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. పరిపాలనపై పట్టు కోల్పోయిన సీఎం ప్రతిపక్షాలపై బురదజల్లుతున్నారన్నారు. వరద బాధిత కుటుంబాలకు కేవలం రూ.10వేలు అందచేస్తామని రేవంత్ ప్రకటించడం సిగ్గుచేటని హరీశ్ అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు కోల్పోయినవారికి రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన తమపై పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ గూండాలు దాడిచేశారని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష నేతలతో కలిసి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిసి వరద నష్టం సాయంపై నిలదీయాలని హరీశ్‌రావు సూచించారు. ఢిల్లీకి వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

తూములు మూసి వెల్డింగ్ చేయడం వల్లే

సూర్యాపేట జిల్లా వరదలతో పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు, ఇసుక మేటల తొలగింపునకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువకు రెండు చోట్ల గండి పడిన ప్రదేశాలను హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే కాల్వకు గండిపడిందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. సాగర్ కాల్వకు గండి ఘటనను అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. ఎండాకాలంలో తాగునీటి కోసం ఖమ్మం జిల్లా మంత్రులు సాగర్ నీటిని ఎడమ కాల్వ ద్వారా పోలీస్ పహారా మధ్య పాలేరుకు తరలించి గండికి కారణమయ్యారని జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో షట్టర్లు, తూములు మూసివేసి వెల్డింగ్ చేసి వదిలివేయడంతోనే తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పాలేరు బ్యాక్ వాటర్, సాగర్ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల ఉధృతి పెరిగినప్పటికీ షట్టర్లు తెరవకపోవడంతో కాల్వకు భారీ గండ్లు పడ్డాయన్నారు.



సుడిగాలుల తీవ్రతకు నేలమట్టమైన భారీ వృక్షాలు, పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మేడారం అడవుల్లో సుడిగాలుల బీభత్సం

50 వేలకు పైగా చెట్లు నేలమట్టం

» టోర్నడో తరహా గాలులు కావచ్చు: నిపుణులు

వరంగల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో సుమారు 50 వేల చెట్లు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్దఎత్తున గాలిదుమారం, సుడిగాలుల బీభత్సంతో మహావృక్షాలు సైతం చిగురుటాకుల్లా రాలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 1న పరిశీలనకు వెళ్లిన అధికారులు.. ఈదృశ్యాలను చూసి, షాక్‌కు గురయ్యారు. అయితే.. టోర్నడోల్లాంటి బలమైన సుడిగాలులే ఈ స్థాయిలో చెట్లను కూల్చివేస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. "టోర్నడోలు ఒక స్పష్టమైన మార్గంలో వెళ్తాయి. కుప్పకూలిన చెట్లు కూడా ఒకవైపే పడి ఉన్నాయి. భారీ వృక్షాలు కూడా నేలకొరగడాన్ని బట్టి.. కనీసం గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులే దీనికి కారణమై ఉండొచ్చు" అని వివరించారు. అయితే 50 వేల చెట్లు ఒకేసారి నేలకొరగడంపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై డీఎఫ్‌వో రాహుల్ జావేద్ నేతృత్వంలోని బృందం ఉపగ్రహ డేటా, భారత వాతావరణ శాఖ(ఐఎండీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)తో కలిసి పరిశీలన జరుపుతోంది. మంగళవారం ఆయన.. సీసీఎఫ్ ప్రభాకర్‌తో కలిసి తాడ్వాయ్-మేడారం అడవుల్లో నేలమట్టమైన చెట్లను పరిశీలించారు.



హేమాని, బుజ్జి దంపతులు, నసీమా(ఫైల్)

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

ముగ్గురి దుర్మరణం

» నలుగురికి గాయాలు

పాలకుర్తి, సెప్టెంబరు 3: ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టగా ముగ్గురు మృతిచెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామశివారులో మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పాలకుర్తి నుంచి తొర్రూరుకు ప్రయాణికులతో వెళ్తుండగా వావిలాల గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బొగ్గు లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యా తండాకు చెందిన జాటోతు హేమాణి (55), బుజ్జి(50) దంపతులతోపాటు పాలకుర్తికి చెందిన ఎండీ. నసీమా (55) మృతి చెందారు. లారీడ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడంవల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

5 కొత్త గనుల్లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలి

» సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు కొత్త గనుల్లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ బలరామ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెం వీకే ఓపెన్‌కాస్ట్, ఇల్లందులోని రొంపేడు ఓపెన్ కాస్ట్, బెల్లంపల్లి గోలేటి ఓపెన్ కాస్ట్, రామగుండం కోల్ మైన్ పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

బాబోయ్.. లేక్ వ్యూ

చెరువు ఫేసింగ్ ఉన్న ఫ్లాట్ల అమ్మకాలపై హైడ్రా దెబ్బ.. గతంలో అలాంటి ఫ్లాట్లకు ప్రీమియం ధరలు

(హైదరాబాద్ సిటీబ్యూరో ప్రతినిధి-ఆంధ్రజ్యోతి)

రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వ్యాపార గమనాన్ని.. 'హైడ్రా' పూర్తిగా మార్చేసిందనడంలో సందేహం లేదు. చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ల గురించి వినియోగదారుల్లో అది తెచ్చిన అవగాహన అంతా ఇంతా కాదు!! హైడ్రా ప్రభావం ఏ స్థాయిలో ఉందంటే.. మొదట్లో దాని గురించి పెద్దగా పట్టించుకొని స్థిరాస్తి వ్యాపారులు ఇప్పుడు అనుక్షణం దాని గురించే మాట్లాడుకుంటున్నారు. నిద్రలోనూ హైడ్రా మీదనే ఆలోచనలు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలను హైడ్రా నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తుండడం.. ప్రజల్లో కూడా దీనిపై చైతన్యం రావడంతో రియల్‌ఎస్టేట్ సంస్థలు తమ మార్కెటింగ్ వ్యూహాల్ని పూర్తిగా మార్చేశాయి. లేక్ వ్యూ అనే మాటను మాటవరసకు చెప్పటానికి కూడా భయపడుతున్నాయి. నిజంగా తమ ప్రాజెక్టులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో లేకున్నా.. కాస్త దూరంలో ఉన్నా కూడా 'లేక్ వ్యూ' అనే మాటే ప్రస్తావించేందుకు ఇష్టపడటం లేదు. "గతంలో మా వద్దకు వచ్చే వినియోగదారులు హెచ్ఎండీఏ అనుమతులున్నాయా? రెరా నిబంధనలను పాటిస్తున్నారా? తదితర ప్రశ్నలే అడిగేవారు. ఇప్పుడు.. 'మీ ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో లేదు కదా?' అని అడుగుతున్నారు" అని నగరానికి చెందిన ఒక ప్రముఖ బిల్డర్ పేర్కొన్నారు. సదరు బిల్డర్ ఇటీవల నిర్మించిన ఒక అపార్ట్‌మెంట్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌కు ఆమడదూరాన ఉంది. ఆ వెంచర్ వేసినప్పుడు 'లేక్ వ్యూ' గురించి గొప్పగా చెప్పి ప్రీమియం ధరకు ఫ్లాట్లు అమ్మిన ఆయన.. ఇప్పుడు మిగిలిన ఫ్లాట్లను అమ్మే విషయంలో నానా తిప్పలు పడుతున్నారు. "నిజానికి ఈ ప్రాజెక్టు మీద లాభం మొత్తం.. మిగిలిన ఈ ఫ్లాట్ల మీదనే ఉంది. 'రెడీ టూ మూవ్' కాబట్టి ఎక్కువ ధర వస్తుందనుకున్నా. కానీ, హైడ్రా దెబ్బతో ఇవి అమ్ముడు కావడం కష్టంగా మారింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు.. ఇప్పటికే అందులో ఫ్లాట్లు కొన్నవారు సైతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గురించి ప్రశ్నల



మీద ప్రశ్నలు వేస్తున్నట్లు చెప్పారు. "మా ప్రాజెక్టు చెరువుకు చాలా దూరాన ఉంది. నాలుగైదు అంతస్తుల వారికి వ్యూ బాగుంటుంది. అదే మాట చెప్పి వారికి ప్రీమియం ధరకు అమ్మాం. ఇప్పుడు వారిని సమాధానపర్చటం కష్టంగా మారింది" అని వాపోయారాయన.

మారిన ప్రచారం..

ఐటీ కారిడార్‌లో ఒక భారీ ప్రాజెక్టు చేపట్టిన పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థ.. తొలుత 'లేక్ వ్యూ' పేరుతో భారీగా ప్రచారం చేసి జోరుగా ఫ్లాట్ల బుకింగులను కొనసాగించింది. ఆ వ్యూ ఉన్న ఫ్లాట్ల ధరను చదరపు అడుగుకు రూ.500 అదనంగా చెప్పినా వినియోగదారులు ఎగబడి బుక్‌చేశారు. కానీ, హైడ్రా ఎంట్రీ తర్వాత ఆ ప్రచారమే సదరు సంస్థకు శాపంగా మారింది. గతంలో టోకెన్ అడ్వాన్స్ ఇచ్చి ఫ్లాట్ బుక్ చేసిన వారు ఇప్పుడు వాటిని రద్దు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొత్తగా కొనేవారూ 'లేక్ వ్యూ' గురించి ఆరా తీస్తూ అనుమానాల్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ సంస్థ తన బ్రోచర్లు, ప్రచార హోర్డింగుల్లో లేక్ వ్యూ అనే మాటను 'గార్డెన్ ఫేస్'గా మార్చేసింది. ఆ ఒక్క సంస్థే కాదు.. చెరువులకు దగ్గరగా ప్రాజెక్టులు చేపట్టిన అన్ని రియల్ ఎస్టేట్ సంస్థలదీ ఇప్పుడు అదే దారి. బిల్డర్లంతా ఇప్పుడు తమ మార్కెటింగ్ సిబ్బందికి ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్లాట్‌ను బుక్ చేసే సమయంలోనూ.. క్లయింట్‌తో మాట్లాడే సమయంలో లేక్ వ్యూ ప్రస్తావన రాకూడని స్పష్టం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'లేక్ వ్యూ' అనే మాటే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వర్గాల్లో నిషిద్ధంగా మారిందంటే అతిశయోక్తి కాదు.

వందలాది ఫ్లాట్లు.. కొనేవారు లేక..

మార్కెట్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మియాపూర్ మక్తా, నల్లగండ్ల చెరువు, దేవుని కుంటకు దూరాన ఉన్న ప్రాజెక్టుల్లో వందలాది ఫ్లాట్లు అమ్ముడుపోని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ఉన్నట్లు చెబుతున్నారు. దుర్గంచెరువు దగ్గర్లో నిర్మాణాల్ని ప్రారంభించాలనుకున్న వారిలో చాలామంది ఆ ప్రాజెక్టులను పూర్తిగా ఉపసంహరించుకునే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

సెకండ్ సేల్ ఎలా?

గతంలో చెరువు ఫేసింగ్‌తో ఉన్న ఫ్లాట్లు కొన్నవారికి ఇప్పుడు కొత్త దిగులు పట్టుకుంది. అలాంటి ఫ్లాట్లకు ఒకప్పుడు సెకండ్ సేల్స్‌లోనూ బాగా డిమాండ్ ఉండేదని.. ఇప్పుడా గిరాకీ దారుణంగా పడిపోయిందని వారు వాపోతున్నారు. ఉదాహరణకు.. మియాపూర్‌కు చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగి తనకున్న లేక్ వ్యూ ఫేసింగ్ డబుల్ బెడ్రూం ఫ్లాట్‌ను అమ్మకానికి పెట్టారు. అనుకున్న ధర రాకపోవడంతో మొదట్లో వచ్చిన ఆఫర్లకు నో చెప్పారు. కానీ, ఇప్పుడా ఫ్లాట్‌ను కొనడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి. గతంలో కొనేందుకు ఆసక్తి చూపిన వారికి ఫోన్ చేస్తే.. 'చెరువులకు దగ్గరగా ఉన్న ఫ్లాట్లను కొనాలనుకోవట్లేదు' అని తెగేసి చెబుతున్నారని ఆయన తెలిపారు. నగరంలో ఇలాంటి అనుభవాలు చాలామందికి ఎదురవుతున్నాయి. అలాగే.. గతంలో లేక్ వ్యూ ఉన్న స్థలాల యజమానుల హవా నడిచేది. ఇప్పుడా పరిస్థితి లేదు సరికదా.. ఆ యజమానులతో చేసుకున్న ఒప్పందాలనూ రద్దు చేసుకునేందుకు బిల్డర్లు సిద్ధమవుతున్నారు.

ఎస్‌డీఆర్ఎఫ్ నిధులను వాడండి

» రాష్ట్ర సర్కారు వద్ద 1,345 కోట్లు ఉన్నాయ్

» అందులో కేంద్రం వాటా నగదు కూడా ఉంది

» ఈసారీ ఘనంగా విమోచన దినం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్(ఎస్‌డీఆర్ఎఫ్)ను తక్షణమే వినియోగించి బాధితులను ఆదుకోవాలని కేంద్ర మంత్రి.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.1,345 కోట్ల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఉన్నాయని తెలిపారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎస్‌డీఆర్ఎఫ్‌కు కేంద్రం కూడా నిధులు ఇస్తుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌డీఆర్ఎఫ్ వినియోగానికి సంబంధించిన సర్టిఫికెట్ల(యూసీ)ను కేంద్రానికి సమర్పించకపోవడంతో గత జూన్ 1న రూ.208కోట్లు విడుదలైనా రాష్ట్రానికి చేరుకోలేదన్నారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా యూసీలు ఇవ్వకున్నా రాష్ట్రానికి ఆ నిధులు విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శిని కోరానని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల మరణించిన వారి కుటుంబాలకు కేంద్రం రూ.3లక్షల పరిహారం ఇస్తుందని కిషన్‌రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్ ప్రకటించిన రూ.5 లక్షల పరిహారంలో కేంద్రం వాటా ఉందా? లేక రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందా..? స్పష్టం చేయాలని కోరారు. తెలంగాణలో 75 ఏళ్ల తర్వాత వినాయక నిమజ్జనం.. హైదరాబాద్ విమోచన దినోత్సవం ఒకే రోజు జరుగుతున్నాయని.. ఇది యాదృచ్ఛికమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో హైదరాబాద్ ముక్త్ దివస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో భారీవర్షాలు, వరదపై ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి కిషన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం, నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఈటల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అమీన్‌పూర్‌లో కూల్చివేతలు

హైడ్రా ఆదేశాలతో రంగంలోకి అధికారులు.. సర్కారీ భూముల్లో నిర్మాణాల తొలగింపు

» అడ్డుకునేందుకు మునిసిపల్ చైర్మన్ యత్నం.. అధికారులతో వాగ్వాదం.. పరిస్థితి ఉద్రిక్తం

» ఐలాపూర్ తండాలో హద్దురాళ్ల తొలగింపు

» హిమాయత్ సాగర్ పరివాహక ప్రాంతంలో హైడ్రా అధికారుల బృందం రహస్య పర్యటన



ఫ్యూజన్ స్కూల్ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పటాన్‌చెరు, మొయినాబాద్/శంషాబాద్, ఎల్బీనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైడ్రా ఆదేశాల మేరకు.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్ల ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను జిల్లా యంత్రాంగం మంగళవారం కూల్చివేసింది. అయితే, ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన మునిసిపల్ చైర్మన్.. ఈ కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల జోక్యంతో కూల్చివేతలు కొనసాగాయి. అమీన్‌పూర్ పరిధిలోని పలు ఆక్రమణలను ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్ మూడుసార్లు స్వయంగా పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. హైడ్రాకు అందిన ఫిర్యాదులు, నివేదికల మేరకు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు అధికారులు ఐలాపూర్ తండాకు చేరుకున్నారు. ప్రభుత్వ భూమిలో వేసిన లే-అవుట్ హద్దురాళ్లను తొలగించారు. అక్కడ నిర్మించిన గదిని నేలమట్టం చేశారు. అది ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. తర్వాత అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధి బందంకొమ్ము రోడ్డులో ఉన్న సర్వే నంబర్ 462లో ఆక్రమణలను తొలగించారు. ఫ్యూజన్ ఇంటర్నేషనల్ స్కూల్ సెక్యూరిటీ గదితో పాటు గేట్‌ను, ప్రహరీని తొలగించారు. సర్వే బృందాల సూచలన మేరకు మార్కింగ్ చేసి, హద్దులను ఏర్పాటు చేశారు. కాగా.. సర్వే నంబర్ 462లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను తొలగించేటప్పుడు.. మునిసిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అక్కడికి చేరుకుని అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తాను కొనుగోలు చేసిన భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ.. తనకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా అందులోని కట్టడాలను కూల్చివేయడం తగదని, కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారని వాగ్వాదానికి దిగారు. కూల్చివేతలు జరగకుండా ఓ వాహనాన్ని అడ్డంగా నిలిపారు. ఆయనకు మద్దతుగా ఆయన అనుచరులు పెద్ద ఎత్తున వాహనాల్లో అక్కడికి తరలివచ్చారు. మునిసిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్లు అక్కడికి చేరుకున్నారు. రాజకీయ కక్షతోనే కూల్చివేతలు చేపడుతున్నారని ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కానీ, పోలీసులు వారిని చెదరగొట్టి కూల్చివేతలు కొనసాగేలా చూశారు. దీంతో అక్కడున్న దుకాణాల వారు తమ సామగ్రిని తరలించారు.

హిమాయత్‌సాగర్ పరిధిలో..

వారం రోజులుగా హిమాయత్‌సాగర్ పరివాహక ప్రాంతంలో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు.. మంగళవారం మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్, నాగిరెడ్డి గూడ రెవెన్యూ పరిధిలో రహస్యంగా పర్యటించినట్టు తెలుస్తోంది. కాగా.. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఆక్రమణలు, కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని టీపీసీసీ క్యాంపెయినింగ్ కమిటీ చైర్మన్, మాజీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. చెరువుల ఆక్రమణలపై ఆయన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

చంపాపేటలో చెరువుల పరిశీలన

చంపాపేట, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): హైడ్రా అధికారులు మంగళవారం.. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని మద్దెల కుంట చెరువు, హస్తినాపురం డివిజన్ భూపేష్‌గుప్తానగర్ కాలనీ సమీపంలోని చేపలచెరువు(నూర్ఖాన్‌కుంట)ను పరిశీలించారు. మద్దెలకుంట చెరువును ఆనుకొని ఉన్న పార్కింగ్ స్థలం, గోదాములు, రింగ్‌రోడ్‌లోని వాణిజ్య సముదాయాలతో పాటు పలు గృహాలను.. చేపలచెరువులో నిర్మించిన ఇండ్లతోపాటు ఖాళీ స్థలాలనూ పరిశీలించారు. ఆక్రమణలకు గురైన చెరువు స్థలాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి ఆక్రమణలపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్..

9 మంది నక్సల్స్ మృతి

చర్ల/చింతూరు, సెప్టెంబరు 3: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవులు మరోమారు కాల్పుల మోతతో దద్దరిల్లాయి. బీజాపూర్-దంతేవాడ సరిహద్దుల్లోని లోహగావ్, పురంగెల్ కొండపై మంగళవారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 9 మంది నక్సల్స్ మృతిచెందారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి లోహగావ్-పురంగెల్ కొండల మధ్య మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు ఉప్పందుకున్న దంతేవాడ, బీజాపూర్ జిల్లాల డీఆర్‌జీ పోలీసులు, బీఎస్ఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. మంగళవారం ఉదయం బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య నాలుగు గంటల పాటు కాల్పులు కొనసాగాయి. "మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయిన కాసేపటికి బలగాలు ముందుకు చొచ్చుకెళ్లాయి. తొమ్మిది మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం. వారిలో ఆరుగురు మహిళా నక్సలైట్లు. వీరంతా పీఎల్‌జీ-2 గెరిల్లా బెటాలియన్, దర్భా కమిటీకి చెందిన మావోయిస్టులు అని నిర్ధారించాం. ఒక ఎస్ఎల్ఆర్, 303, 315 రైఫిళ్లు, ఒక గ్రెయిన్ గన్, మరొక 12-బోర్ గన్, ఒక బీజీఎల్, మందుపాతరలు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. పెద్దసంఖ్యలో మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారు." అని గౌరవ్‌రాయ్ వెల్లడించారు.

13 మంది మావోయిస్టుల అరెస్టు

బీజాపూర్‌జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెర్రాం అడవుల్లో పోలీసులు సోమవారం 13 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. వారి నుంచి మందుగుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఐఈడీ మందుపాతర పేల్చిన ఘటనలో ఈ 13 మంది నిందితులని వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ మణిపూర్ హింస

మణిపూర్‌లో హింస పూర్తిగా తగ్గిపోయిందనీ, ఆర్నెల్లలో రాష్ట్రం ప్రశాంతతని చవిచూడబోతున్నదని ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇందుకు పూర్తిభిన్నంగా మొన్న ఆది, సోమవారాల్లో వరుసగా రెండురోజులపాటు డ్రోన్‌లద్వారా గ్రామాలపై బాంబులు కురిసి, పలువురు మరణించిన ఘటన ఆ రాష్ట్రంలో తెగలమధ్య వైరం ఏమాత్రం చల్లారలేదని, నివురుగప్పిన నిప్పులాగా ఉందని నిరూపించింది. అన్ని నెలల తీవ్రహింసాగ్నిలో కూడా మణిపూర్ ఎన్నడూ ఆకాశంనుంచి బాంబులు పడటం ఎరగదు. ఇప్పుడు కుకీ మిలిటెంట్లు ముందు డ్రోన్ల ద్వారా మీతీ గ్రామాలమీద బాంబులు వేశారు, ఆ తరువాత కొందరు రైఫిళ్ళతో చొరబడి కాల్పులు జరిపారు. మర్నాడు కూడా ఇదే రకమైన రీతిలో దాడి జరిగింది. మూడునెలలుగా ఘర్షణలు కాస్తంత తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ ఘటనలు రాష్ట్రంలో తిరిగి నిప్పురాజేయవచ్చునని భావిస్తున్నారు.

కుకీమిలిటెంట్లు మీతీ గ్రామాలమీద దాడిచేసిన ఈ ఘటనకు ముందు, శనివారం రోజున అక్కడ కుకీ–జో తెగకు చెందిన వందలాది మంది ర్యాలీ నిర్వహించారు. తమకు వేరుగా ప్రత్యేకపాలనావ్యవస్థ ఉండాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ కార్యక్రమం జరిగింది. ఈ తెగవారు ఎప్పటినుంచో ఈ డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఈ ర్యాలీకి ప్రధానకారణం బీరేన్‌సింగ్ చేసినట్టుగా ప్రచారంలో ఉన్న కొన్ని వ్యాఖ్యలు. మీతీతెగకు చెందిన ఆయన స్వజాతి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనీ, మీతీలకు కూడా ఎస్టీ రిజర్వేషన్ ఇప్పించడానికి ఆయన కుట్రపన్నారని, తమ ఉద్యోగాలు, భూములను మీతీలు వశం చేసుకోవడం, తమను కొండలనుంచి తరిమికొట్టడం వారి ఎజెండాలో ఉన్నదని మిగతా ఆదివాసులు అనుమానించిన విషయం తెలిసిందే. అప్పటికే బీరేన్‌సింగ్ తీసుకున్న కొన్ని కుకీ–జో వ్యతిరేక చర్యలకు తోడుగా, మీతీలకు రిజర్వేషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో గత ఏడాది మేనెలలో మీతీ–కుకీల మధ్య తీవ్రమైన హింస రేగి నెలలబాటు రాష్ట్రం అగ్నిగుండమైంది. ఈ పరిణామాలన్నింటికీ సంబంధించి, ముఖ్యంగా తెగలమధ్య వైరాన్ని, హింసను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రోత్సహించడంలోనూ బీరేన్‌సింగ్ ప్రమేయం ఉన్నట్టుగా ఇటీవల లీకైన కొన్ని ఆడియో టేపుల్లో బయటపడింది. ఇందులో స్వయంగా బీరేన్ చేశారంటున్నట్టుగా చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇవి నకిలీటేపులనీ, కొందరు ద్రోహుల, కుట్రదారుల సృష్టి అనీ ప్రభుత్వమూ అధికారపక్షమూ స్పష్టంచేస్తున్నప్పటికీ కుకీ–జో తెగలు మాత్రం తాము ఇంతకాలంగా నమ్ముతున్నదీ, అంటున్నదే ఈ టేపుల్లో ఉన్నదని, అవే నిజాలని వాదిస్తున్నాయి.

ఈ టేపుల ఉదంతంతో బీరేన్‌సింగ్‌ను తప్పించాలన్న డిమాండ్‌కు మళ్ళీ ఊపువచ్చింది. 'నిజం వెలుగుచూసింది, బీరేన్‌ను ప్రాసిక్యూట్ చేయండి' అంటూ కుకీ–జో తెగలకు చెందిన అన్ని సంఘాలూ సంయుక్తంగా శనివారం పెద్ద ర్యాలీ నిర్వహించాయి. బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కుకీ–జోలకు వ్యతిరేకంగా జాతిహననానికి పాల్పడుతున్న నగ్నసత్యం బయటపడిందని నినదాలు చేస్తూ, స్వయంపాలన, బీరేన్ రాజీనామా వీరు ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలను భగ్నంచేసేందుకూ, బలహీనపరచేందుకు ప్రభుత్వం తనవంతు ప్రయత్నాలు చేసింది. మరోపక్క మీతీ సంఘాలు కూడా తమకు ఎస్టీ హోదా ఇవ్వాలనీ, కుకీ–జోలకు దానిని తొలగించాలని డిమాండ్ చేస్తూ అదే రోజున ప్రదర్శనలు నిర్వహించాయి.

నకిలీ టేపులనీ, ఒద్దునపడుతున్న రాష్ట్రంలో తిరిగి మంటలు రేపేందుకు కొందరు కుట్రచేశారనీ బీరేన్‌సింగ్ ప్రభుత్వం గట్టిగా వాదిస్తూ, మరోపక్క విచారణకు ఆదేశించడంతో నివేదికలో ఏమివుంటుందో చాలామందికి అర్థమైపోతోంది. ఇక, ఆర్నెల్లలో రాష్ట్రంలో ప్రశాంతత నెలకొంటుందన్న బీరేన్‌వ్యాఖ్యలు కూడా, ఆయన తమకు వ్యతిరేకంగా మళ్ళీ ఏదో చేయబోతున్నారని కుకీజో తెగల్లో అనుమానాలు పెంచిందట. మీతీల అధిపత్యం, వారి ప్రాబల్యం ఉన్న ప్రాంతాలు మినహా మిగతా ఆదివాసీ తెగలున్న ప్రాంతాలకు స్వయంపాలన కావాలన్న డిమాండ్ నెరవేరనంతవరకూ మణిపూర్‌లో శాంతి ఏర్పడదని కుకీజోల వాదన. అనేకనెలలుగా సాగిన హింస కారణంగా ఇప్పటికే వారంతా ఇంఫాల్ లోయనుంచి వెళ్ళిపోయి మీతీలకు దూరంగా బతుకుతున్నారు. స్వయంపాలన హామీ నెరవేరనంతకాలం రాష్ట్రంలో శాంతి ఏర్పడదనీ, హింస రేగుతూనే ఉంటుందని మీతీ గ్రామాల్లో కాల్పులు, వరుస డ్రోన్‌దాడులు హెచ్చరిస్తున్నాయి.

బీసీసీఐలో అనేక విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన జయ్‌షా ప్రతిష్ఠాత్మక ఐసీసీ చైర్మన్ పదవిని చేపడుతున్న అతిపిన్న వయస్కుడు. అహ్మదాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘం నుంచి మొదలైన జయ్‌షా ప్రస్థానం అనతి కాలంలో దుబాయిలోని అంతర్జాతీయ క్రికెట్ మండలి వరకు జయప్రదంగా సాగింది. పదిహేను సంవత్సరాల వ్యవధిలో క్రికెట్ పాలనా రంగంలో అత్యున్నత శిఖరానికి చేరుకోవడం సాధారణ విషయమేమీ కాదు.

జయ్‌షా జయకేతనం

రాజకీయవేత్తల ప్రమేయం లేని జీవన రంగం ఏదైనా ఉన్నదా? ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా భారత దేశంలో క్రీడారంగం క్రమేణా రాజకీయమయమవుతోంది. చదరంగం మొదలు క్రికెట్ వరకు ప్రతి క్రీడా సంఘంలో రాజకీయ పార్టీల నాయకులు లేదా వారి అస్మదీయులు చొరబడుతుండగా అసలైన క్రీడాకారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు.

భారతవనిలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దండీగా నిధులు, ఎనలేని కీర్తిప్రతిష్ఠలు సమకూర్చే క్రికెట్ జగత్తును నియంత్రించే క్రికెట్ సంఘాలలో పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా రాజకీయ నాయకులు దొడ్డిదారిన చొరబడుతున్నారు. అందులో వారిలో అతికొందరు మాత్రమే రాణిస్తున్నారు.

భారత క్రికెట్ రంగాన్ని ప్రభావితం చేసే దిశగా, బీజేపీ అగ్ర నాయకుడు అమిత్ షా వారసుడుగా, ఆటల రాజకీయంలో అరంగ్రేటం చేసిన జయ్‌షా నిస్సందేహంగా అజేయుడు. అవును మరి ఆయన అమిత్ షా తనయుడు. రాజకీయ ఉద్దండులు శరద్ పవార్, ఫారూఖ్ అబ్దుల్లా, లాలూప్రసాద్ యాదవ్, నరేంద్ర మోదీ ఒక దశలో క్రికెట్ సంఘాలను ఏలారు. మోదీ అనంతరం గుజరాత్ క్రికెట్ సంఘం వ్యవహారాలలోకి అమిత్ షా ప్రవేశించారు. ఆయన స్వయంగా క్రికెటర్. గొప్ప ఆటగాడు కాకపోవచ్చు గానీ ఆ ఆటలో మంచి అభినివేశం ఉన్నవాడు. ఇటువంటి వ్యక్తి ఒక రాష్ట్రస్థాయి క్రికెట్ సంఘంలో ప్రాబల్యం పొందడం ఏ మాత్రం తప్పు కాదు. కుటుంబ బరువు బాధ్యతలు లేని నరేంద్ర మోదీ మినహా ముగ్గురు రాజకీయ నేతలు –పవార్, అబ్దుల్లా, యాదవ్– తమ రాజకీయ వారసత్వాన్ని స్వీయ సంతానానికి అప్పగించారు. అమిత్ షా మాత్రం రాజకీయంగా ఉన్నతి సాధిస్తూ తాను ఏలిన గుజరాత్ క్రికెట్ సంఘాన్ని స్వీయ, ఏకైక పుత్రరత్నం జయ్‌షాకు అప్పగించారు.

గల్ఫ్ లేఖ

అహ్మదాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘం నుంచి మొదలైన జయ్‌షా ప్రస్థానం అనతి కాలంలో దుబాయిలోని అంతర్జాతీయ క్రికెట్ మండలి వరకు నిర్విరామంగా జయకేతనం ఎగురవేస్తూ కొనసాగుతోంది. పదిహేను సంవత్సరాల వ్యవధిలో క్రికెట్ పాలనా రంగంలో అత్యున్నత శిఖరానికి చేరుకోవడం సాధారణ విషయమా? కాదు కదా. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం జయ్‌షా కూడ గుజరాత్ నుంచి ఏకంగా జాతీయ స్థాయి క్రికెట్ రంగాన్ని నియంత్రించే బీసీసీఐకు చేరుకోవడం యాదృచ్ఛికం కానేకాదు. బీసీసీఐలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత జయ్‌షాదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రత్యేకించి మహిళా క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఆయన చేసిన కృషికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందాయి. అదే విధంగా, ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను కూడా చేర్చే దిశగా జయ్‌షా చేస్తోన్న కృషికి సైతం అంతర్జాతీయంగా అభినందనలు దక్కుతున్నాయి.



ఈ సందర్భంగా జయ్‌షా పెద్దరికం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించవలసివుంది. 2022లో దుబాయిలో జరిగిన ఆసియా కప్ పోటీలలో భారత్, పాకిస్తాన్ జట్లు పోటీపడ్డాయి. దుబాయిలోని క్రికెట్ అభిమాని ఒకరు భారతీయ త్రివర్ణ పతాకాన్ని జయ్‌షాకు అందించగా దాన్ని స్వీకరించేందుకు ఆయన నిరాకరించారు. దీనిపై దుమారం చెలరేగింది. అయితే ఆసియా ఖండంలో క్రికెట్ ఆటకు పెద్ద దిక్కుగా ఉన్న జయ్‌షా ఏ దేశం వైపూ మొగ్గు చూపకుండా విజ్ఞతతో వ్యవహరించారు. సంకుచిత అభిమానాలకు పోకుండా నిష్పాక్షికంగా ప్రవర్తించడం ఆయన గౌరవాన్ని మరింత ఇనుమడింపచేసింది.

పారిశ్రామికవేత్త జగ్‌మోహన్ దాల్మియా, తలపండిన రాజకీయ యోధుడు శరద్ పవార్ గతంలో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (అంతర్జాతీయ క్రికెట్ మండలి– ఐసీసీ)ను ఏలారు. పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండవపర్యాయం పదవీ ప్రమాణం చేసిన సమయంలో జన్మించిన జయ్‌షా పిన్న వయస్సులో ఐసీసీ పగ్గాలు చేపట్టనున్నారు. ఐసిసి పాలకమండలిలో కీలక సభ్య దేశమైన పాకిస్థాన్ లాంఛనంగా భారత అభ్యర్థిత్వాన్ని సమర్థించలేదు కానీ లోపాయికారీగా తన అంగీకారాన్ని తెలిపింది.

సుమారు 20 వేల కోట్ల రూపాయల వార్షిక ఆదాయం ఉన్న బీసీసీఐలో జయ్‌షాది తిరుగులేని ఏకచక్రాధిపత్యం. దీంతో పోల్చితే 16 సభ్య దేశాల పాలకవర్గం కలిగిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లో పేరు ప్రతిష్ఠలు మినహా ఇతర క్రియాశీలక కార్యకలాపాలు అంతగా ఉండవు. దౌత్య నియమాలు, దేశాల మధ్య ద్వైపాక్షిక రాజకీయ సంబంధాలు, ఉద్రిక్తతల మధ్య ఐసీసీ నడుచుకోవల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ క్రీడను ప్రోత్సహిస్తూ పోటీలను నిర్వహించడం, సభ్య దేశాల మధ్య సమన్వయం చేయడం ఐసీసీ విధి.

ప్రపంచానికి క్రికెట్‌ను పరిచయం చేసిన ఇంగ్లాండ్‌లో ఉన్న ఐసీసీ కార్యాలయం పన్నుల మోత కారణాన ఆ దేశం నుంచి నిష్క్రమించింది. స్విట్జర్లాండ్, సింగపూర్, దుబాయిలు ఆ కార్యాలయాన్ని తరలించుకు వెళ్లేందుకు ప్రయత్నించాయి. అయితే భారత్, పాకిస్తాన్‌లు అభ్యంతరం తెలిపాయి. భారత ఉపఖండ సామీప్యత, పన్నుల బెడద లేకపోవడం వల్ల అంతర్జాతీయ క్రికెట్ మండలి 2005లో దుబాయికి తరలింది. అప్పట్లో తన రాజకీయ, అధికారిక కార్యక్రమాలలో తల మునకలుగా ఉన్న శరద్ పవార్ తాను తీరికగా వచ్చి వెళ్ళడానికి దుబాయి వైపు మొగ్గారని చెబుతారు. బంగారు బాతు అయిన బీసీసీఐ కార్యవర్గం కొనసాగింపు వ్యవధిపై ఆంక్షలు ఉన్నందువల్ల జయ్‌షా కొంతకాలం దుబాయిలోని ఐసీసీలో సేద తీరుతారని క్రికెట్ ప్రపంచం భావిస్తోంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కుల వాస్తవికతపై 'సంఘ్' కర్తవ్యబోధ



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించడంలో తమకు అభ్యంతరం లేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కేరళలోని పాలక్కాడ్‌లో జరిగిన జాతీయ సదస్సులో ప్రకటించడంతో ఈ అంశంపై భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ దృక్పథాలకు మధ్య వైరుధ్యం ఉన్నదా? లేక బీజేపీకి ఆ సంస్థ కర్తవ్యబోధ చేస్తున్నదా? అన్న ప్రశ్నలకు దారితీస్తోంది. మూడురోజుల పాటు జరిగిన ఈ సమావేశానికి 32 సంఘ్ అనుబంధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో వీహెచ్‌పీ, బీఎంఎస్ నేతలతో పాటు బీజేపీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా కూడా ఉన్నారు. ఇలాంటి ఆర్ఎస్ఎస్ విస్తృత సమావేశాలు జరిగినప్పుడు కాని మనకు సంఘ్ పరివార్‌లో బీజేపీ స్థానం అర్థం కాదు.

కులజనగణనపై ఆర్ఎస్ఎస్ వైఖరి స్పష్టం కావడంతో భారతీయ జనతా పార్టీ ఏ వైఖరి అవలంబిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. బహుశా గత మూడేళ్లుగా మోదీ ప్రభుత్వం వాయిదా వేస్తున్న జన గణన ఇక ఇప్పటినుంచైనా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ చరిత్రలో జనాభా లెక్కల సేకరణ జరగకుండా నిరవధికంగా వాయిదా వేయడం ఇప్పటి వరకూ ఎన్నడూ జరగలేదు. 2011 తర్వాత ఈ దేశంలో జనాభా ఎంత పెరిగిందీ ఎవరికీ తెలియదు. గత ఏడాదే మనం చైనా జనాభాను అధిగమించామని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది కాని అందుకు నిర్దిష్టమైన ఆధారాలు లేవు. దేశంలో జనాభా లెక్కలు తెలిస్తే కాని అందుకు అవసరమైన ఆర్థిక సూచికలను మనం అంచనా వేయలేము. ఇప్పటి వరకూ మన దేశంలో నిరుద్యోగుల సంఖ్య ఎంత ఉన్నదో కూడా మనకు తెలియదు. నిరుద్యోగుల సంఖ్య కేవలం 3.1 శాతం ఉన్నదని, రోజురోజుకూ వారి సంఖ్య పడిపోతోందని ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటిస్తే, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ లెక్కల ప్రకారం దేశంలో నిరుద్యోగం 9.2 శాతం ఉన్నదని తేలింది. జనాభా లెక్కలను పూర్తిగా సేకరిస్తే గాని నిరుద్యోగ భీకర స్వరూపం మనకు అర్థం కాదు.

అంతేకాదు, జనాభా లెక్కల సేకరణ జరిగితే దేశంలో పేదరికం, ద్రవ్యోల్బణం ప్రభుత్వ కార్యక్రమాలు, నిరక్షరాస్యత, ప్రజల ఆర్థిక అసమానతలు, స్త్రీ, పురుషులు తదితరుల వారీగా జనాభా తీరుతెన్నులు, వలస కార్మికులు, అసమానతలు మొదలైన అనేక అంశాల స్థితిగతులు మనకు తెలుస్తాయి. దేశంలో 81.35 కోట్ల మందికి ఆహార ధాన్యాలను ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద ఉచితంగా పంపిణీ చేయవలసిన స్థితిలో ఉన్నట్లు ప్రభుత్వమే గుర్తించింది. జనాభా లెక్కల సేకరణ పూర్తయితే ఇంకా ఎంతమందికి ఉచిత ఆహార ధాన్యాలు పంపిణీ చేయాలో తేలుతుంది. నిజానికి ఈ దేశంలో మరో పది కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలను పంపిణీ చేయాల్సిన అవసరం ఉన్నదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. జనాభా లెక్కలు సరిగా లేనందువల్ల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఉపాధి కల్పించాల్సిన వారి సంఖ్యను, కేటాయించాల్సిన నిధుల మొత్తాన్ని కేంద్రం అంచనా వేయలేకపోతోంది. ఉపాధి కల్పన విషయంలోనే కాక, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేయాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, వృద్ధాప్య పింఛను తదితర పథకాల లబ్ధిదారుల సంఖ్యను కూడా అంచనా వేసి నిధులు కేటాయించేందుకు వీలు కలుగుతుంది. జనాభా లెక్కల సేకరణ పూర్తయితే పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల పెంపుపై కూడా ఒక నిర్దిష్టమైన స్పష్టత ఏర్పడుతుంది. మతాలవారిగా జనాభా పెరిగిందో లేదో కూడా ఈ లెక్కల ద్వారా తేలి అనేక వ్యాఖ్యానాలకు తెరపడుతుంది.

ఈ క్రమంలో కులాల వారీగా కూడా జనగణన చేస్తే ఏ కులాలు నిర్దిష్టంగా వెనుకబడి ఉన్నాయో తేల్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. బిహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం గత ఏడాది నిర్వహించిన కులజనగణన ప్రకారం బిహార్‌లో 34.13 శాతం ప్రజలు నెలకు రూ. 6000 కన్నా తక్కువ మొత్తంపై ఆధారపడి జీవిస్తున్నారని తేలింది. రాష్ట్ర జనాభాలో కేవలం 1.5 శాతం మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని, దాదాపు 95.49 శాతం మందికి ఎలాంటి వాహనాలు లేవని ఈ లెక్కలు తెలిపాయి. బిహార్‌లో దాదాపు 82 శాతం హిందువులేనని, వారిలో దళితుల సంఖ్య అత్యధికమని తేలింది. 36 శాతం పైగా అత్యంత వెనుకబడిన వర్గాలు బిహార్‌లో ఉన్నారని ఈ లెక్కలు తేల్చాయి. దేశవ్యాప్తంగా కులాలవారీగా జనగణన చేస్తే కులాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు ఎంతమేరకు ఉన్నాయో తేలుతుంది. దీన్నిబట్టి సంక్షేమపథకాలను నిర్దిష్టంగా రూపొందించడం సాధ్యమవుతుంది.

కాని భారతీయ జనతా పార్టీ గత పదేళ్లుగా కులాలవారీగా జనగణనను తీవ్రంగా వ్యతిరేకించింది. సమాజాన్ని కులాల వారీగా చీల్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నికల ప్రసంగాల్లో ఆరోపించారు. కుల జనగణనను ఆయన ఏనాడూ సమర్థించలేదు. ప్రజలను మతాల వారీగా మాత్రమే కాని కులాల వారీగా చూడదలుచుకోవడం బీజేపీకి ఇష్టం లేదని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో బీజేపీని అగ్రవర్ణాల పార్టీగా చిత్రించేందుకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రయత్నించారు. ప్రభుత్వ అధికారుల్లో అగ్రవర్ణాలవారు ఎక్కువ మంది ఉన్నారని ఎత్తిచూపారు. ఆఖరుకు బడ్జెట్ రూపొందించిన అధికారులు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఫోటో దిగినప్పుడు అందులో వెనుకబడినవారు లేరని ఎద్దేవా చేశారు. రాహుల్ విమర్శల వల్లే సివిల్ సర్వీస్ నుంచి కాకుండా బయటి నుంచి అనేకమందిని నియమించాలన్న నిర్ణయాన్ని మోదీ సర్కార్ వెనక్కు తీసుకుంది. కులజనగణన గురించి మాట్లాడినందుకు పార్లమెంట్‌లో రాహుల్, ఇతర నేతలపై అనురాగ్ ఠాకూర్ వంటి నేతలు దాడి చేశారు. 'అసలు నీ కులమేమిటి?' అని ప్రశ్నించారు. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించేందుకు నాటి ప్రధాని వీపీ సింగ్ మండల్ కమిషన్ నివేదికను తెరమీదకు తీసుకువచ్చినప్పుడు దాన్ని ఎదుర్కొనేందుకు అద్వాణీ రథయాత్ర ప్రారంభించారు. అయితే బీజేపీ ఆ నివేదికను నేరుగా విమర్శించలేదు. 'వెనుకబడిన వర్గాలవారికి కానీ, షెడ్యూల్డు కులాల జాతులకు కానీ రిజర్వేషన్ కల్పించడానికి నేను ఎన్నడూ వ్యతిరేకం కాదు. నిజాయితీ లేకుండా సంకుచిత భావంతో స్వల్పకాల రాజకీయ ప్రయోజనాలకోసమే వీపీ సింగ్ మండల్ కమిషన్ నివేదికను ఎవరితో చర్చించకుండా తెరమీదికి తీసుకువచ్చారు' అని అద్వాణీ తన ఆత్మకథలో రాశారు.



కొన్ని కులాల ప్రజలు తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆర్ఎస్ఎస్ గుర్తించడం సాధారణ విషయం కాదు. సామాజిక సంక్షేమ పథకాలపై డేటా సేకరణకు తమకు అభ్యంతరం లేదు కాని జనగణనను రాజకీయ ఉపకరణంగా వాడుకోకూడదని తాము భావిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి సునీల్ అంబేకర్ తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రభుత్వం వెనుకబడిన అణగారిన వర్గాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కులాలవారీగా లెక్కలు అవసరమని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడింది.

నాడు అద్వాణీ వెలిబుచ్చిన అభిప్రాయాన్నే ఇప్పుడు ఆర్ఎస్ఎస్ కూడా వ్యక్తపరిచిందా లేక మారిన పరిస్థితులను గుర్తించిందా? కొన్ని కులాల ప్రజలు తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆర్ఎస్ఎస్ గుర్తించడం సాధారణ విషయం కాదు. సామాజిక సంక్షేమ పథకాలపై డేటా సేకరణకు తమకు అభ్యంతరం లేదు కాని జనగణనను రాజకీయ ఉపకరణంగా వాడుకోకూడదని ఆర్ఎస్ఎస్ భావిస్తున్నట్లు ఆ సంస్థ పబ్లిసిటీ ఇన్‌ఛార్జి సునీల్ అంబేకర్ తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం వెనుకబడిన అణగారిన వర్గాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కులాలవారీగా లెక్కలు అవసరమని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడింది.

ఆర్ఎస్ఎస్ ఇచ్చిన ఈ స్పష్టీకరణ తర్వాత కులజనగణనపై చర్చ చల్లారేందుకు అవకాశం ఏర్పడింది. ఒక రకంగా ఈ సంస్థ బీజేపీని ఇబ్బందుల్లోంచి బయటపడేసేందుకే ఈ ప్రకటన చేసిందేమో అన్న అభిప్రాయం కూడా కలుగుతోంది. కులాల వారిగా ప్రజలను చూడడం ఆ సంస్థకు అంతరాంతరాల్లో ఇష్టం లేదు. అలా చూస్తే హిందూమతం సమైక్యంగా ఉండదేమో అన్న అనుమానాలు కూడా రావడం సహజమే. కాని ఇవాళ దేశంలో కుల జనగణన అంశం తీవ్రంగా తెరమీదకు వచ్చింది. వివిధ రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కులాల వారీగా ప్రజలను సంతృప్తిపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో అస్తిత్వ ఉద్యమాలు కూడా జరుగుతున్నాయి. దేశంలో కులం ఒక వాస్తవమైనప్పుడు దాన్ని చూడడానికి నిరాకరించడం ఒక అమాయకత్వమే. ఏఏ కులాల వారు ఏమి మాట్లాడుతున్నారో, ఎవరి మాటల వెనుక ఏ కుల తత్వం దాగి ఉన్నదో ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారు. అసలు ప్రతి అంశాన్నీ కులం ప్రాతిపదికగా అంచనా వేసే మనస్తత్వం కూడా ప్రబలంగా కనిపిస్తోంది. అందువల్ల భారతీయ జనతా పార్టీ ఎంత మత ప్రాతిపదికగా ప్రజలను సమైక్యపరచాలన్నా దానికి కులం ఒక అవరోధంగా మారింది. మత ప్రాతిపదికగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడం సాధ్యం కాదన్న విషయం కూడా అనేక సందర్భాల్లో తేలింది. గత ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని మరింత స్పష్టం చేశాయి. రామమందిరం నిర్మించిన అయోధ్యలోనే ప్రజలు బీజేపీని ఓడించడం, వారణాసిలో కూడా మోదీకి నూటికి నూరు శాతం హిందువులు ఓట్లు వేయకపోవడం గమనార్హం. రోజురోజుకూ ప్రతిపక్షాలు కులజనగణనను ఒక ప్రధానాంశంగా ప్రజల్లోకి ఉధృతంగా తీసుకుపోవడం, మిత్రపక్షాలు కూడా కులజనగణన కావాలని డిమాండ్ చేయడం బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. దీనితో ఆర్ఎస్ఎస్ కర్తవ్యబోధ చేయాల్సి వచ్చింది.

ఈ నేపథ్యంలో కులం అనే వాస్తవికతను ఆర్ఎస్ఎస్ గుర్తించడం సంఘ్ పరివార్ చరిత్రలో ఒక ముఖ్యమైన పరిణామంగా భావించాలి. 'కులం, కుల సంబంధాలు చాలా సున్నితమైనవి. దేశ సమైక్యతకూ, సమగ్రతకూ కులం ఒక ముఖ్యమైన అంశం. ఎన్నికల రాజకీయాలు, పార్టీలకు అతీతంగా దాన్ని తీవ్రంగా పరిగణించాలి' అని సునీల్ అంబేకర్ చాలా కీలకమైన వ్యాఖ్యలు చేశారు. కులాల వారీగా జనాభా లెక్కలను రాజకీయం చేయకూడదని ఆయన హెచ్చరించారు కాని ఇన్నాళ్లూ మతాన్ని రాజకీయం చేస్తూ మనుగడ సాధించిన వారిని ఏమీ అనలేదేం?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

రేవంత్ పాలనకు పెద్ద పరీక్ష హైడ్రా!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో తన మార్కును చూపించాలని తహతహలాడుతున్నట్టు హైడ్రా ఏర్పాటు ద్వారా తెలుస్తున్నది. తనకు అవసరమైన పటిష్ఠ సంఖ్యాబలం కోసం ఇతర పార్టీల నుంచి గెలిచినవారిని చేర్చుకుని, ఇప్పుడు నమ్మకం కుదిరాక ఆయన అసలు అజెండా బయటకు తెస్తున్నారు. రేవంత్‌కు తెలంగాణలో ప్రతి అంగుళం భూమిపై అవగాహన ఉన్నది. అధికారంలోకి రాకముందే హైదరాబాద్ నగర అభివృద్ధి ప్రణాళికను ఎన్నికల ప్రచారంలో చెప్పి నగరవాసుల ఓట్లు అడిగాడు. ఆయన మాటల్ని నగరవాసులు అంతగా పట్టించుకోలేదు.

రోజురోజుకీ కుచించుకుపోతున్న హైదరాబాద్ సిటీని కాపాడటం; అడ్డదారుల్లో ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను పునరుద్ధరించటం; ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు నీటి వనరుల ప్రాంతాలను పునరుద్ధరించడం; అక్రమ కట్టడాలను కూల్చడం; ఫుల్ ట్యాంక్ లెవెల్‌లో ఉన్న కట్టడాలు, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చడం; వరద నీటి నిర్వహణ; అనుకోని విపత్తుల నుండి నగరాన్ని కాపాడటం; ట్రాఫిక్ నిర్వహణతో పాటు స్థానిక సంస్థలతో సమన్వయం చేస్తూ నగర సంబంధిత విషయాలలో పాలనా సంస్కరణలు పర్యవేక్షించడం... ఇలా ఎంతో విశాల పరిధితో హైడ్రాను ఏర్పాటు చేశారు. జీవో 99 ప్రకారం హైడ్రాకు ఉన్న అధికారాలు పరిధిని ఇప్పటికే ప్రభుత్వం హైకోర్టుకు తెల్పింది.

వరదలు వచ్చినప్పుడు కూల్చివేతలు అక్రమణల గురించి ఆర్భాటంగా ప్రకటనలు చేసి తర్వాత వాటి సంగతి పట్టించుకోని రాజకీయ నాయకులను చూసి చూసి నగర ప్రజలు అలసిపోయారు. రేవంత్ సర్కార్ హైడ్రా పేరిట ఏర్పాటు చేసిన సంస్థ కూడా అలాంటిదే అవుతుందా చివరి వరకు నిలబడుతుందా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతుందా చూడాలి. నగరంలో 1956 నాటికి ఐదు వేలకు పైగా ఉన్న గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించకపోయినా కనీసం 30 సంవత్సరాల క్రితం నాటి పర్యావరణ పరిస్థితులను తీసుకొని రాగలిగినా హైడ్రా విజయవంతం అయినట్టే.

తెలంగాణ రాజకీయాల్లో హైడ్రా ప్రకంపనలు సృష్టిస్తున్నది. 20–30 ఏళ్లుగా నివాసం ఉంటున్న కట్టడాలను సైతం ఎన్ఆర్ఎస్ఎ, అందుబాటులో ఉన్న టౌన్ సర్వే ఆధారిత పత్రాలు, ఇతర అధికారిక పత్రాల ఆధారంగా అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చడం రాజకీయ వివాదాలకు కారణమవుతున్నది. గతంలో కూడా టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నగరంలో వరదలు వచ్చి చాలా ప్రాంతాలు మునిగిపోయాయి. అప్పుడు మూసీ నది పరీవాహక ప్రాంతాలతో పాటు నాలాలను అక్రమంగా కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టడం తోనే అసాధారణ రీతిలో వరదలు ముంచెత్తాయని అక్రమ కట్టడాలు కూల్చుతామని, ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని అప్పటి మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ సొంత పార్టీ నేతలే కబ్జాలలో ఉన్నందున రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కూల్చివేతలు విరమించుకున్నారు. వరదలు వచ్చినప్పుడు కూల్చివేతలు ఆక్రమణల గురించి ఆర్భాటంగా ప్రకటనలు చేసి తర్వాతి వాటి సంగతి పట్టించుకోని రాజకీయ నాయకులను చూసి చూసి నగర ప్రజలు అలసిపోయారు. రేవంత్ సర్కార్ హైడ్రా పేరిట ఏర్పాటు చేసిన సంస్థ కూడా అలాంటిదే అవుతుందా చివరి వరకు నిలబడుతుందా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతుందా చూడాలి. ఇప్పటికైతే కూల్చివేతల్లో దూకుడుగానే ముందుకు వెళుతుంది. గతంలో టీఆర్ఎస్ పాలనలో ఎన్ కన్వెన్షన్ కుల్చుతామని హడావుడి చేసి సైలెంట్ అయ్యారు. ఇప్పుడు హైడ్రా మాత్రం కూల్చివేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది.

నగరంలో 1956 నాటికి ఐదు వేలకు పైగా ఉన్న గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించకపోయినా కనీసం 30 సంవత్సరాల క్రితం నాటి పర్యావరణ పరిస్థితులను తీసుకొని రాగలిగినా హైడ్రా విజయవంతం అయినట్టే. ఇప్పుడు నగరానికే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సామాన్య ప్రజలు సైతం ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. దీన్ని ఓఆర్ఆర్ పరిధికే పరిమితం చేయకుండా యావత్ తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి ట్రెడ్రాగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ పేరిట చిన్న చిన్న పట్టణాలు, పల్లెటూర్లలో సైతం చెరువులు, ప్రభుత్వ సంస్థలు ఆక్రమణలకు గురవుతున్నాయి. సరిగ్గా ఇలాంటి విప్లవాత్మక ప్రభుత్వ విధానాల కోసమే ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ సొంత నాయకుల ఆక్రమణల విషయంలో ఎంతవరకు రాజకీయ ప్రమేయాన్ని అడ్డుకోగలరో కాలమే నిర్ణయించాలి. హైడ్రా పాలక మండలిలో రాజకీయ నియామకాలు ఉంటే గనుక అది మళ్లీ మొదటికే వస్తుంది. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నిజమైన స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి, విస్తృత అధికారాలు, రక్షణ కల్పించి తమను తాము నిరూపించుకోవాలి. ఈ కూల్చివేతలలో కొందరు పేదలు కూడా తమ కష్టార్జితంతో కొనుక్కుని కట్టుకున్న ఇళ్లు ఉన్నాయి. వారిపట్ల ప్రభుత్వ వైఖరి చెప్పలేదు. కబ్జాకాలం, ఆక్రమణదారుల చట్టబద్ధత లాంటి అంశాల్లో రెవెన్యూ చట్ట సవరణ చేయాల్సి రావచ్చు. అందుకే ప్రభుత్వం అన్నింటికీ సిద్ధంగా వుండాలి.



ఇటీవల రేవంత్ తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతుంది, ఇతర రాష్ట్రాలతో కాదని అమెరికా వేదికగా ప్రకటించాడు. ప్రపంచ నగరాల సదుపాయాల కల్పన దిశగా హైదరాబాదును అభివృద్ధి చేయాలంటే ఇప్పుడున్న వ్యవస్థలతో అయ్యేపని కాదు. హైడ్రా లాంటి సాహసోపేతమైన నిర్ణయాలు మరిన్ని తీసుకుంటేనే అది సాధ్యం. ప్రపంచంలో చాలా నగరాలు పట్టణ ప్రణాళికలను సరిగా అమలు చేయటంలో విఫలమయ్యాయి. అందుకు రాజకీయ, సామాజిక కారణాలు చాలా ఉన్నాయి. మన దేశంలో కూడా పట్టణ ప్రణాళికల అమలులో ఇవే అవరోధాలుగా మారాయి. సరైన పరిపాలన విధానాలు లేకపోవడం, పన్నుల వ్యవస్థ సక్రమంగా అమలు జరపకపోవడం హైదరాబాద్‌లో అభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారింది. పాతబస్తీలో పన్నుల వసూలు ప్రభుత్వాలకు అతిపెద్ద సవాలు. మిగిలిన నగరం కడుతున్న పన్నులతో పాతబస్తీకి సౌకర్యాలు కల్పించడం పన్నుల వసూలులో అసమానతలను ఎత్తిచూపుతుంది. ప్రజా రవాణా, భద్రతల విషయంలో కూడా ప్రభుత్వం తీరును మెరుగుపరచుకోకుండా ప్రపంచ స్థాయి నగరంగా ఎదగలేదు.

రాష్ట్ర ప్రభుత్వం నిజంగా ప్రపంచంతో పోటీ పడాలనుకుంటే తక్షణం రాష్ట్ర పట్టణ ప్రణాళికను ప్రకటించి అమలు చేయాలి. ప్రణాళికలో ప్రాథమిక విషయాలు చాలావరకు పాత విధానాలే ఉన్నప్పటికీ అమలు చేయడం పెద్ద సమస్య. జన సాంద్రత ఎక్కువగా ఉన్న హైదరాబాద్ లాంటి నగరంలో అధిక జన సమూహాలను రేవంత్ చెబుతున్న ఫ్యూచర్ సిటీ లాంటి ఔటర్‌కు ఆవల ఉన్న ప్రాంతాలు ఆకర్షించగలగాలి. అక్కడ కనీస మౌలిక సౌకర్యాల కల్పనకు సిద్ధం కావాలి. ప్రజా రవాణాకు కనీసం 30 ఏళ్ళ ప్రణాళికలు సహజ ప్రజా రవాణాను ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకు పూనుకోవాలి.

ఇప్పటికీ హైదరాబాదులో రిస్క్ ప్రివెన్షన్ సిస్టమ్ లేదు. చిన్న చిన్న వరదలకు నగరం అతలాకుతలం అవుతుంది. ఆకస్మిక వరదలు వస్తే క్లౌడ్ బరస్ట్ లాంటివి సంభవిస్తే కోపెన్హెగెన్ లాంటి నగరాల్లో భారీ అండర్ వాటర్ టన్నెల్స్ నిర్మించి ఎక్కడికక్కడ నీరు టన్నెల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఔటర్ చుట్టూ, కొత్త నగర నిర్మాణాల్లో ఇలాంటి మోడల్‌ను ప్రవేశపెట్టగలమా అన్నది చూడాలి. వాతావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే నగరాన్ని నిర్మిస్తేనే ఆధునిక నగరాల సరసన నిలవగలదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు కోసమే అన్న ఆరోపణల నేపథ్యంలో రేవంత్ పాలనకు ఇప్పుడు ఇది కఠిన పరీక్షలా మారింది. ప్రభుత్వం తమ నాయకుల అక్రమ కట్టడాల విషయంలో ఎలా ముందుకు వెళుతుందో అని సర్వత్రా ఆసక్తి ఉంది. ఆచరణ సాధ్యమైన నియమాలు, తారతమ్య భేదాలు లేని చట్టాలు, ప్రజాస్వామ్యబద్ధ విధానాలు, గౌరవప్రదమైన అమలుతీరుతో ముందుకు వెళ్లాలి.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

కాస్త తెరిపి ఇవ్వు..!

మహా ప్రళయం ముంచుకొచ్చింది
వాగులు వంతలు చెరువులు కుంటలు
జల ఖడ్గాన్ని జనం మెడలపైకి విసిరాయి
బ్రతుకులన్ని జల దిగ్బంధం
కళ్ళు కాయలు కాసినా
ఇల్లు వాకిళ్ళు మిగల్లేదు

గ్రీష్మతాపంలో స్వేదం చిమ్మాక
కొన్ని చిరుజల్లులు కురిస్తే
హరివిల్లులు విరిస్తే...
మది మధురగీతాలు పాడుతుంది
మనసంతా సేద తీరుతుంది.. కానీ
ప్రకృతి ఋతుచక్రం
గిర్రున తిరిగి గిరికీలు కొట్టేస్తే
బ్రతుకంతా చిందర వందర

చినుకు పలకరింతలకు
మనమే కాదు పశుపక్ష్యాదులు పులకరిస్తాయి
వానా వానా వల్లప్పా... అంటూ
చిందులు వేసి సందడి చేస్తయి.. కానీ

మనిషి మనుగడలో
అతివృష్టి అనావృష్టి
ఏదీ సహించదు జనజీవం ఇది నిజం

ఆకస్మిక వరదల హోరు/ మృత్యుగీతాల తీరు
అన్నీ అపశ్రుతులే/ అన్నీ అశ్రు పాదముద్రలే
మట్టి గోడలు కూలుతున్నాయ్
వట్టి మాటలు పేలుతున్నాయి
చేయూత హస్తాలు
ఊపిర్లు ఊదాలి ఉచ్ఛ్వాస నిశ్వాలి

ముంచెత్తుతున్న వరదలు
భీకర బీభత్స విపత్తుల
విచ్చుకత్తుల్ని దించుతోంది
కుండపోత బాధల వలపోత
ఉగ్రరూపం దాల్చిన వరుణుడు
గుండెల్ని చెరువులు చేస్తున్నాడు
కూలిన మేడలు దుఃఖపు వాడలు
అంతా అతలాకుతలం
చినుకు చినుకుగా రాలి ఛిద్రమైతివి
ప్రమాదపు హెచ్చరికవైతివి
పదిలమవ్వుట ఏలనమ్మా

మాకు మేమే బరువవుతున్నం
మాకు మేమే భారమవుతున్నం
తడిసి ముద్దవుతున్న
తనువెల్లా నిలువెల్లా వేడ్కోలు
వినయంగా వేడ్కోలు/ కాస్త తెరిపి ఇవ్వు
తేరుకుంటాం.. తేలిక పడిపోతాం..

– కటుకోఝ్వల రమేష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



వరద నష్టంపై మానుకోట కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం



మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు



సీతారాంతండాలో బాధిత కుటుంబంలోని చిన్నారితో మాట్లాడుతున్న రేవంత్

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం..

- అధికారుల అప్రమత్తతతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగాం
- మానుకోట జిల్లాలో 30వేల ఎకరాల్లో పంట నష్టం
- ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారమిస్తాం
- మూడు తండాల తరలింపుతో మోడల్ కాలనీ
- సీతారాంతండా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబాబాద్ కలెక్టరేట్‌లో వరద నష్టంపై సమీక్ష

మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వర్షం సృష్టించిన బీభత్సంతో ఎవరూ అధైర్యపడొద్దని.. తమ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని, మహబూబాబాద్ జిల్లాలో 28 సెంటిమీటర్ల వర్షం పడిందని, జలప్రళయం వచ్చినా అధికారులు అప్రమత్త వ్యవహరించి ఆస్తి, ప్రాణనష్టాన్ని కొంత మేరకు తగ్గించగలిగారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాను మంగళవారం సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. తొలుత పురుషోత్తమయగూడెం 365 జాతీయ రహదారిపై 1500 మీటర్ల మేరకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించి.. వాగు ఉధృతితో ఇసుకమేటలు వేసిన ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కలతో కలిసి వర్షం, వరద నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా వ్యాప్తంగా 30వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇక వరద బీభత్సంలోనూ నిరంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వరద ముంపునకు గురైన సీతారాంతండా వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన సీరోలు ఎస్సై నగేష్ అభినందనీయుడన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జిల్లాలో నలుగురు మృతి చెందగా.. వారిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లా వారైతే.. మరో ఇద్దరు పక్క జిల్లా అయిన ఖమ్మానికి చెందిన వారని వివరించారు. అలాగే 215 పశువులు చనిపోయాయని, 45 ట్యాంక్‌లు, మూడు పక్కాఇళ్లు, 15 కచ్చ ఇళ్లు కూలిపోయాయని, మరో 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 125 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, 680 మందిని వరద ముంపుప్రాంతాల నుంచి తప్పించి వసతి కల్పించామని వెల్లడించారు. చనిపోయిన ప్రతీ వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. పురుషోత్తమయగూడెం ఆకేరువాగులో కారు గల్లంతయి మృతి చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ వారి స్వగ్రామం ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ఆదేశించామన్నారు.



పొలాల మీదుగా కాలినడకన సీతారాంతండాకు వస్తున్న సీఎం, మంత్రులు

మూడుతండాల తరలింపుతో మోడల్ కాలనీ..

ప్రతీసారి వరద ముంపునకు గురయ్యే పురుషోత్తమయగూడెం శివారు సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఒక మోడల్ కాలనీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా తండాల వారికి ప్రత్యామ్నాయంగా ఇందిరమ్మ ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతి చెందిన పశువులకు రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేల చొప్పున యజమానులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోనే రూ.13కోట్ల నష్టం వాటిల్లిందని, ఇప్పటి వరకు జరిగిన విపత్తును ఎదుర్కొవడం ఒకటైతే.. ఇక ముందు మరేవిధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మునిసిపల్, పంచాయతీ రాజ్, వైద్య, రెవెన్యూ అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు శుభ్రం చేయడానికి నల్లాలు, ట్యాంకర్ల ద్వార నీరందించాలని చెప్పారు. దోమల వ్యాప్తి, అంటు వ్యాధులు రాకుండా ఆరోగ్యశాఖ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎక్కడైతే నష్టం జరిగిందో ఆ ప్రాంతాల పునరుద్ధరణకు అవసరమైతే

మిగతా 7వ పేజీలో..



రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు

- రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వర్షాలతో రైతుల పంట దెబ్బతిని, ప్రజలు కష్టాల్లో ఉంటే ఆదుకునేది పోయి రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లా డారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గంటల్లోనే 42సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇంతటి విపత్తుఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, జిల్లాలను పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ నష్టాన్ని పరిశీలించి ప్రజలకు ఓదార్పునిస్తూ అండగా నిలస్తున్నారని, అలాంటి నాయకుడిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచి సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తామని, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దగ్గర రూ.వేల కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.వెయ్యి లేదా రూ.రెండు వేల కోట్లు ఇస్తే తాను కొంతకలిపి నష్ట పోయిన ప్రజల అవసరాలు తీరుస్తామన్నారు. ధ్వంసమైన రోడ్లు, ఇతరత్రా పనులను సత్వరమే మరమ్మతులు చేయించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయడం వల్ల తక్కువ నష్టం జరిగిందని అహర్నిశలు శ్రమించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



విపత్కర సమయాల్లో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండి సేవలందించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేశారని దాంతో నష్టం కొంతమేర తగ్గిందన్నారు. మానుకోట జిల్లాలో వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరితే, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని, వర్షాలతో నష్టం జరిగిన జిల్లాలకు తక్షణ సాయం కింద సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ధ్వంసమైన రోడ్ల పునరుద్ధరణ కోసం పనులను వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లాలో వర్షాలతో జరిగిన నష్టం, తీసుకు న్న సహాయక చర్యలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు పాల్గొన్నారు. మానుకోట మునిసిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, నాలాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ వినతిపత్రం అందించారు.



మట్టెవాడ కార్యాలయంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

నలుగురు చైన్‌స్నాచర్ల అరెస్టు

- బంగారు గొలుసు, బైక్ స్వాధీనం
- వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ వెల్లడి

మట్టెవాడ, సెప్టెంబరు 3: గంజాయి, జల్సాలకు అలవాటుపడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. మంగళవారం మట్టెవాడలోని ఏసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. కాజీపేట దర్గాకు చెందిన సల్మాన్, అవినాశ్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో జూలై 30న రాత్రి సుమారు 10గంటలకు మేదరివాడలోని పూజా సామాగ్రి షాపులో వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసును అపహరించి బైక్‌పై పరారయ్యారు. అదే రోజు రాత్రి కాజీపేటకు వెళ్లి బైక్‌ను చెట్ల పొదల్లో దాచి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ అఫ్రోజ్ అనే వ్యక్తిని కలిసి గొలుసును విక్రయించి డబ్బులు ఇవ్వాలని కోరారు. అయితే అఫ్రోజ్ ఇందులో తన మిత్రుడు రఫీక్‌కు వాటా ఇవ్వాలని కోరగా వారు నిరాకరించారు.

కాగా, హైదరాబాద్‌లో గొలుసును విక్రయించడానికి అవకాశం దొరకకపోవడంతో సోమవారం సల్మాన్, అవినాశ్, హైదరాబాద్‌కు చెందిన అఫ్రోజ్, రఫీక్‌లు కాజీపేటకు వచ్చారు. అక్కడ బంగారం షాపులో గొలుసు విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు కంటపడ్డారు. పారిపోతుండగా నలుగురిని పట్టుకున్నట్టు ఏసీపీ తెలిపారు. నిందితుల నుంచి బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరచుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైన్‌స్నాచర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఇంతేజార్‌గంజ్ ఎస్సైలు వెంకన్న, రాజు, క్రైం పార్టీ సిబ్బంది శివ, మహ్మద్ అలీ, ఉపేందర్, మహేందర్‌లను ఏసీపీ నందిరాంనాయక్ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్‌లు మచ్చ శివకుమార్, తుమ్మ గోపి పాల్గొన్నారు.



పోతననగర్ వెనుక సగం కట్టి వదిలేసిన గోడ



భద్రకాళి చెరువు కట్టకు అడ్డంగా వేసిన ఇసుక సంచులు

భద్రకాళి చెరువుతో భయం.. భయం..

- ఆందోళనకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు
- భయంతో బతుకుతున్న పోతననగర్ కాలనీలు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు3: వరంగల్ నగరంలో ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు భద్రకాళి చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకు పైభాగంలో ఉన్న కాలనీలు, గ్రామాల నుంచి నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున నీరు భద్రకాళి చెరువులోకి చేరుతుండడంతో స్థాయికి మించి మత్తడి పోస్తోంది. దీంతో ఎప్పుడు కట్ట తెగి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది.

కిందటేడు భద్రకాళి చెరువు కుడిపక్కన ఉన్న పోతన నగర్ ప్రాంతంలో ఉన్న చెరువు కట్ట తెగిపోవడంతో పోతననగ్‌లో నివసించే సుమారు 200 కుటుంబాలు నీట మునిగాయి. చాలా మంది ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టం కూడా జరిగిందని తెలిపారు. ఇళ్లలో ఉన్న నిత్యావసర సరుకులు నీటిలో కొట్టుకుపోవడంతో తిండికి ఇబ్బందిగా మారిందని గత స్మృతులను గుర్తుకు చేశారు. దీంతో అధికారులు సుమారు 500 ఇసుక బస్తాలను అడ్డంగా వేశారు. అలాగే ఆగమేఘాల మీద బల్దియా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక నిధులతో బలహీన పడిన కట్టకు సమానంగా భద్రకాళి బండ్ నుంచి పోతన నగర్ వెనుక వరకు 200 మీటర్ల పొడవుతో పెద్ద సిమెంటు గోడను నిర్మించారు. కానీ ప్రతిపాదనలో సూచించిన విధంగా సిమెంటు గోడను సగం వరకు నిర్మించిన అధికారులు మధ్యలోనే వదిలేశారు. చెరువు కట్ట పైభాగంలో నిండిన నీరు కింది భాగంలో మురుగు కాలువ ప్రవహిస్తుండడంతో అక్కడి ప్రజలు ప్రమాదపుటంచుల్లో కాలం వెల్లతీస్తున్నారు.

ఈ క్రమంలో ప్రస్తుతం పోతననగర్ ప్రజలు పాత ప్రమాదాన్ని తలచుకుని ఆందోళన చెందుతున్నారు. అయితే అధికారులు తెగిన కట్ట ప్రాంతంలో తాత్కాలికంగా వేసిన ఇసుక సంచులపైనే అధికారులు భారం పెట్టుకున్నారు. కానీ పోతన నగర్ ప్రజలు ఎప్పుడు కట్ట తెగి ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకు జీవుడా అంటే జీవిస్తున్నారు.



బలహీనంగా ఉన్న భద్రకాళి కట్టకు అడ్డంగా వేసిన ఇసుక సంచులు



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ వేలాడిన ప్రాంతంలో మట్టికట్ట పోస్తున్న యంత్రాలు

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్‌రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద రాత్రింబవళ్లు యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ చర్యల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది

7

వరద నష్టం రూ.18 కోట్లకు పైనే..

- అంచనాలు తయారు చేసిన బల్దియా సిబ్బంది



వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 3: గ్రేటర్ వరంగల్ పరిధిలో మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రూ.18కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్టు బల్దియా అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇప్పటి వరకు తాము చేసిన లెక్కల ప్రకారం రూ.18కోట్ల వరకు నష్టం జరిగిందన్నారు. ఇంకా కొన్ని ప్రాంతాలలో పర్యటించి నష్టాన్ని గుర్తించాల్సి ఉందని బల్దియా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. వర్షం కారణంగా ప్రధా నంగా హనుమకొండ కొత్తబస్‌స్టేషన్ రోడ్డు, కేయూ రోడ్డు, వడ్డెపల్లి రోడ్లు దెబ్బతిన్నా యన్నారు. అంతేకా కుండా నగరంలోని పలు కాలనీలలో డ్రైనేజీలు, మురుగు కాల్వ లు, బీటీ రోడ్లు, మట్టి రోడ్లు, మూడు కల్వర్టులు, తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయని అధికారులు నిర్ధారించారు. హనుమకొండ ప్రాంతంలో రూ.10కోట్లు వరంగల్ ప్రాంతంలో రూ.8కోట్ల వరకు ఆస్తినష్టం జరిగినట్టు వెల్లడించారు. మరో రూ.4కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు. అయితే వర్షాల కారణంగా జరిగిన నష్టంపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ప్రధానంగా బల్దియా కాంట్రాక్టర్లు నాసిరకం మెటీరియల్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం వల్లనే వర్షానికి కొట్టుకు పోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



హేమానీ, బుజ్జి, నసీమా మృతదేహాలు

ముగ్గురిని బలి తీసుకున్న బొగ్గులారీ

- ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి
- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన

7


ముగిసిన కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు

- ప్రత్యేక ఆకర్షణగా కవ్వాలి
- ఒళ్లు జలదరించేలా ఫకీర్ల విన్యాసాలు
- వేలాదిగా హాజరైన భక్తులు

కాజీపేట, సెప్టెంబరు 3: మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దఎత్తున హాజరై దర్గాను దర్శించుకున్నారు. బియాబానీ దర్గాపై పూలు చల్లి చాదర్‌కప్పి మొక్కులు చెల్లించా రు. దర్గాను దర్శించుకున్న భక్తులకు దర్గాపీఠాధిపతి ఖుస్రూ పాష ఆశీర్వాదాలు అందించారు. ఉదయం కవ్వాలితో ముస్లింలు తమ ప్రతిభను చాటారు. అనంతరం ఫకీర్ల విన్యాసాలు చేశారు. ఓ వైపు కవ్వాలి పాటలతో ముస్లింలు ఊగిపోతుంటే మరో వైపు ఫకీర్లు విన్యాసాలు చేశారు. నాలుకపై, తలపై, మెడలపై, కడుపులో, సీకులు గుచ్చుకుని వారి చేసే విన్యాసాలు చూపరుల ఒళ్లు జలదరించేలా చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన సుమారు 20 మంది ఫకీర్లు విన్యాసాలు చేశారు. విన్యాసాలు చూసిన ముస్లింలు ఫకీర్లకు తోచినంత ఆర్థిక సహాయాన్ని అందించారు.



కవ్వాలి నిర్వహిస్తున్న దృశ్యం



విన్యాసానికి సిద్ధమవుతున్న ఫకీర్

ఉత్సవం చివరి రోజు కావడంతో భక్తులు పెద్దఎత్తున హాజరు కావడం దర్గా పరిసర ప్రాంతాల్లో రద్దీ ఏర్పడింది. అక్కడ వెలిసిన వివిధ రకాల షాపులు వద్ద కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఈసం దర్భంగా దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాష మాట్లాడుతూ.. మూడు రోజులుగా కురిసిన వర్షాలను సైతం లెక్కచేయకుండా భక్తులు దర్గాకు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారన్నారు. ఈ ఉత్సవాలు విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. అందుకు సహకరించిన పోలీసులకు, మునిసిపల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు, ఆర్గనైజర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రవేత్తలకు ఉత్తమ అవార్డులు, పురస్కారాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 3: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారు. ఇందులో వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న ఇద్దరు శాస్త్రవేత్తలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు అవార్డులు దక్కాయి. ఆ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ బీజే రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ ఛైర్మన్ ఎం.రఘునందన్ చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలు ఐదేళ్లుగా అపరాల పంటలో నూతన కంది వంగడాలు, పంటలలో పురోగతి, విత్తనోత్పత్తిలో మెరుగైన కృషి చేసినందుకు శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సంధ్యాకిషోర్ మండవ వెంకటరామయ్య ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. వరిలో నూతన వంగడాల రూపకల్పనలో భాగస్వామ్యం అవడంతోపాటు వరిలో వచ్చే చీడపీడల నివారణ నిర్మూలనకు ఆధునిక పద్ధతిలో రూపొందించడంలో కీలక ప్రాత పోషించినందుకు వరి విభాగంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఓంప్రకాష్ ఉత్తమశాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా రమేష్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఓంప్రకాష్, సంధ్యాకిషోర్

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ

పోస్టర్ ఆవిష్కరించిన కేయూ రిజిస్ట్రార్, ఆర్‌బీఐ అధికారి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: డిగ్రీ విద్యార్థులకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సువర్ణావకాశాన్ని కల్పించింది. క్విజ్‌లో పాల్గొని రూ.10 లక్షలు మొదటి, రూ.8లక్షలు రెండో బహుమతి, అలాగే రూ.6లక్షలు మూడో బహుమతిగా గెలుచుకునే బంపర్ ఆఫర్‌ను వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీ బాబాలు రిజిస్ట్రార్ చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. వర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, 25 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఇద్దరు కలిసి గ్రూపుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్విజ్ పోటీలు జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్‌లుగా జరుగుతాయని తెలిపారు. మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో ఉంటుందని వెల్లడించారు. మొదటి రౌండ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధిస్తారని, అయితే రెండో రౌండ్ రాష్ట్రస్థాయిలో జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే మూడో రౌండ్ జోనల్ స్థాయిలో జరుగుతోందని వెల్లడించారు. దీనిలో అత్యున్నత ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయిలో నాలుగో రౌండ్ జరుగుతుందని వివరించారు. 2, 3, 4వ రౌండ్‌లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, ఆయా రౌండ్‌లకు ఎంపికైన వారికి రవాణా, భోజనం, ఇతర ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుందని పేర్కొన్నారు. కాగా, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ఆర్‌బీఐ తరుపున సర్టిఫికెట్లను అందచేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు www.rbi.org.inలో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీబాబా, లీడ్ బ్యాంకు ఆఫీసర్ హవేలీరాజు, ఫైనాన్సియల్ లిటరసీ క్రెడిట్ కౌన్సిలర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, ఆర్‌బీఐ అధికారులు

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

సమీప ప్రాంతాల రెవెన్యూ, పోలీసులను రప్పించి, రంగంలోకి దింపాలన్నారు. ఎక్కడైతే ప్రమాదాలు, వరదల నష్టం జరుగుతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి బ్లూబుక్ తయారు చేసి కలెక్టరేట్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మున్ముందు ఇలాంటి విపత్తులు ఏర్పడే అవకాశం ఉంటే అధికారులు మారినా.. ఆ బ్లూబుక్‌లోని సమాచారం ద్వారా చరిత్ర పునరావృతం కాకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల మధ్యనే ఉండి ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని అధికారులకు వివరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వం బురద.. వరద రాజకీయాలు చేయదని, చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితుల సాయం కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.


సీతారాంతండాలో వరద బాధితులతో మాట్లాడుతున్నసీఎం రేవంత్‌రెడ్డి

మానుకోటలోనూ హైడ్రా తరహా చర్యలకు ఆదేశం

మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఆక్రమణల కూల్చివేతకు శ్రీకారం చుట్టిన హైడ్రా తరహాలోనే ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నాలా చెరువులను ఆక్రమిస్తే కూల్చివేయడానికి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని వెల్లడిచారు. చెరువులు, నాలాలు, బఫర్‌జోన్‌ల ఆక్రమణల వల్లనే భారీ వర్షాలు చోటు చేసుకున్నప్పుడు వరద ముంపుతో తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రమంతా చెరువులు, నాలాల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతామని చెప్పారు. ప్రకృతిని చెరబట్టాలని చూస్తే ప్రకృతి ప్రకోపాన్ని చూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్, తెలంగాణ, విజయవాడ, హైదరాబాద్ ఎక్కడైనా సరే ప్రకృతిమీద దాడిచేస్తే తప్పకుండా దుష్ఫలితాలు చూడాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి హైకోర్టు ఇతరత్రా ఏ కోర్టుల్లో కేసులు ఉన్నా.. చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఆక్రమించిన భూ కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఎంతటి ఒత్తిడి వచ్చినా.. వెనక్కి తగ్గేది లేదని తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. అక్రమంగా కట్టడాలు చేపట్టి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. లేని పక్షంలో తామే చర్యలు తీసుకుని కూల్చివేయిస్తామన్నారు. చెరువులు, నాలలు ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, మామిడాల యశస్వినిరెడ్డి కోరం కనకయ్య, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.

సీతారాంతండా బాధితులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండ


సీఎంకు తన జీతం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మరిపెడ మండలం తండాధర్మారం శివారు సీతారాం తాండా ముంపు బాధిత కుటుంబాల సహార్థం కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఒకనెల వేతనం రూ.2.75 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారాంతాండాలో సీఎం రేవంత్‌రెడ్డికి విరాళానికి సంబంధించిన చెక్కును మల్లన్న అందచేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్‌ఈలు కృష్ణారెడ్డి, సురేందర్, డీఈఈ అనూష, శ్రీనివాస్, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విద్యార్థిని

కిడ్డీబ్యాంకులో దాచుకున్న రూ.3వేలను సీఎంకు అందజేసిన సాయిసింధు

మహబూబాబాద్ టౌన్ : వరదలో మహబూబాబాద్ జిల్లా అతలాకుతులమైన వేళ మహబూబాబాద్ పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని చలించిపోయింది. తన తల్లిదండ్రులు పాకెట్ మనీగా ఇవ్వగా కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను వరద బాధితుల సహాయార్థం అందించి పెద్దమనుసును చాటుకుంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముత్యాల గీతవాణి- ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె సాయిసింధు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన జిల్లావాసులకు అండగా ఉండేందుకు తాను దాచుకున్న డబ్బు రూ.3వేలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించేందుకు గాను మంగళవారం మానుకోటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చింది. దీంతో సీఎం సింధును అభినందించారు.


సీఎం సహాయనిధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూ.3వేలను అందిస్తున్న చిన్నారి సాయిసింధు

శరవేగంగా జాతీయ రహదారి మరమ్మతులు


శరవేగంగా సాగుతున్న జాతీయ రహదారి మరమ్మతు పనులు


వరద ఉధృతికి పాడైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో ఆకేరు నది వరద ఉధృతితో మరిపెడ మండలం పీఎస్‌గూడెం దగ్గర పాడైన 365 జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను మంగళవారం సీతారాంనాయక్‌తండాకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పునరుద్ధరణ పనులు తాత్కలికంగా చేపట్టినప్పటికి మళ్లీమళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ, పక్కా ప్రణాళికలతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాం గం పీఎస్ గూడెం బ్రిడ్జి దగ్గర మూడు ప్రొక్లయినర్లను ఏర్పాటు చేసి, పనులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డు మార్గం పునరుద్ధరించేలా పనులు జరుగుతున్నాయి.

సీరోలు ఎస్సై నగేష్‌కు సీఎం సత్కారం


సీరోలు ఎస్సై నగేష్‌ను సత్కరిస్తున్న సీఎం, మంత్రులు

సీరోలు , సెప్టెంబరు 3 : వరదలతో నీట మునిగిన సీతారాంతండా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించిన సీరోలు ఎస్సై నగేష్ సేవలు భేష్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన సీఎం సుమారు 100 మంది తండావాసులను సీరోలు ఎస్సై నగేష్ తన సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారని, ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని కావడికి జోలెకట్టి స్వయంగా ఆయన కావడి మోసి సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి నగేష్‌ను సత్కరించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

మరిపెడ, సెప్టెంబరు 3 : మరిపెడ మండలంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన 32నిమిషాల పాటు కొనసాగింది. ఖమ్మం నుంచి రోడ్డుమార్గంలో మ ధ్యాహ్నం 12.54నిమిషాలకు సీతారాంతండా స్టేజీకి చేరు కున్న ఆయన తొలుత మంత్రులు, అధికారులతో కలిసి ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. అక్కడి నుంచి కాలినడకన 1.03 నిమిషాలకు సీతారాంతండాకు చేరుకున్నారు. 10నిమిషాల పాటు పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. రోధిస్తున్న బాధిత కుటుంబాల వారిని ఓదార్చారు. 1.13 నిమిషాలకు బాధిత కుటుబాలను ఉద్దేశించి 11 నిమిషాలు వారితో మాట్లాడారు. 1.26 నిమిషాలకు కాన్వాయ్ ద్వారా మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. 1:45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం ఫొటోప్రదర్శన తిలకించి 1:50 గంటలకు సమీక్ష ప్రారంభించారు. 2:35 గంటలకు సమీక్ష ముగించుకుని వెళ్లిపోయారు.

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్‌రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ పనుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది

కేసముద్రం, సెప్టెంబరు 3 : ఇటీవలి భారీ వర్షం, వరద బీభత్సం కారణంగా సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య, కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమై రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పడిన భారీ వర్షం కారణంగా తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 432, 434 కిలోమీటరు వద్ద సుమారు 20 మీటర్ల పొడవు, అలాగే ఇంటికన్నె వద్ద 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ వరద తాకిడికి ధ్వంసమైంది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే శాఖ ఆదివారం సాయంత్రం నుంచే పట్టాల మరమ్మతు పనులు చేపట్టి నిరంతరాయంగా కొనసాగిస్తోంది. దీంతో తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య మంగళవారం ఉదయం వరకు ట్రాక్‌ను సిద్ధం చేసి మధ్యాహ్నం ట్రయల్ రన్‌లో భాగంగా గూడ్స్ రైలును కూడా నడిపించారు. ఇక ఇంటికన్నె వద్ద ట్రాక్ బాగా దెబ్బతినడంతో మరమ్మతు పనులకు సమయం పడుతోంది. సోమవారం ఉదయం నాటికి వరద ప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో ఎనిమిది ఎక్స్‌కవేటర్ యంత్రాలను తీసుకువచ్చి రైలు కట్ట పటిష్ఠం కోసం మంగళవారం సాయంత్రం వరకు మట్టికట్టను పోశారు. యంత్రాలతో కంకర నింపుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతంలో పాక్షికంగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్ వద్ద సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక్కడ రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు, ఓహెచ్‌ఈ(ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్స్), కమ్యూనికేషన్స్ తదితర విభాగాలకు సంబంధించిన వెయ్యి మందికి పైగా సిబ్బంది మరమ్మతు పనుల్లో పాల్గొనడం గమనార్హం. మంగళవారం రాత్రి పట్టాలను ఏర్పాటు చేయడం, కంకర ప్యాకింగ్ పూర్తి చేసి బుదవారం మధ్యాహ్నం వరకు రైలు పట్టాల పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.


ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల్లో కూలీలు

రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు!

కాజీపేట, సెప్టెంబరు 3: భారీవర్షాల నేపథ్యంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసలపల్లి-మహబూబాబాద్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు మంగళవారం సైతం రద్దు చేశారు. ఆ రూట్‌లలో రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. తాళ్లపూసలపల్లి - మహబూబాబాద్ మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను రైల్వే సిబ్బంది రేయింబవళ్లు పనిచేయడంతో ఆ ట్రాక్‌ను మంగళవారం మరమ్మతును పూర్తి చేశారు. ఆ ట్రాక్‌పై ట్రయల్ రన్ సైతం పూర్తి చేశారు. ఇదే రూట్‌లో ఇంటికన్నె - కేసముద్రం మధ్య దెబ్బతిన్న రైల్‌ట్రాక్ పునరుద్ధరణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి, ఈ ట్రాక్ మరమ్మతులు పూర్తిచేస్తేనే ఆ రూట్‌లో రైళ్లు నడుప నున్నామని, అందుకు మరోరెండు రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి

- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన

పాలకుర్తి/తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : మృత్యువై దూసుకొచ్చిన ఓ బొగ్గులారీ ముగ్గురిని బలితీసుకుంది. మూల మలుపు వద్ద ఆ లారీ బస్సును ఢీ కొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న దంపతులు సహా ఓ మహిళ మృతిచెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపో నుంచి పాలకుర్తి- తొర్రూరు షటిల్ సర్వీసుగా ఓ ఆర్టీసీ బస్సు పాలకుర్తి నుంచి తొర్రూరుకు మొత్తం 18మంది ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులో మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి పాలకుర్తి వైపు వస్తున్న ఓ బొగ్గు లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు హేమాజీ(55), బుజ్జి (50) దంపతులతో పాటు పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎండి.నసీమా (55) మృతి చెందా రు. అలాగే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అయితే బొగ్గులారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు బాలాజీ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కోలపల్లి భూలక్ష్మీ, ఎర్ర సత్యవతి, పాలకుర్తి మండలం నారబోయినగూడెం గ్రామానికి చెందిన తిరుపల్లి నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.


తొర్రూరులో చికిత్స పొందుతున్న జాటోతు బాలాజీ

కుమారుడు, కూతురు వద్దకు వెళ్లి వస్తుండగా..

హేమాజీ, బుజ్జి దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమ చిన్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణలను చూసేందుకు నాలుగు రోజుల క్రితం మరో ఇద్దరు కుటుంబసభ్యులతోకలసి వెళ్లారు. తిరిగి హైదరాబాద్ నుంచి సోమవారం ఇంటికి బయల్దేరిన వారు సాయంత్రానికి దేవరుప్పల మండలం పెద్దతండా శివారు దోసెబండ తండాలో నివాసం ఉండే బుజ్జి సోదరి అయిన బానోతు రుక్కి ఇంటికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన ఆ నలుగురు మంగళవారం తెల్లవారు జామున దోసెబండ తండా నుంచి పాలకుర్తి చేరుకుని.. అక్కడ తొర్రూరు వెళ్లే బస్సు ఎక్కారు. మార్గమధ్యలో వావిలాల వద్ద జరిగిన ప్రమాదంలో బస్సులో కుడివైపు కూర్చున్న హేమాని, బుజ్జి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో హేమానీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన హేమాని బార్య బుజ్జిని తొర్రూరులోని ప్రైవేటు ఆసత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులకు ఇద్ద రు కుమారులు సోములు, సుమన్, అరుణ ఉన్నారు. ఇక మరో మృతురాలు ఎండి. నసీమాది పాలకుర్తి మండల కేంద్రం. నసీమా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామశివారులోని మహత్మాజ్యోతిబాపూలే డిగ్రీ గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ వంట మనిషిగా పని చేస్తోంది. రోజులాగే విధులకు వెళ్లే క్రమంలో ఆమె ప్రమాదానికి గురైంది. నసీమాకు భర్త బడేసాబ్ కుమారులు యాకూబ్, మహబూబ్‌పాషా ఉన్నారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

ఘటనా స్థలిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ప్రమాద విషయం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించిన సమయంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతురాలు నసీమా భర్త బడేసాబ్‌తో మాట్లాడి ఓదార్చారు. బీఆర్‌ఎస్ తరుపున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

లారీ డ్రైవర్ మద్యం తాగడమే కారణమా?

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టి ముగ్గురు మృతికి కారణమైన బొగ్గు లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనకు అరగంట ముందు సదరు డ్రైవర్ వావిలాల గ్రామంలో లారీ నిలిపి బెల్ట్ దుకాణంలో మద్యం తాగినట్టు తెలిసింది. ఆ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించగా.. ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు సమాచారం.

దంపతుల మృతితో టీక్యాతండాలో విషాదం

పాలకుర్తి మండలం వావిలాల గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం మండలం వెల్లికట్టె గ్రామ శివారు టీక్యాతండాకు చెందిన జాటోతు హేమానీ(60) బుజ్జమ్మ(55) దంపతులు మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వీరు హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణను చూసివచ్చేందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం

- దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు
- సుమారు 5 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం వాటిల్లింది. వరదనీటి ధాటికి పలు స్తంభాలు పూర్తిగా దెబ్బతినడం, నేలమట్టం కావడం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదిక మరమ్మతుల చేపట్టి కమర్షియల్, డొమెస్టిక్ సర్వీసులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు, నర్సింహులపేట, మరిపెడ, ఎల్లంపేట మండలాల్లో వర్షపాతం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు ఎక్కువగా నష్టం జరిగింది. ఆకేరువాగు తాకిడికి ఉల్లంపల్లిలో 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునగడంతో కంట్రోల్‌రూమ్, ప్యానల్స్, ఇతరత్ర సామగ్రి దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న పాలేరు, ఆకేరు, మున్నేరు, పాఖాలవాగు తీరం వెంబడి ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి సుమారు 900 విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు కొన్ని నెలకొరగగా, 150 పైగా ట్రాన్స్‌ఫార్మర్స్ నీట మునగడం, ప్లింత్ నుంచి నీటిలో పడిపోయాయి. తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిన్నింటి మరమ్మతులకు కలిపి సుమారు రూ.40 లక్షల వరకు అంచనా వేస్తుండగా పూర్తి స్థాయిలో మరమ్మతుల చేసేందుకు సమారు రూ.2కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు సరఫరా చేసే విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి చాలా చోట్ల తీగలు తెగిపోగా వెంటనే సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయాలు లేకుండా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్‌ల్లోకి నీరు చేరడంతో ప్రత్యామ్నాయ పద్ధతిలో పక్క సబ్ స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను సరఫరా చేశారు.

స్వీయ నియంత్రణ ముఖ్యం

వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేయరాదని వివిధ జిల్లాల సర్కిల్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ఇంట్లోని స్విచ్ బోర్డులను తడిచేతులతో తాకరాదన్నారు. విద్యుత్ అంతరాయంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా.. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అర్ధరాత్రి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్‌ను పునరుద్ధరించిన సిబ్బందిని ఆయా జిల్లాల ఎస్‌ఈలు ప్రత్యేకంగా అభినందిచారు.


ములుగు జిల్లాలో క్రేన్ సహాయంతో కొత్త పోల్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

నష్టం

భూపాలపల్లి జిల్లాలో 263 స్తంభాలు, 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, 9 డీటీఆర్‌లు దెబ్బతినగా సుమారు 1.60 లక్షల నష్టం వాటిల్లినట్లుగా విద్యుత్ అధికారులు అంచనా వేశారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 193 విద్యుత్ పోల్స్, 95 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 1.20 లక్షల నష్టం వాటిల్లిందని, ఇంకా ఈ నష్టం పెరిగే ఆవ కాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనగామలో 22 విద్యుత్ స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 2 లక్షల నష్టం వాటిల్లిందని అంచనాకు వచ్చారు. హనుమకొండ జిల్లాలో 18 పోల్స్, 23 ఇన్సులేటర్లు, 1 ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినగా రూ.1.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.

దెబ్బతిన్న చోట వెంటనే పునరుద్ధరణ పనుల చేపట్టాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 3: మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ కర్నాటీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలతో మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో వరదల కారణంగా చెట్లు విరిగిపడి చాలా చోట్ల విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం జరిగాయన్నారు. వాటి పనులను వేగంగా పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. కావాల్సిన మెటీరియల్, సిబ్బందిని అందిస్తామన్నారు. మునిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వద్ద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నా యంగా మరొక సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఉండేలా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. తద్వారా అంతరాయలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూ దన్, సీజీఎం రాజు చౌహాన్, జీఎంలు నాగప్రసాద్, మల్లిఖార్జున్, అన్నపూర్ణ, శ్రీనివాస్, అంకుశ్, డీఈలు అనిల్‌కుమార్, శ్రీధరాచారి, రమణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య


మహేందర్ (ఫైల్)

ధర్మసాగర్, సెప్టెంబర్ 3: ఉరి వేసుకొని మొగిలిచర్ల మహేందర్ (38) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై పోచయ్య మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మహేందర్ 18 ఏళ్ల కిందట రఘునాథపల్లి మండలం తాటికాయల గ్రామానికి చెందిన రమతో వివాహమైంది. గ్రామంలోనే లాండ్రీషాపు నడుపుకుంటూ ఇద్దరు జీవిస్తున్నారు. వీరికి సంతానం కాకపోవడంతో రమ మానసికంగా అనారోగ్యానికి గురైంది. దీంతో నాలుగు నెలల కిందట రమ తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో భార్య రావడం లేదని మనస్థాపం చెందిన మహేందర్ సోమవారం రాత్రి హనుమకొండలో ఉంటున్న తన అక్క స్వరూపకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున స్వరూప మహేందర్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి తమ్ముడు మహేందర్ ఫోన్ ఎత్తడం లేదని చెప్పడంతో వారు మహేందర్ ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూశారు. మహేందర్ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్యకు పాల్పడ్డాడు. విషయన్ని మృతుడి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలపడంతో వారు విచ్చేసి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేసి మృత దేహాన్ని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి రైతు గల్లంతు

నెక్కొండ మండలం గుండ్రపల్లి శివారులో ఘటన


గల్లంతైన రైతు అజీమత్

నెక్కొండ, సెప్టెంబరు 3: వాగు దాటుతుండగా రైతు గల్లంతైన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన షేక్ అజీమత్ (35) వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటి బయలుదేరాడు. గ్రామ శివారులోని వట్టివాగు దాటుతుండగా నీటి ప్రవాహం పెరగడంతో వాగులో కొట్టుకుపోయాడు. సమీపంలోని రైతులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అజీమత్‌కు భార్య చాందిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మొక్కజొన్న, పత్తిపంటకు నష్టం

ఐనవోలు, సెప్టెంబరు 3: భారీ వర్షానికి ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. గాలితో కూడిన వర్షం కురియడంతో పంథిని, పెరుమాండ్లగూడెం, నందనం, ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, కక్కిరాలపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న చేలు నేలవాలాయి. వాగులు వంకలు పొంగి పొర్లడంతో పత్తిచేళ్లు నీట మునుగగా వరి నాట్లు కొట్టుకపోయాయి. జరిగిన పంట నష్టంపై ప్రాథమిక సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఇవ్వడం జరిగిందని, రెండు, మూడు రోజుల్లో సర్వే చేసి పూర్తిస్థాయి నివేదికను అందించనున్నట్లు ఏవో సునీల్‌రెడ్డి తెలిపారు.


పెరుమాండ్లగూడెంలో నేలవాలిన మొక్కజొన్న చేను

పంథిని వద్ద కొత్తకాల్వపై ఎడుమ వైపు ప్రహరీ నిర్మాణంతో వరంగల్-ఖమ్మం హైవేపై ప్రవహిస్తున్న వరదనీరు, కుడివైపున రోడ్డు అంచు తెలియక జారిపడిన లారీ



ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా ?

వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి 563పై పంథిని వద్ద పొంచి ఉన్న ప్రమాదం

అక్రమ నిర్మాణంతో జాతీయ రహదారిపై వరద

ఐదేళ్లుగా పోలీసుల పహారాలోనే రాకపోకలు

ఐనవోలు, సెప్టెంబరు 3: నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి(563)పై ప్రయాణికులకు వరద ప్రమాదం పొంచి ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. వర్షం వచ్చిందంటే చాలు రోడ్డుపైకి వరద చేరుతుంటుంది. వరద ఉధృతికి భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు పడిపోయి ఆర్థిక, ప్రాణ నష్టం జరుగుతుంటాయి. పట్టించుకోవాల్సిన ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణంతో వరద

ఐనవోలు మండల పరిధిలోని సుమారు 70 చెరువులు, కుంటల మత్తళ్ల వరద నీరు పంథిని కొత్తకాల్వ ద్వారా ఆకేరు వాగులో కలుస్తుంది. ఐదేళ్ల కిందట కొత్త కాల్వకు కొద్ది దూరంలో ఒకరు బాయిల్డ్ రైస్ మిల్ నిర్మించారు. విల్లు చుట్టూ ప్రహరీని నిర్మించి కొత్తకాల్వను హైవేకు ఆనుకొని వెళ్లేలా దారి మళ్లించారు. దీంతో ఉధృతంగా వచ్చే వరద జాతీయ రహదారిపైకి వచ్చి సుమారు 300 మీటర్ల వెడల్పుతో ప్రవహిస్తుంటుంది. దీంతో వాహనాలు పడిపోవడం.. ప్రయాణికులు కొట్టుకపోయిన ఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో రాత్రివేళ ఎప్పుడు రోడ్డుపైకి వరద వస్తోందో తెలియని పరిస్థితి, అంతర్రాష్ట్ర రహదారి కావడంతో వాహనాదారులకు వరదవచ్చే సమయంలో రోడ్డుపై నెలకొన్న పరిస్థితి తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

పోలీసుల పహారాతోనే రాకపోకలు

వర్షాకాలం వచ్చిందంటే పోలీసులు కొత్త కాల్వలో ఉన్న చెట్లను తొలగించి రోడ్డుకు ఇరువైపులా గుంతలను పూడ్చి వాహనాలు పడిపోకుండా చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది. చెరువులు నిండి మత్తళ్లు ప్రారంభం కాగానే రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు సజావుగా సాగేలా 24 గంటలు విధులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతున్నారు. ప్రయాణికుల కోసం పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంటే, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కొత్త కాల్వపై నిర్మించిన ప్రహరీని పరిశీలించి అక్రమ నిర్మాణమైతే కూల్చి వేయాలని, సక్రమ నిర్మాణమైతే భూ యాజమానితో మాట్లాడి ప్రహరీని తొలగించి వరద రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త కాల్వపై ప్రహరీని పరిశీలిస్తాం..

ఈ విషయంపై తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ శంకర్ చౌహాన్‌లు మాట్లాడారు. బుధవారం పంథిని కొత్త కాల్వ ప్రహరీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నక్షలో ఏముందో పరిశీలించి వరదను జాతీయ రహదారిపై రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 3: హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో సేంద్రియ టప్పర్ సిల్క్ చీరలు, డ్రెస్‌లు, క్రేప్ సిల్క్, జార్జెట్ సిల్క్, కాంజీవరం సిల్క్ చీరలు, డిజైనర్ ఫ్యాన్సీచీరలు ప్రదర్శనకు పెట్టడంతో పాటు విక్రయాలు జరుపుతున్నారు. ఇంకా ప్రదర్శనలో మల్బరీ సిల్క్ చీరలు, జమావార్ సిల్, పటియాల డ్రెస్ మెటీరియల్స్ మహేశ్వరి చందేరి సిల్క్ చీరలు, బొటిక్ చీరలు, కాంతా చీరలు, పష్మినా పాల్స్ డ్రెస్ మెటీరియల్స్ ప్రదర్శనలో విక్రయిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 8 వరకు కొనసాగనుంది.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

వేలేరు, సెప్టెంబరు 3: వేలేరు మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి విజయ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. సిబ్బంది హాజరు సంబంధించిన రిజిస్ట్రర్లను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలను, సీజన్‌లో వస్తున్న వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. అనంతరం వేలేరు మండలం పీచరలో సబ్‌సెంటర్‌ను కుడా ఆయన తనిఖీ చేశారు.

దేవస్థానం చైర్మన్ పదవి ఐనవోలు వ్యక్తికే ఇవ్వాలి

ఐనవోలు, సెప్టెంబరు 3: ఐనవోలు దేవస్థానం చైర్మన్ పదవిని ఐనవోలువాసులకే కేటాయించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల కోసం ఎంపీడీవో సముదాయ భవనాలతో పాటు పోలీస్‌స్టేషన్ భవనం, కుల సంఘాల కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీ భాస్కర్, నాయకులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3: టీజీఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్ లైన్ సెంటర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 9 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనను సంప్రదించవచ్చునన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ అనంతరం నుంచి 11 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని, 14న సీట్ల అలాట్‌మెంట్ జరుగుతుందని, 17 వరకు సంబంధి కళాశాలలో విద్యార్థులు సెల్ఫ్‌రిపోర్టు చేయాలన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలుచేయాలి

బాలసముద్రం, సెప్టెంబరు 3: కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రజక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే మంగళవారం ఏకశిల పార్కు ఎదుట ఆమరణ నిరాహారదీక్ష చేశాడు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు 10 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్‌కు మద్దతుగా బీసీ సంఘాల నాయకులు పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, సాయిని రాజేందర్, తాడిశెట్టి క్రాంతికుమార్, సురేశ్, జానకి, రాములు, శ్రీనువాస్, రమేశ్‌చారి, మహేశ్, భీమ్‌రాజు, శ్రీకాంత్‌లు దీక్షలో పాల్గొన్నారు.

డ్రెయినేజీ డైవర్షన్.. ఇళ్లలోకి నీరు..

కాంట్రాక్టర్ తీరుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

న్యూశాయంపేట, సెప్టెంబర్ 3: 31వ డివిజన్ న్యూశాయంపేటలోని ఓ టౌన్‌షిప్‌లో సహజంగా పారే డ్రెయినేజీ వ్యవస్థను దారి మళ్లించడంతో ఆ నీరంతా ఇళ్లకు వెళ్లే దారితోపాటు ఇళ్లచుట్టూ చేరడంతో టౌన్‌షిప్ ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ టౌన్‌షిప్‌లో గతంలో కుంట స్థలం ఉండగా, ఆ కుంట స్థలాన్ని ఓ కాంట్రాక్టర్ కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాడు. అయితే ఈ టౌన్‌షిప్ నుంచి పారే డ్రెయినేజీ వ్యవస్థ కాంట్రాక్టర్ కడుతున్న ఇళ్లలో నుంచి రావడంతో ఆ డ్రెయినేజీని డైవర్షన్ చేయించాడు. అయితే ఇండ్ల నుంచి వచ్చే మురికినీరు, వర్షాలు పడ్డప్పుడు వచ్చే నీరంతా డ్రెయినేజీ ద్వారా వెళ్లకుండా టౌన్‌షిప్‌లో ఉన్న ఇళ్ల చుట్టూ చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉండే మంద శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి చుట్టూ నీరు చేరి వారు ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి కూడా దారి లేకుండా ఉంది. మరో నాలుగైదు ఇళ్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని డ్రెయినేజీ వ్యవస్థను సరి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


డ్రెయినేజీ మళ్లించడంతో ఇంటిచుట్టూ చేరిన నీరు

నిత్యావసర వస్తువులు అందించాలి

సీపీఐ మండల కార్యదర్శి భిక్షపతి

కాజీపేట, సెప్టెంబరు 3: మూడు రోజులుగా వర్షాలతో దెబ్బతిని ఉపాధి కోల్పోయిన నిరుపేదలకు ప్రభుత్వం నిత్యావసర వస్తువులు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాజీపేట వైఎస్ ఆర్‌నగర్‌లో సీపీఐ నాయకులు ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భిక్షపతి హాజరై మాట్లాడారు. తీవ్రవర్షాల నేపథ్యంలో 62, 63వ డివిజన్లలో పూర్తిగా నీరు చేరాయని చెప్పారు. ప్రజలకు జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోవాలని కోరారు. అధిక ధరలకు నిరసనగా ఈ నెల 6న హనుమకొండ అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

భీమారం రోడ్డుపై పడిపోయిన వృక్షం

గంటపాటు ట్రాఫిక్ జామ్.. తొలగించిన డీఆర్ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 3: వరంగల్ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెద్ద పెద్ద చెట్లు నేల కూలుతున్నాయి. ఈ క్రమంలో కేయూ నుంచి భీమారం వైపు వెళ్లే ప్రధాన రహదారి (టీబీ ఆస్పత్రి ముందు)పై మంగళవారం అతిపెద్ద వృక్షం నేలకూలింది. దీంతో కరీంనగర్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు గంట పాటు స్తంభించిపోయాయి. అక్కడి ప్రయాణికులు బల్దియా కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి చెప్పడంతో బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ అక్కడకు చేరి ముందుగా అక్కడి వారి సహకారంతో చెట్టును రోడ్డు పక్కకు తరలించారు. తర్వాత బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బందిని పిలిచి చెట్టును ముక్కలుగా చేసి అక్కడి నుంచి తరలించారు. దీంతో రోడ్డుపై పడిపోయిన చెట్టు సమస్య పరిష్కరించబడింది.


రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

27, 28 తేదీల్లో జాతీయ సదస్సు

కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: హనుమకొండ వడ్డేపల్లిలోని పింగళి అటానమస్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల హిస్టరీ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కేయూ హిస్టరీ, టూరిజం విభాగంలో సోషల్‌సైన్స్ డీన్ టీ మనోహర్, విభాగాధిపతి చిలువేరు రాజ్‌కుమార్, రిటైర్డు ప్రొఫెసర్ కె.విజయబాబు, తెలుగు వర్సిటీ డీన్ ప్రొఫెసర్ గడ్డం వెంకన్నలు ఆవిష్కరించారు. 'సొసైటీ ఎకానమీ కల్చర్ ఇన్ తెలంగాణ 12 టూ 20 సెంచరీ ఈసీ' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, పింగళి హిస్టరీ విభాగాధిపతి కే శ్రీనివాస్ తెలిపారు.

ప్రొఫెసర్ భద్రూనాయక్‌కు నివాళి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: కేయూ హిస్టరీ, టూరిజం విభాగం రిటైర్డు ప్రొఫెసర్ గుగులోత్ భద్రూనాయక్ మృతికి మంగళవారం కేయూ హిస్టరీ విభాగంలో ప్రొఫెసర్లు నివాళులర్పించారు. కేయూ మానవీయ శాస్త్ర భవనంలోని హిస్టరీ విభాగంలో హిస్టరీ అండ్ టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ నేతృత్వంలో భద్రూనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భద్రూనాయక్ హిస్టరీ విభాగానికి, సామాజానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డాక్టర్ పి.కృష్ణ సుమంత్, డాక్టర్ కేవీఎస్ నరేందర్, పల్నాటి నరేశ్, డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలి

కాజీపేట, సెప్టెంబరు 3: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకులు జంపాల రమేశ్ కాజీపేట తహసీల్దార్ బావుసింగ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ షరతులతో కొద్ది మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు మదన్ చారి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

ధర్మసాగర్, సెప్టెంబరు 3: ప్రభుత్వం ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వ అధికారంలోకి వస్తే ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు చెల్లిస్తామని చెప్పి ఎనిమిది నెలలు గడిచినా వేతనం అమలు చేయడం లేదన్నారు. ఆశ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు ప్రభుత్వమే రిజిస్ట్రర్లను అందజేసి, నాలుగు జతల యూనిఫామ్ పంపిణీ చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5న కలెక్టర్‌కు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి వినతి పత్రం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

హసన్‌పర్తి, సెప్టెంబరు 3: హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన బల్సుకూరి వినయ్ ఆలియాస్ రిచ్ అనే యువకుడు 2023లో హత్యాయత్నం కేసులో నిందితుడు. ఇదే గ్రామానికి చెందిన జల్లి అక్షయ్‌కుమార్‌ను మద్యం సేవించేందుకు హసన్‌పర్తి వైన్స్ షాపునకు రమ్మని బీరు తాగమని బలవంతం చేశాడు. దీంతో అక్షయ్‌కుమార్ నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన వినయ్.. అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అంతేకాకుండా ముఖంపై పిడిగుద్దులు గుద్దుతూ రక్తస్రావం వచ్చే వరకు కొట్టాడు. అక్కడే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్న తుమ్మ లక్ష్మణ్, లక్ష్మి దంపతులను, చికెన్ సెంటర్ యజమాని అమీరుద్దీన్, పూనం సురేష్‌లను కూడా విచక్షణారహితంగా కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే నిందితుడు వినయ్‌ను అరెస్టు చేసి హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తిని సీజ్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఖమ్మానికి జీడబ్ల్యూఎంసీ కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 3: ఇటీవల కురిసిన భారీవర్షాలకు ఖమ్మం జిల్లాలోని చాలా ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఖమ్మం జిల్లాలో పని చేసేందుకు వరంగల్ బల్దియాలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి కేటాయించారు. కాగా, మంగళవారం ప్రత్యేక బస్సులలో పారిశుధ్య కార్మికులు ఖమ్మంకు బయలుదేరి వెళ్లినట్లు సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్ వెల్లడించారు. మేయర్ గుండు సుధారాణి ఆదేశాల మేరకు బల్దియాకు చెందిన 150 మంది కార్మికులు 10 స్వచ్ఛ ఆటోలు, 5 ట్రాక్టర్లు, ఒక రోబో (బాబ్‌కార్ట్) పంపించడంతో పాటు సిబ్బందికి పనిముట్లు, రెయిన్ కోట్లు అందించినట్లు రాజేశ్ తెలిపారు. సూపర్‌వైజర్‌లు నరేందర్, భాస్కర్‌లతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పోలెపాక అనిల్‌కుమార్, శ్యాంరాజు, సంపత్‌రెడ్డి, మలేరియా విభాగం అధికారి చీకటి ప్రకాశ్, జవాన్లు కొత్తకొండ శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఐనవోలు, సెప్టెంబరు 3: కొండపర్తి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మాచర్ల చిన్న రాజు ఇటీవల మృతి చెందాడు. ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట సాంబరాజు ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.35వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేసి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో యూనియన్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా సాధనే ధ్యేయం

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 3: విప్లవ విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా సాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని ప్రగతి శీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ అశోకా జంక్షన్‌లో పీడీఎస్‌యూ 50వ వార్షికోత్సవ సభలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విస్తృతంగా నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను నరసింహారావు పలు కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వాలు విద్యా రంగ బాధ్యత నుంచి క్రమంగా తప్పుకోవడంతో విద్యారంగం పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లి, వ్యాపారంగా మారి పేద వర్గాలకు విద్య అందని ద్రాక్షలా పాలకులు మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా అక్టోబరు12, 13 తేదీల నాటికి పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సభలు, సమావేశాలు, గ్రూప్ మీటింగ్‌లు విస్తృతంగా నిర్వహించాలని నరసింహారావు కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ నాయకులు రవి, అభిషేక్, అఖిల్, కె.కళ్యాణ్, వర్షిత్, కె.కేశవ్, బి.రాజ్‌కుమార్, చరణ్, సయ్యద్ అజహార్, తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ సభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బాలగణేష్ ఉత్సవాలకు భారీ లడ్డు

వడ్డేపల్లి, సెప్టెంబరు 3: వరంగల్ పాపయ్యపేట చమన్ పక్కన కాకతీయ థియేటర్ ప్రాంతంలో వారాహి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బాలగణేష్ ఉత్సవాలకు 1500 కిలోలతో భారీ లడ్డూను గణపతికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు వారాహి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సూర్యదేవర క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడు కొల్లూరు పూర్ణచందర్ తెలిపారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 7న గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా విఘ్నేశ్వరుడిని దర్శించుకొని భారీ లడ్డూను వీక్షించాలని వారు కోరారు.

చదువుతోనే బంగారు భవిష్యత్ : డీఈవో


కేజీబీవీలో వంటగదిని పరిశీలిస్తున్న డీఈవో వాసంతి, కోఆర్డినేటర్ సునీత

ఐనవోలు, సెప్టెంబరు 3: చదువుతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని కష్టపడి చదివి ప్రయోజకులుగా మారాలని డీఈవో వాసంతి తెలిపారు. ఐనవోలు కేజీబీవీ పాఠశాలను జిల్లా జెండర్ కోఆర్డినేటర్ ఎస్. సునితతో కలిసి మంగళవారం ఐనవోలు కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు చదువుకు దూరం కావొద్దని, ప్రభుత్వం కేజీబీవీలాంటి అనేక గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కోరారు. పాఠశాలలో పరిసరాలు, వంటశాలలో వంట పదార్థాలు, పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, పాఠశాల ఇన్‌చార్జి ఎస్‌వో బి. సత్యవాణి, ఉపాధ్యాయునులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇతరులతో సంతకాలు చేయించలేదు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3: హనుమకొండ డీఈవో కార్యాలయంలో డ్యూటీలకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు మరొకరితో సంతకం చేయించలేదని డీఈవో డి.వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. విద్యాశాఖలో తప్పులు చేస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం చేయనున్నట్లు డీఈవో డి.వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తదితరులు అతిథులుగా పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆమె కోరారు.

చిరు వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 3: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చిరు ఆహార వ్యాపారులు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వరంగల్ ఆహార పరిరక్షణ అధికారి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ చిరు వ్యాపారి ఆహార పరిరక్షణ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈనెల 5న గ్రేటర్ వరంగల్ బల్దియా కార్యాలయం ఆవరణలోని మెప్మా భవన్‌లో రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. అక్కడే అర్హులైన వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించనున్నట్లు కృష్ణమూర్తి వెల్లడించారు.



సెలబ్ ఫిట్

అందంగా కనిపిస్తే సరిపోదు... ఆరోగ్యంగానూ ఉండాలంటుంది బాలీవుడ్ తార దిశా పటాని. అద్భుతమైన అభినయమే కాదు... చూడచక్కని రూపంతో వరుస అవకాశాలు దక్కించుకొంటున్న దిశ... తన ఫిట్‌నెస్ సీక్రెట్స్ గురించి ఇలా చెబుతోంది.

మెరుపు తీగ

"చక్కని ఆకృతిని పొందడం, దాన్ని అలాగే కొనసాగించడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. అందుకు ఎంతో అంకిత భావం, క్రమశిక్షణ అవసరం. క్రమంతప్పని వ్యాయామాలు, కచ్చితమైన ఆహార నియమాలు పాటించాను కాబట్టే అభిమాన నటిగా ఇంతటి పేరు తెచ్చుకోగలిగాను.

రోజుకు రెండుసార్లు

చదునైన పొట్ట, బలమైన చేతులు నాకు ప్లస్ పాయింట్లు. ఇలాంటి ఫిట్‌నెస్ దక్కించుకోవాలంటే రెండింతలు కష్టపడాలి. నేను రోజుకు రెండుసార్లు జిమ్‌కు వెళ్తాను. ఉదయం గుండె వేగాన్ని పెంచే కార్డియో, సాయంత్రం బరువులతో కూడిన వెయిట్ లిఫ్టింగ్ చేస్తాను. డ్యాన్సింగ్, కిక్ బాక్సింగ్, జిమ్నాస్టిక్స్ కూడా నా వ్యాయామంలో భాగాలే. సైకిల్ తొక్కడం, ట్రెడ్‌మిల్ మీద పరుగెత్తడం నాకు నచ్చదు. వాటికి బదులుగా డ్యాన్స్ చేస్తాను. అదీ అత్యధిక తీవ్రతతో కూడిన హై ఇంటెన్సిటీ డ్యాన్సులు. వాటితో శరీరం మొత్తానికీ చక్కని వ్యాయామం దొరుకుతుంది. సాయంత్రం వెయిట్స్ చేస్తాను. దీనివల్ల శరీరాకృతి చక్కగా మారుతుంది. బరువులతో కూడిన వ్యాయామాలు చేస్తే కండలు తిరిగి, అందం పోతుంది అనుకుంటాం. కానీ ఇది అపోహ మాత్రమే! ముఖ్యంగా మహిళలు బరువులతో కూడిన వ్యాయామాలు చేయడం ఎంతో అవసరం.



నియమిత ఆహారశైలి...

మనం తినే ఆహారం మీదే మన ఆకారం ఆధారపడి ఉంటుంది. రోజుకు రెండుసార్లు వ్యాయామాలు చేస్తాను కాబట్టి నా ఆహారంలో మాంసకృత్తులు, పిండిపదార్థాలు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకుంటాను. అలాగే ప్రతి వర్కవుట్‌లోనూ సరిపడా నీళ్లు తాగుతాను. నా ఆహారంలో బ్రౌన్ రైస్, పప్పు, కూరగాయలు, పండ్ల రసాలు ఉంటాయి. ఉదయం తృణధాన్యాలు, పాలు తీసుకుంటాను. బాదం, వేరుశనగపప్పు, తాజా పండ్లు తింటాను. వారంలో ఒకరోజు నాకు నచ్చినదల్లా తినేస్తాను.

వ్యాయామానికి ముందు...

వ్యాయామం చేసినంతసేపు శక్తి తగ్గకుండా నిలకడగా కొనసాగాలంటే, దానికి ముందు అందుకు తోడ్పడే పదార్థాలు తినాలి. మొదట్లో ఖాళీ కడుపుతో, ఏమీ తినకుండానే వ్యాయామం చేసే అలవాటు ఉండేది. తిని వ్యాయామాలు చేస్తే, కడుపు బరువుగా ఉంటుందనే భావనతో అలా చేసేదాన్ని. అయితే వ్యాయామానికి ముందు ఎంతోకొంత పోషకభరిత ఆహారం తినడం అవసరం అని తర్వాత తెలుసుకున్నాను. పన్నీర్ లాంటి మాంసకృత్తులతో కూడిన ఆహారం వ్యాయామానికి ముందు తప్పక తినాలి. అలాగే వ్యాయామం ముగిసిన తర్వాత అలసిన కండరాలు బలం పుంజుకోవడం కోసం కూడా మాంసకృత్తులు అవసరమే.

ఇవీ అవసరమే!

ఆహారంలో మాంసకృత్తులు, పిండిపదార్థాలు, పీచు సమపాళ్లలో ఉండాలి. ఇందు కోసం నేను అవన్నీ ఉండే పదార్థాలన్నీ మధ్యాహ్న భోజనంలో ఉండేలా చూసుకుంటాను. భోజనంలో అన్నం కూడా తింటాను. రాత్రివేళ భోజనంలో ఎక్కువ మాంసకృత్తులు ఉండేలా చూసుకుంటాను. రోజుకు ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్ర పోతాను. నిద్రతో శరీరం పునరుత్తేజం పొందుతుంది. తీసుకున్న ఆహారంలోని పోషకాలను శరీరం శోషించుకునేది నిద్రలోనే.

ఇవి తప్పనిసరి...

వ్యాయామాలకు తోడ్పడే వస్తువులన్నీ జాగ్రత్తగా ఎంచుకోవాలి. నా వర్కవుట్ బ్యాగ్‌లో బ్రూనోమార్స్ పాటలు వినడం కోసం ఇయర్‌ఫోన్స్, నీళ్ల బాటిల్ తప్పనిసరిగా ఉంటాయి. మన పాదాలను బట్టి సరైన షూ ఎంచుకోవాలి. ఇక వ్యాయామం కోసం ధరించే దుస్తులు సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తూ, నప్పే రంగులు ఎంచుకోవాలి. సాగే గుణం ఉండి, చెమటను పీల్చుకునే దుస్తులే ధరించాలి.

ఎంపిక ఇలా...

అందరి శరీర తీరులూ ఒకేలా ఉండవు. ఒకరికి నప్పిన వ్యాయామాలు అందరికీ నప్పుతాయని చెప్పలేం. కాబట్టి తీసుకునే క్యాలరీలు, జీవనశైలి, శరీర తీరులను బట్టి వ్యాయామాలను ఎంచుకోవాలి. కొవ్వు శరీరంలో పేరుకునే ప్రదేశాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటాయి. కొందరికి పొట్ట, పిరుదుల్లో కొవ్వు పేరుకోవచ్చు. మరికొందరికి నడుము పైభాగం లావుగా ఉండవచ్చు. ఇలాంటి భిన్న శరీర తత్వాలు కలిగిన వాళ్లందరికీ ఒకే రకమైన వ్యాయామాలు ఫలితాలను ఇవ్వకపోవచ్చు. కాబట్టి నడుము కింద భాగంలో కొవ్వు ఎక్కువగా ఉన్నవాళ్లు కాళ్లు, పిరుదులు, నడుముకు సంబంధించిన వ్యాయామాలు ఎక్కువగా చేస్తూ ఉండాలి. నడుము పైభాగంలో... అంటే, చేతులు, భుజాలు, ఛాతీ, మెడ ప్రదేశాలు లావుగా ఉన్నవాళ్లు బరువులతో కూడిన వ్యాయామాలు చేయడం ఎంతో అవసరం. శరీరం మొత్తానికి వ్యాయామాన్ని అందించే వర్కవుట్లు రెండు రకాల వాళ్లకూ ఉపయోగకరమే.

వారంలో ఐదు రోజులు...

క్రమంతప్పక జిమ్‌కు వెళ్లాలని ఉన్నా, అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అయితే వారంలో కనీసం 5 రోజులపాటు జిమ్‌కు వెళ్లగలిగితే వ్యాయామ ఫలం దక్కుతుంది. రెండు రోజులకు మించి విరామం ఇచ్చినా శరీరం ఫిట్‌నెస్‌ను కోల్పోతుంది. కాబట్టి వీలైతే వారానికి ఒక్కరోజు లేదా తప్పనిసరి పరిస్థితుల్లో వారానికి రెండు రోజులు వ్యాయామానికి విరామం ఇవ్వవచ్చు. అలాగే ఆరోగ్యం అనుకూలించని సందర్భాల్లో ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలకు బదులు తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చు. సాధ్యమైనంతవరకూ వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగంగా భావించడం అలవాటు చేసుకోవాలి. ఇలాంటి ఆలోచన వ్యాయామం పట్ల ఆసక్తి కొనసాగడానికి తోడ్పడుతుంది.



'నేను గురువులు తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలిని. టీచర్ అవ్వాలన్న ఆశయానికి పునాది వేసింది వారే' అంటారు డాక్టర్ నందవరం మృదుల. తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికైన ఆమె... రేపు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.

గురువులు మలచిన జీవితం నాది

"జాతీయ ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యానని తెలిసిన వెంటనే భావోద్వేగానికి లోనయ్యాను. ఆ క్షణం నాకు విద్యా బుద్ధులు నేర్పిన మా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు... అందరూ నా కళ్లముందు మెదిలారు. గురువులు మలచిన జీవితం నాది. చిన్నతనంలో నన్ను అమ్మానాన్న కంటే విన్నగా మా ఉపాధ్యాయులే ఎక్కువ గారాబం చేశారంటే అతిశయోక్తి కాదు. మొట్టమొదట నన్ను ప్రభావితం చేసింది... నాలో టీచర్ అవ్వాలన్న కోరికకు పునాది వేసినవారు... సికింద్రాబాద్‌లోని 'పరోపకారిణి బాలికోన్నత పాఠశాల'లోని మా భువనేశ్వరి టీచర్. ఆనాడు ఆమె బోధించిన తెలుగు పాఠాలే నన్ను ఇవాళ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానంలో నిలబెట్టాయి. బడి వదలగానే నేరుగా మా ఇంటికి దగ్గర్లోని వీధి బడికి వెళ్ళేదాన్ని. అక్కడ రంగమ్మ టీచర్ నన్ను దగ్గరకు తీసుకొని... పాఠాలు వల్లె వేయించేవారు. తన ప్రేమానురాగాలతో నాలో చదువుపట్ల అనురక్తి కలిగించారు. పాఠశాల స్థాయిలోనే నేను అక్షరదోషాలు లేకుండా తెలుగులో రాయగలిగినా, మాట్లాడగలిగినా... అదంతా వీరి పుణ్యమే. పాఠ్యాంశాలను సామాజిక అంశాలతో కలగలిపి బోధించడం వారిని చూసే నేర్చుకున్నాను. పాఠం చెప్పి వదిలేయకుండా... వాటి మీద విద్యార్థులతో ప్రతి శనివారం చర్చాగోష్ఠి నిర్వహించడం, కవిత్వం, కథలు రాయించడం లాంటి కార్యక్రమాలతో... తరగతి గదిని ఎంత సృజనాత్మకంగా మార్చవచ్చో నలభై ఏళ్ళ కిందటే మా భువనేశ్వరి టీచర్ చేసి చూపించారు. అదే నేను ఈనాటికీ ఆచరిస్తున్నాను.

ఎప్పుడూ బెత్తం పట్టలేదు...

నా పాతికేళ్ళ బోధనా వృత్తిలో నేను ఎన్నడూ బెత్తం చేతపట్టలేదు. ఇంతవరకు ఒక్క విద్యార్థిని కూడా దండించలేదు. అందుకు మా గురువులే నాకు స్ఫూర్తి. తిడితేనో, కొడితేనో క్రమశిక్షణ అలవడుతుందనే వాదనను నేను అస్సలు అంగీకరించను. తరగతి గదిలో అల్లరి పిల్లలు ఉంటారు. మొండి ఘటాలు, మర్యాద తెలియని వారు... ఇలా బోలెడు మంది తారసపడతారు. అలాంటి వారందరితో సున్నితంగా వ్యవహరించడం అధ్యాపకుల విధి. విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించినప్పుడే.. వారిని మందలించే అర్హత పొందగలం. గురువుల ఆగ్రహంలో పిల్లల భవిష్యత్తు పట్ల ఆర్తి, ఆవేదన ప్రస్ఫుటమవ్వాలి. అంతేకానీ అకారణ కోపాలు, మితిమీరి స్పందించడాలు లాంటి వాటికి తావు ఉండకూడదు. బోధనా రంగంలో ఉన్నవారు సహనాన్ని కోల్పోకూడదన్నది ప్రాథమిక సూత్రం. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న రోజుల్లో... మా ఆచార్యులు జీవీ సుబ్రహ్మణ్యం గారు... తన శిష్యులను సైతం ఎన్నడూ ఏకవచనంతో సంబోధించి ఎరుగరు. బోధనేతర సిబ్బందిని "మాస్టారు" అనేవారు. కేకే రంగనాథాచార్యులు గారైతే విద్యార్థులను కూడా ఆప్యాయంగా "మిత్రమా" అని పిలిచేవారు. విద్యార్థులతో, ముఖ్యంగా టీనేజర్లతో బోధకులు స్నేహపూర్వకంగా మెలగాలన్నది వారి నుంచి నేర్చుకొన్నాను. విద్యార్థులలోని లోపాలను సవరించే ప్రదేశం తరగతి గది. అది ఎంత ఆహ్లాదంగా ఉంటే పిల్లల భవిష్యత్తుకు అంత మంచిదని నమ్ముతాను. కనుక కొట్టడం, తిట్టడం మాట అటుంచి... విసుక్కోవడాలు, కసురుకోవడాలకు కూడా నేను వ్యతిరేకం.

అది అవార్డులు ఇవ్వలేని సంతోషం...

"ఉపాధ్యాయుల ఆహార్యం ఆకర్షించేలా కాకుండా, విద్యార్థులను ఆకట్టుకుంటూనే వీలైనంత నిరాడంబరంగా ఉండాలి. అది నేను మా గురువులను చూసి నేర్చుకొన్నాను. మా ఉపాధ్యాయులను అనుసరిస్తూ, నేనూ కాటన్ చీరలు మాత్రమే ధరిస్తాను. ఎలక్షన్ డ్యూటీ నిమిత్తం గ్రామాలకు ఎప్పుడు వెళ్ళినా... అక్కడ కనీసం ఇద్దరు ముగ్గురైనా "మీ విద్యార్థులం మేడం. ఆనాడు మీరు చెప్పిన మాటల వల్ల జీవితంలో ముందుకు వెళ్ళగలిగాం" అంటూ కృతజ్ఞతలు చెబుతుంటారు. ఒక అమ్మాయి అయితే, తనకు పెళ్లయ్యాక కూడా చదువు కొనసాగించి ఉద్యోగంలో స్థిరపడినట్టు చెప్పారు. అలాంటి సందర్భాల్లో కలిగే సంతోషాన్ని అవార్డులు కూడా ఇవ్వలేవు.

అదే గుర్తింపు తెచ్చిందనుకుంటున్నా...

తెలుగు సబ్జెక్టు అనగానే, సిలబస్ అంతా ఒక నెలలో చెప్పి మిగతా సమయంలో ఇన్విజిలేషన్ తదితర డ్యూటీలకు వెళ్ళచ్చు అన్నది చాలామంది అభిప్రాయం. పలు సందర్భాల్లో తెలుగు పీరియడ్‌ను లెక్కలు, సైన్స్ బోధకులు తీసుకొంటారు. నా విషయంలో అందుకు పూర్తి విరుద్ధం. మిగతా సబ్జెక్టుల పీరియడ్లను అడిగి మరీ తీసుకొంటాను. పాఠాన్ని పరిగెత్తించడం నాకు నచ్చదు. నేను నిజాం కళాశాలలో డిగ్రీ చదువుతున్న రోజుల్లో మా సంస్కృత అధ్యాపకురాలు కప్పగంతుల కమలా మేడమ్... ఖాళీ సమయంలో కూడా మమ్మల్ని పక్కన కూర్చొబెట్టుకొని... "రామ శబ్దం అప్పజెప్పమ్మా! ఒక తెలుగు పద్యాన్ని సంస్కృతంలోకి అనువదించి చూపించు" అంటూ మాతో సాధన చేయించారు. సెంట్రల్ యూనివర్సిటీలో రవ్వా శ్రీహరిగారు సంస్కృత వ్యాకరణం, కేకేఆర్ గారు భాషా చరిత్ర, జీవీ సుబ్రహ్మణ్యంగారు సాహిత్య విమర్శ, సి. ఆనందారామం గారు నవలా సాహిత్యం... ఇలా ఒక్కొక్కరూ ఒక్కో అంశంమీద మాకు పసిబిడ్డకు ఉగ్గుపట్టినంత శ్రద్ధగా బోధించారు. కనుకనే మేము ఈ రోజు ఇంతమాత్రమైనా సబ్జెక్టు మీద సాధికారత సాధించగలిగాం. వారి శిష్యురాలిగా... నేను కూడా 'ఇది నా బాధ్యత మాత్రమే' అని సరిపెట్టుకోకుండా... నా విద్యార్థులను భావి రీసెర్చి స్కాలర్స్‌గా తయారుచేస్తున్నానన్న స్పృహతో పాఠాలు బోధిస్తున్నాను. బహుశా అదే నాకు ఇవాళ ఈ అరుదైన గుర్తింపు తెచ్చింది అనుకొంటున్నాను.



అవన్నీ అపోహలే...

బి.ఇడి. చేసి టీచర్ కావాలనుకున్నా... నాకు ఆ అవకాశం లేకపోవడంతో... పోటీ పరీక్షల్లో ఎంపికై... 1998లో సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా చేరాను. పదేళ్ళ తర్వాత డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పదోన్నతి మీద మెదక్, నర్సాపూర్ ప్రభుత్వ కాలేజీల్లో పనిచేశాను. హైదరాబాద్‌లో పుట్టి, పెరిగిన నాకు పల్లె వాతావరణాన్ని దగ్గర చేసింది నా వృత్తి జీవితం. నర్సాపూర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్‌గా... పిల్లలతో కలిసి పెద్దచింతకుంట గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాను. వాటిని ఇప్పటికీ ఆ ఊరి సర్పంచ్ కొనసాగిస్తున్నారు. మా విద్యార్థులు రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస ప్రాజెక్టు'కు ఎంపికయ్యారు. అంతకు మించిన సంతోషం నాకు మరేదీ ఉండదు. బదిలీమీద మూడేళ్ళ కిందట బేగంపేట ప్రభుత్వ మహిళా కళాశాలకు వచ్చాను. మా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మావతి సహకారంతో పుట్టుకతో ఎడమ చెయ్యి లేని అమ్మాయికి కృత్రిమ చెయ్యి పెట్టించాం. మరొక అమ్మాయి కంటి శస్త్ర చికిత్సకు అవసరమైన సొమ్ము సమకూర్చడంలాంటి బాధ్యతలను కళాశాల నిర్వర్తించింది. ప్రభుత్వ కళాశాల అనగానే సమాజంలో ఒక లాంటి అభిప్రాయం స్థిరపడింది. పైగా ప్రభుత్వ బోధకులు అనగానే మొక్కుబడిగా పాఠాలు చెబుతారనుకొంటారు. అవన్నీ అపోహలే అనడానికి ఈ సంఘటనలే ఉదాహరణ. తెలుగులోనూ ప్రవేశాలు పెరిగాయి. మిగతా కోర్సులకు దీటుగా తెలుగును అభ్యసిస్తున్నవారు పెద్దసంఖ్యలోనే ఉన్నారనడంలో సందేహంలేదు.

అమ్మను చూసి నేర్చుకున్నా...

మా అమ్మ వెంకటేశ్వరమ్మ, మా నాన్న విష్ణుప్రసాద్. 'పెద్దలను గౌరవించాలి' అని వారు నేర్పిన సంస్కారమే నన్ను గొప్ప ఉపాధ్యాయులకు శిష్యురాలిని చేసింది. ఒకవైపు ఉద్యోగాన్ని, మరో వైపు ఇంటిని సమన్వయం చేసుకొంటూ ఎలా ముందుకెళ్లాలో ఉద్యోగి అయిన మా అమ్మను చూసి నేర్చుకొన్నా. కరోనా సమయంలో మృత్యువు అంచు వరకు వెళ్లి వచ్చిన నన్ను తిరిగి ఆరోగ్యవంతురాలిని చేసింది... నా భర్త నరసింహారావు, కుమారుడు అత్రి, కుమార్తె మైత్రి. కొన్ని నెలల పాటు మంచానికే పరిమితమైన నాకు ఆ సమయంలో వారు చేసిన సపర్యలు మా కన్నవారిని తలపించింది. వారి ప్రేమను ఇంతగా పొందుతున్నందుకు నేను చాలా అదృష్టవంతురాలిని.

సాంకేతికత వినియోగం అంతవరకే...

ఉపాధ్యాయుల జీవితంలో సగం తరగతి గదిలోనే గడుస్తుంది. కాలానికి అనుగుణంగా గురు, శిష్యుల బంధంలోనే కాదు... మొత్తంగా తరగతిలోనే అనూహ్య మార్పులు చూస్తున్నాం. ముఖ్యంగా కొవిడ్ తర్వాత ఆన్‌లైన్ తరగతులు బోధనలో భాగమయ్యాయి. ఎంత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యుగమైనా, గురువుకు తెలియని సమాచారం గూగుల్‌కు తెలిసినా... అవి మంచి సమాజాన్ని నిర్మించలేవు కదా! పైగా అవి విద్యార్థుల్లో విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని పెంపొందిస్తాయనుకోవడం లేదు. నేను కూడా తరగతికి హాజరు కాలేకపోయిన విద్యార్థులకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ క్లాస్ తీసుకొంటుంటా. సెలవుల్లోనూ సబ్జెక్టుల్లో వారి సందేహాలు తీర్చడానికి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తాను... అంతవరకే! బోధనకు సాంకేతికతను ఉపయోగించుకోవాలే కానీ, పూర్తిగా దాని మీదే ఆధారపడతామంటే మాత్రం విద్యావంతులను తయారవుతారేమోగానీ విజ్ఞానవంతులు మాత్రం కాలేరు.

• కేవీ

ఫొటోలు: రాజ్‌కుమార్

షార్ట్స్ అండ్ షూస్

మాన్‌సూన్ ఫ్యాషన్

వానల్లో దుస్తులు, చెప్పులు పాడవుతాయనే భయం వెంటాడుతూనే ఉంటుంది. కాబట్టి చిటిపొట్టి షార్ట్స్, జబర్దస్త్ శాండిల్స్ ఎంచుకోవాలి. ఆకట్టుకునేలా కనిపించే అలాంటి షార్ట్స్ అండ్ షూస్ మీ కోసం.





షార్ట్స్

జీన్స్, శాటిన్, కాటన్.. ఇలా నచ్చిన మెటీరియల్‌లో తయారయ్యే వేర్వేరు డిజైన్ల షార్ట్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. కార్గో, జీన్స్ షార్ట్స్ బయటకు వెళ్లేటప్పుడు వేసుకోవచ్చు. సౌకర్యవంతమైన కాటన్, సింథటిక్ షార్ట్స్ ఇంట్లో వేసుకోవచ్చు. వీటిని టీషర్ట్, క్రాప్, ట్యాంక్ టాప్స్‌తో మ్యాచ్ చేసుకోవచ్చు. రెట్టింపు ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకుంటే పాకెట్స్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. అలాగే ఫంకీ బెల్ట్ పెట్టుకోవచ్చు.



షూస్

థాంగ్ స్లైడ్స్, స్లైడ్స్, ఫ్లిప్‌ఫ్లాప్స్, రెక్సిన్ బూట్స్.. ఇలా వానాకాలానికి తగిన ఫుట్‌వేర్ చాలా ఉన్నాయి. సౌకర్యంగా ఉండడంతో పాటు, వానకు చెక్కుచెదరకుండా ఉండే ఈ చెప్పులు రకరకాల రంగుల్లో, ఫంకీ మోడల్స్‌లో తయారవుతున్నాయి. కాబట్టి వేసుకున్న షార్ట్‌కు మ్యాచ్ అయ్యే చెప్పులను ఎంచుకోవచ్చు.





పతకాల వేటలో ఐరన్ లేడీ

ఆకాంక్ష, అంకితభావం ఉంటే... లక్ష్యాన్ని చేరుకోవడానికి వయసుతో పని లేదు... ఇది రంజితా గొగోయ్ తన జీవితానుభవంతో చెప్పే మాట. దాదాపు యాభయ్యేళ్ళ వయసులో ఈత కొలనులోకి దిగిన ఆమె పట్టుదలతో సాధన చేశారు. అరవై రెండేళ్ళ వయసులోనూ వివిధ క్రీడల్లో పతకాలు గెలుస్తూ 'అసోం ఐరన్ లేడీ'గా ఖ్యాతిని సాధించారు.



"ఎంచుకున్న రంగంలో కృషి చెయ్యడమే విజయానికి మార్గం. కానీ 'ఏది, ఎందుకు ఎంచుకున్నాం?' అనే ప్రశ్నకు సమాధానాలు భిన్నంగా ఉంటాయి. నేను స్విమ్మింగ్‌ను ఎంచుకోవడం, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవడం వెనుక ఉన్నది... ఒక అవమానం. అలాగని పనిగట్టుకొని నన్ను ఎవరూ అవమానించలేదు. నాకు ఎదురైన ఒక సందర్భం... నాకే అవమానంగా అనిపించింది. దాని గురించి వివరించేముందు... నా నేపథ్యం గురించి చెప్పాలి.

ఆ సంఘటన ఆత్మన్యూనత పెంచింది...

గోలాఘాట్... అసోం రాష్ట్రంలోని ఒక చిన్న గ్రామం. నేను అక్కడే పుట్టాను. మేము అయిదుగురు తోబుట్టువులం. తోటి పిల్లలతో కలిసి ఆటపాటలతో నా బాల్యం గడిచింది. చదువుతోపాటు ఆటల్లోనూ నేను నేనే ఫస్ట్. మా కాలేజీ వాలీబాల్ జట్టుకు నేను కెప్టెన్‌ని. ఇంటర్ కాలేజీ పోటీల్లో మా టీమ్ ఎన్నో విజయాలు సాధించింది. కానీ క్రమంగా చదువుకు, కెరీర్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో క్రీడల్ని పక్కన పెట్టాల్సి వచ్చింది. బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాక... ప్రభుత్వ ఉద్యోగంలో చేరాను. కొన్నాళ్ళకు పెళ్ళయింది. నా భర్తకు ఫిలిప్పీన్స్‌లో పిహెచ్‌డి చేసే అవకాశం రావడంతో... ఉద్యోగం మానేసి ఆయన వెంట వెళ్ళాను. అక్కడ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కోర్సులో చేరాను. అక్కడ చాలామంది విత్రులయ్యారు. పార్టీలు కూడా జరిగేవి. ఒక పార్టీలో 'దంపతులు కలిసి ఈత కొట్టడం' అనే ఈవెంట్ ఏర్పాటు చేశారు. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. నా భర్త కూడా నాతోపాటు ఈత కొలనులో దిగారు. కానీ నాకు ఈత రాదు. అందరు నన్ను ఈత కొట్టాలని అరుస్తున్నారు. నేను కొలను అంచులో ఉన్న గట్టుని పట్టుకొని భయంగా నిలబడిపోయాను. అది నాకు చాలా అవమానంగా అనిపించింది. నాలో ఆత్మన్యూనతను పెంచిన సంఘటన అది. దాంతో ఎలాగైనా ఈత నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈలోగా నా భర్త పిహెచ్‌డి పూర్తి కావడంతో... మేము తిరిగి ఇండియా వచ్చేశాం. నేను మళ్ళీ ఉద్యోగంలో చేరాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. నాకు స్విమ్మింగ్ రాదనే న్యూనత మాత్రం అలాగే ఉండిపోయింది. ఎందుకంటే ఇదంతా జరిగింది 1990ల్లో. అప్పట్లో స్విమ్మింగ్ శిక్షణ సదుపాయాలు చాలా తక్కువ. మాకు అస్సలు అందుబాటులో లేవు. కాబట్టి ఆ ఆలోచన దాదాపు వదిలేసుకున్నాను. కానీ కొన్నేళ్ళ తరువాత నా కోరిక నెరవేర్చుకొనే అవకాశం వచ్చింది.

క్రౌడ్ ఫండింగ్‌తో ఆ కల నెరవేరింది...

మేము అసోంలోని జోర్హాట్ నగరంలో స్థిరపడ్డాం. 2011లో 'స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ఎస్ఎఫ్ఐ) అక్కడ ఒక ఈత కొలను ఏర్పాటు చేసి, శిక్షణ ప్రారంభించింది. అప్పటికి నాకు నలభై తొమ్మిదేళ్ళు. నేను నేర్చుకోవడానికి ఇబ్బంది పడతానని ట్రైనర్స్ అనుకున్నారు. కానీ విద్యార్థిగా ఉన్నప్పుడు క్రీడల్లో చురుగ్గా ఉండడమే కాదు... ఆ తరువాత కూడా వ్యాయామాన్ని కొనసాగించాను కాబట్టి నాకది కష్టంగా అనిపించలేదు. నా రోజువారీ కార్యక్రమాల్లో స్విమ్మింగ్ ఒక భాగమైపోయింది. కొన్ని నెలల్లోనే ప్రావీణ్యం సంపాదించాను. ఎస్ఎఫ్ఐ ప్రోత్సాహంతో... తొలిసారిగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని గెలిచాను. నా విజయపరంపర అప్పటి నుంచి మొదలయింది. అనేక అంతర్ జిల్లా పోటీల్లో బంగారు పతకాలు సాధించడంతో... నాకు మంచి గుర్తింపు వచ్చింది. నా కోచ్‌లకు నా మీద పూర్తిగా నమ్మకం కుదిరింది. బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై స్ట్రోక్ ... ఇలా భిన్నమైన అంశాల్లో నా ప్రతిభకు మెరుగుపెట్టుకున్నాను. పాల్గొన్న ప్రతి పోటీలో ఏదో ఒక పతకం అందుకుంటున్నాను. అంతర్జాతీయ స్థాయికి వస్తే.... గత ఏడాది దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో... ఒక రజతాన్ని, ఒక కాంస్యాన్ని అందుకున్నాను. ఆ పోటీల్లో పాల్గొనడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పుడు మా అబ్బాయి... క్రౌడ్ ఫండింగ్ ద్వారా నా కల నిజం చేశాడు. ఫిట్‌నెస్ కోసం రోజూ జిమ్‌కు వెళ్తాను. ఈ క్రమంలోనే ఒక అథ్లెటిక్స్ అంటే ఆసక్తి ఏర్పడింది. పవర్ లిఫ్టింగ్, ఆర్మ్ రెజ్లింగ్... ఇలా ఎన్నో సాధన చేశాను. ఈ ఏడాది 'జాతీయ ఆర్మ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్'లో రజత పతకంతోపాటు 'నేషనల్ మాస్టర్స్ గేమ్స్'లో... వివిధ అంశాల్లో స్వర్ణాలు, 'పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్స్' నిర్వహించిన స్విమ్మింగ్ ఈవెంట్స్‌లో మూడు స్వర్ణ పతకాలు అందుకున్నాను. ఇక రిలే పరుగు పందెంలో స్వర్ణం,లాంగ్ జంప్‌లో రజత, కాంస్య పతకాలు కూడా నా ఖాతాలో ఉన్నాయి. ఈ నెల 30 నుంచి గ్రీస్‌లో జరిగే 'ఇఫా వరల్డ్ ఆర్మ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్'కు సిద్ధమవుతున్నాను.




కొత్తగా ప్రయత్నించడం ఇష్టం...

ఇప్పుడు నా వయసు అరవై రెండేళ్ళు. 'ఐరన్ లేడీ ఆఫ్ అసోం'గా క్రీడా వర్గాలు, మీడియా నన్ను పిలుస్తూ ఉంటాయి. "ఇన్ని ఎలా చెయ్యగలుగుతున్నావ్? వీటన్నిటికీ సమయం ఎలా దొరుకుతోంది?" అని నా బంధుమిత్రులు అడుగుతూ ఉంటారు. ఏదైనా కొత్తగా ప్రయత్నించడం అంటే ఇష్టం. నా భర్త రిటైర్ అయ్యారు. పిల్లలు పెద్దవారయ్యారు. కాబట్టి బాధ్యతలు కొంచెం తగ్గాయి. దీంతో పూర్తిగా క్రీడల మీదనే దృష్టి పెట్టగలుగుతున్నాను. రోజూ పొద్దున్న ఆరింటికి లేస్తాను. ఒక కప్పు జ్యూస్ లేదా టీ తాగుతాను. అయిదు నుంచి ఆరు వరకూ స్విమ్మింగ్... ఆ తరువాత జిమ్‌కు వెళ్ళి ఒక గంట వర్కవుట్స్ చేస్తాను. వారంలో కొన్ని రోజులపాటు పవర్ లిఫ్టింగ్, ఆర్మ్ రెజ్లింగ్ శిక్షణ తీసుకుంటాను. ఖాళీ సమయాల్లో నా భర్తతో కలిసి గార్డెనింగ్ చెయ్యడం అంటే ఇష్టం. ఇది నా ఒత్తిళ్ళను బాగా తగ్గిస్తుంది. ఆహ్లాదంగా ఉంటుంది. ఈ రోజు వరకూ నేను ఒక్క మాత్ర కూడా వేసుకోలేదు. నన్ను నేను బిజీగా ఉంచుకోవడమే నా ఆరోగ్య రహస్యం అనుకుంటున్నాను. ఏదైనా సాధించడానికి వయసు అవరోధం కాదు. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆకాంక్ష, అంకితభావం ఉంటే చాలు. యువతకు నేను ఎప్పుడూ ఇదే చెబుతాను."

దిక్సూచి DIKSUCHI

విపత్తు నిర్వహణ చట్టం(2005)
సవరణ బిల్లు 2024

(సోమవారం దిక్సూచి తరువాయి)



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లుపై విమర్శలు

● **రాజ్యాంగ బద్ధత కొరవడింది; రాష్ట్రాల శాసనాధికార పరిధి అతిక్రమించబడింది:** విపత్తు నిర్వహణ అనే పదం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో ఎక్కడా లేదు. పైగా వ్యవసాయరంగంలో ఎదురయ్యే చీడపీడల వంటి రాష్ట్ర జాబితాలోని అంశాలు సైతం విపత్తుల జాబితాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఉమ్మడి జాబితాలోని 23వ అంశమైన 'సామాజిక భద్రత, సామాజిక బీమా, ఉపాధి, నిరుద్యోగం' అనే విషయాలకు సంబంధించిన ఎంట్రీ ఆధారంగా విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఇది నిర్బంధంగా రాష్ట్రాల శాసనాధికారాల్లోకి చొచ్చుకుని రావడమే. రాజ్యాంగ అతిక్రమణే అని విపక్షాలు వాదిస్తున్నాయి. అదేవిధంగా సామాజిక భద్రత కిందకు అన్ని విపత్తు అంశాలనూ చేర్చలేం. కాబట్టి ఈ బిల్లు అసంపూర్ణమని కూడా విపక్షాలు వాదిస్తున్నాయి.

● **అధికారాల మధ్య వ్యాప్తి, గందరగోళం:** ఈ బిల్లు అనేక అధికారాలను వివిధ స్థాయుల్లోని సంస్థలకు దత్తం చేసింది. ఇది అధికారుల విధి నిర్వహణలో గందరగోళం సృష్టించి విపత్తు సహాయక చర్యలకు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

● **విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రానికి విస్తృత అధికారాలు:** ఈ బిల్లు అనేక అంశాల దృష్ట్యా విపత్తు నిర్వహణలో కేంద్రానికి విస్తృత అధికారాలు దత్తం చేసింది. అనేక నియమాలు రూపొందించే అధికారం కేంద్రానికి కల్పించింది. ఇది రాష్ట్రాల విపత్తు నిర్వహణ చర్యలకు, ప్రణాళికలకు ప్రతిబంధకం. రాష్ట్రాల వారీగా వాటి ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా విపత్తు నిర్వహణ విధానాల, కార్యక్రమాల రూపకల్పన జరగాలి.

అయితే ఈ విమర్శలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం 2013 నాటి టాస్క్‌ఫోర్స్ నివేదికను, రెండో పరిపాలన సంస్కరణల సంఘం అభిప్రాయాన్ని ముందుకు తెస్తోంది. టాస్క్‌ఫోర్స్ నివేదికలో 1999 నాటి జె.సి.పంత్ అధ్యక్షతన నియమించిన హైపవర్ కమిటీ సూచన ఉటంకించింది. దీని ప్రకారం రాష్ట్రాల జాబితాలో కేవలం రెండు అంశాలు మాత్రమే ఎంట్రీ నంబరు 14(వ్యవసాయం, చీడపీడల నుంచి రక్షణ), ఎంట్రీ నంబరు 17(నీరు, నీటి సరఫరా, నీటిపారుదల, ఎంబార్క్‌మెంట్స్) విపత్తు నిర్వహణ కిందకు వస్తాయి. కాబట్టి దేశవ్యాప్తంగా ఒక సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక తీసుకురావడానికి భారత రాజ్యాంగ షెడ్యూల్ 7లో ఒక ఎంట్రీగా విపత్తు నిర్వహణను చేర్చాల్సి ఉందని అభిప్రాయపడింది.

అదేవిధంగా రెండో పరిపాలన సంస్కరణల సంఘం 3వ రిపోర్టు అయిన 'క్రైసిస్ మేనేజ్‌మెంట్: ఫ్రం డెస్పైర్ టు హోప్' అనే 2006 నాటి నివేదికలో కూడా విపత్తు నిర్వహణ అంశంపై చట్ట అధికారం కేంద్రానిదే అని సూచించింది. ఈ నివేదికలో, రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో గల మూడు జాబితాల్లో ఏ ఒక్క జాబితాలో కూడా 'విపత్తు నిర్వహణ' అనే అంశం పేర్కొనని కారణంగా, అది అవశిష్ట అధికారం కిందకు వస్తుంది. అవశిష్ట అధికారం మేరకు ఏ జాబితాలోనూ పేర్కొనని అంశాలపై చట్టాలు చేసే అధికారం కేవలం కేంద్రప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని ఇతిమిద్ధంగా తెలియజేసింది. కాబట్టి ఈ బిల్లు రాజ్యాంగబద్ధమే, రాష్ట్రాల శాసన అధికారాల అతిక్రమణ కాదని కేంద్రప్రభుత్వ వివరణ.

అయితే విపత్తు నిర్వహణకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా, భవిష్యత్తులో అధికార పరిధులపై వివాదాలు తలెత్తకుండా ఉండే నిమిత్తం 'విపత్తు నిర్వహణ' అంశాన్ని రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో చేర్చేందుకు సైతం రాజ్యాంగ సవరణ ఆవశ్యకత ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2ds6iZXలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్క్రీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం








ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది



బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనుకడుగే లేదు



చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా ఆయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు.. డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశార'ని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. మున్ముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పోలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

కొత్తగా..

తుపాకులతో పోలీసు బందీ



సన్నీ అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

స్పోర్ట్స్

ధనుష్‌కు మరో స్వర్ణం



న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో స్వర్ణం కొల్లగొట్టాడు. జర్మనీలోని హనోవర్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటికే రైఫిల్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచిన ధనుష్.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ పసిడి దక్కించుకున్నాడు. ఫైనల్స్‌లో మహిత్ సంధు, ధనుష్ జోడీ 17-5తో భారత్‌కే చెందిన నటాషా జోషి, మహ్మద్ ముర్తజా ద్వయాన్ని ఓడించి స్వర్ణం అందుకుంది. 10 మీటర్ల పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత జంట ప్రాంజలి ధుమాల్, అభినవ్ దేశ్వాల్ రజతం గెలిచింది.

లార్డ్స్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ వచ్చే ఏడాది జూన్ 11 నుంచి 15 వరకు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరుగుతుంది. ఆరంభ ఎడిషన్ (2021)కు సౌతాంప్టన్, రెండో ఎడిషన్ (2023)కు ఓవల్ స్టేడియాలు ఆతిథ్యమిచ్చాయి. ఈ రెండు ఫైనల్స్‌లోనూ భారత్ రన్నరప్‌గా నిలవగా.. మొదటిసారి న్యూజిలాండ్, రెండో టోర్నీలో ఆస్ట్రేలియా విజేతలుగా నిలిచిన సంగతి తెలిసిందే.

బంగ్లా.. ఊడ్చేసింది

- పాక్‌పై రెండో టెస్ట్‌లోనూ గెలుపు
- 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

రావల్పిండి: బంగ్లాదేశ్ జట్టు రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పాకిస్థాన్‌ను 2-0తో వైట్‌వాష్ చేసింది. రెండో టెస్ట్‌కు ఆఖరి, ఐదోరోజైన మంగళవారం గెలుపునకు 143 పరుగులు కావాల్సివుండగా.. బంగ్లా 6 వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకొంది. పాక్ నిర్దేశించిన 185 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 42/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 185/4 స్కోరు చేసి నెగ్గింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274, రెండో ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేయగా.. బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 262 స్కోరు చేసింది. తొలి టెస్ట్‌లోనూ బంగ్లా గెలిచిన సంగతి తెలిసిందే. విదేశీగడ్డపై సిరీస్ నెగ్గడం బంగ్లా టెస్ట్ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే. 2009లో వెస్టిండీస్‌పై తొలిసారి గెలిచింది. కాగా, గత రెండున్నరేళ్లలో సొంతగడ్డపై టెస్టుల్లో పాక్‌కు విజయమనేదే లేదు. ఆడిన 10 వరుస టెస్టుల్లో 6 ఓడగా.. 4 డ్రా అయ్యాయి. గతంలో 1969-75 మధ్య స్వదేశంలో ఆడిన వరుస 11 టెస్టుల్లో పాక్ పరాజయాలను చవిచూసింది.

దీప్తి.. పతక స్ఫూర్తి



దీప్తి (55.82 సె)

400 మీ. రేసులో తెలుగు అథ్లెట్‌కు కాంస్యం

షట్లర్ నిత్యశ్రీ కంచు మోత

పారిస్: పారాలింపిక్స్‌లో భారత అథ్లెట్లు మరో రెండు పతకాలతో మెరిశారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తెలంగాణ అథ్లెట్ దీప్తి జీవాంజితో పాటు 19 ఏళ్ల షట్లర్ నిత్యశ్రీ సివాన్ కాంస్య పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్ మూడు స్వర్ణాలు, ఐదు రజతాలు, ఎనిమిది కాంస్యాలతో 16 పతకాలతో కొనసాగుతోంది. అలాగే పట్టికలో 18వ స్థానంలో ఉంది. ఇక మంగళవారం జరిగిన మహిళల షాట్‌పుట్ ఎఫ్34 ఫైనల్లో భాగ్యశ్రీ జాదవ్ 7.28మీ. దూరం విసిరి ఐదో స్థానంలో నిలిచింది.

స్వర్ణంపై ఆశలు రేపినా..: మహిళల 400మీ. టీ20 విభాగంలో 20 ఏళ్ల తెలుగు అథ్లెట్ దీప్తి జీవాంజి గతంలో వరల్డ్ రికార్డు (55.07సె) సాధించింది. అందుకే పారాగేమ్స్‌లోనూ స్వర్ణం అందుకుంటుందనే భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగానే హీట్స్‌లో దీప్తి 55.45 సె.లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే ఆశించిన పతకం రాకపోయినా.. 55.82 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో మురిపించింది. మంగళవారం రాత్రి జరిగిన ఈ పోటీల్లో దీప్తి ఏడో లైన్ నుంచి రేసు ఆరంభించింది. ఆరంభం నెమ్మదిగానే సాగినా మధ్యలో వేగం పుంజుకుని రేసుగుర్రంలా దూసుకెళ్లింది. కానీ కొద్ది మీటర్లలో ఫినిషింగ్ లైన్ వస్తుందనగా అలసటగా కనిపించిన దీప్తి వేగం తగ్గింది. అయితేనేం.. డిఫెండింగ్ చాంపియన్ బ్రియానా క్లార్క్ (యూఎస్ఏ)ను వెనక్కినెడుతూ మూడో స్థానంతో ముగించింది. యులియా షులియర్ (ఉక్రెయిన్, 55.16సె)కు స్వర్ణం, ఏసెల్ ఒన్‌డర్ (తుర్కియే, 55.23సె) రజతం సాధించారు. ఇదిలావుండగా ట్రాక్ రన్నింగ్ ఈవెంట్‌లో భారత్‌కు గతంలో ఒక్క పతకం కూడా రాకపోయినా.. పారిస్ గేమ్స్‌లో మాత్రం ఏకంగా మూడు పతకాలు దక్కడం విశేషం. ప్రీతీ పాల్ రెండు కాంస్యాలు సాధించిన విషయం తెలిసిందే.

తొలిసారే పతకం సాధించి..: బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఎస్‌హెచ్6 విభాగంలో 19 ఏళ్ల నిత్యశ్రీ సివాన్ కాంస్య పతకం సాధించింది. ఈసారే కొత్తగా ప్రవేశపెట్టిన ఈ ఈవెంట్‌లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన తను 21-14, 21-6 తేడాతో రినా మర్లినా (ఇండోనేసియా)ను చిత్తు చేసింది. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ మ్యాచ్‌ను వరల్డ్ నెంబర్‌వన్ నిత్యశ్రీ కేవలం 23 నిమిషాల్లోనే ముగించింది. అంతకుముందు సెమీస్‌లో చైనా షట్లర్ లిన్ షుంగ్‌టో చేతిలో ఓడిన నిత్య ఈ కాంస్య పతక పోరుకు సిద్ధమైంది. మరోవైపు బ్యాడ్మింటన్‌లో భారత్‌కు లభించిన ఐదో పతకమిది. ఇప్పటికే నితేశ్‌కు స్వర్ణం, సుహాస్, తులసీమతిలకు రజతం, మనీషకు కాంస్యం దక్కాయి. అయితే టోక్యో పారాగేమ్స్‌లో షట్లర్లకు నాలుగు పతకాలే లభించడం గమనార్హం.



నిత్యశ్రీ

గురి తప్పిన అవని: మహిళల 50మీ. రైఫిల్ 3పొజిషన్ ఎస్‌హెచ్1లో స్టార్ షూటర్ అవని లేఖారాకు నిరాశే ఎదురైంది. ఫైనల్లో 420.6 పాయింట్లతో తను ఐదో స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో అవని 1159 పాయింట్లతో ఏడో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇదే విభాగంలో పాల్గొన్న మరో షూటర్ మోనా అగర్వాల్ క్వాలిఫయింగ్‌లో 13వ స్థానంలో నిలిచి ఫైనల్లో అడుగుపెట్టలేకపోయింది.

క్వార్టర్స్‌లో ఓడిన పూజ: మహిళల వ్యక్తిగత రికర్వ్ ఆర్చరీ ఓపెన్‌లో పూజ ప్రస్థానం క్వార్టర్స్‌లో ముగిసింది. చైనా ఆర్చర్ వు చున్‌యాన్ (చైనా)తో జరిగిన ఈ ఆసక్తికర పోరులో పూజ 4-6 తేడాతో ఓడింది. అంతకుముందు ప్రీక్వార్టర్స్‌లో పూజ 6-0తో యగ్ముర్ సెన్‌గుల్ (తుర్కియే)ను ఓడించి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది.

అవమానాలు దిగమింగి..

పిచ్చిది.. కోతిలా ఉంది. ఇలాంటి అమ్మాయిని ఎలా పెంచుతారు.. అనాథ శరణాలయంలో వదిలేయండి.. ఇలా ఒకప్పుడు ఆ అమ్మాయికి ఎదురైన అవమానాలు ఎన్నో! కానీ, ఇప్పుడా అమ్మాయే ఎంతో స్పెషల్. చిన్ననాటి నుంచి అవహేళనలు.. ఛీత్కారాలు ఎదురైనా తన పరుగుతో వాటిని నెట్టి పారాలింపిక్ చాంపియన్‌గా నిలిచింది జీవాంజి దీప్తి. తనను అవమానించిన చోటే ప్రశంసలు అందుకుంటూ ఇవాళ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి గర్వకారణంగా నిలవడంతో.. దీప్తి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. వరంగల్ జిల్లా, కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి మానసిక వైకల్యంతో జన్మించింది. తండ్రి యాదగిరి, తల్లి ధనలక్ష్మి వ్యవసాయ కూలీలు. పేద కుటుంబంలో పుట్టెడు కష్టాల మధ్య ఎన్నో అవమానాలను దిగమింగుకొంటూ దీప్తి పెరిగింది. అయితే, స్కూల్లో పీఈటీ వెంకటేశ్వర్లు ఆమెలోని అథ్లెట్‌ను గుర్తించాడు. దీప్తి ఎంత శ్రమించినా అలసిపోని తత్వం, పరుగుతీసే విధానం ఆకట్టుకోవడంతో తగు విధంగా శిక్షణ ఇచ్చాడు. ఈ క్రమంలో 2019లో కోచ్ నాగపురి రమేష్ దృష్టిలో పడడంతో ఆమె ఇక వెనుదిరిగి చూసుకోలేదు. హైదరాబాద్‌లో శిక్షణ తీసుకొంటున్న సమయంలో దీప్తిని గమనించిన బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ ఐక్యూ టెస్ట్ చేయించాడు. ఆమెకు గ్రహణ శక్తి తక్కువనీ, ఏవిషయాన్నయినా వేగంగా అర్థం చేసుకోలేదని డాక్టర్లు సర్టిఫై చేశారు. దీంతో దీప్తికి టీ20 కేటగిరీలో పారా అథ్లెట్‌గా బరిలోకి దిగే అవకాశం దక్కింది. ట్రాక్‌పై దుమ్మురేపిన దీప్తి 2022 ఆసియా పారా క్రీడల్లో 400 మీ. రేస్‌లో స్వర్ణం కొల్లగొట్టింది. ఈ ఏడాది మేలో వరల్డ్ పారా చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల రేస్‌లో ప్రపంచ రికార్డుతో విజేతగా నిలిచి ఔరా అనిపించింది. ఇప్పుడు పారాలింపిక్ పతకంతో మరో మెట్టు పైకెదిగింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

స్వియటెక్ సులువుగా..

- క్వార్టర్స్‌కు ఇగా, సినర్
- మెద్వెదెవ్, అలెక్స్ కూడా

యూఎస్ ఓపెన్



స్వియటెక్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో టాప్‌సీడ్లు జోరుమీదున్నారు. టాప్‌సీడ్లు జానెక్ సినర్, ఇగా స్వియటెక్ క్వార్టర్‌ఫైనల్స్‌లో అడుగుపెట్టారు. జొకోవిచ్, అల్కారజ్ నిష్క్రమణతో టైటిల్‌పై అంచనాలున్న వరల్డ్ నెంబర్‌వన్ సినర్ ప్రీక్వార్టర్స్ దాటేందుకు తీవ్రంగా చెమటోడ్చాడు. 14వ సీడ్ టామీ పాల్‌తో జరిగిన పోరులో తొలిరెండు సెట్లను టైబ్రేకర్‌లో గెలుచుకున్న సినర్ చివరకు 7-6 (7/3), 7-6 (7/5), 6-1తో గట్టెక్కి ఊపిరి పీల్చుకున్నాడు. సెమీస్ బెర్త్ కోసం మాజీ విజేత డానిల్ మెద్వెదెవ్‌తో సినర్ అమీతుమీ తేల్చుకుంటాడు. 5వ సీడ్ మెద్వెదెవ్ 6-0, 6-1, 6-3తో నూనో బోర్జస్‌ను చిత్తుచేశాడు. మరో మ్యాచ్‌లో 10వ సీడ్ అలెక్స్ డి మినార్ 6-0, 3-6, 6-3, 7-5తో జోర్డాన్ థాంప్సన్‌పై గెలిచాడు. ఇక, ఆరో గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న నెంబర్‌వన్ క్రీడాకారిణి స్వియటెక్ 6-4, 6-1తో 16వ సీడ్ లూడ్మిలా సామ్‌సనోవాను సులువుగా ఓడించి 6వ సీడ్ జెస్సికా పెగులాతో క్వార్టర్స్ పోరుకు సిద్ధమైంది. మరో ప్రీక్వార్టర్స్‌లో 22వ సీడ్ బెర్బెజ్ హద్దాద్ మియా 6-2, 3-6, 6-3తో వెటరన్ స్టార్ వోజ్నియాకిపై గెలిచింది.

మిక్స్‌డ్ సెమీస్‌కు బోపన్న: పురుషుల డబుల్స్‌లో నిష్క్రమించిన రోహన్ బోపన్న, మిక్స్‌డ్‌లో సెమీఫైనల్‌కు చేరాడు. 8వ సీడ్ బోపన్న-సుజియాది (ఇండోనేసియా) ద్వయం 7-6(4), 2-6, 10-7తో 4వ సీడ్ మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)-క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) జోడీని ఓడించింది. సెమీస్‌లో అమెరికా జంట డొనాల్డ్ యంగ్-టేలర్ టౌన్‌సెండ్‌తో బోపన్న జోడీ తలపడనుంది.

గోల్ లేకుండానే..

0-0తో డ్రాగా ముగిసిన భారత్-మారిషస్ పోరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇంటర్ కాంటినెంటల్ కప్‌లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ జట్టు తొలి మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయింది. మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో పసికూన మారిషస్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌ను బ్లూ టైగర్స్ 0-0తో డ్రాగా ముగించి, నిరాశపర్చింది. 124వ ర్యాంకర్ భారత్ తమకంటే తక్కువ ర్యాంకర్ మారిషస్‌పై (174) ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. భారత జట్టు బంతిని ఎక్కువ సేపు తమ నియంత్రణలోనే ఉంచుకోవడంతో పాటు గోల్ చేయడానికి అనేక అవకాశలొచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇక, శుక్రవారం జరిగే రెండో మ్యాచ్‌లో సిరియా-మారిషస్, 9వ తేదీన జరిగే ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో భారత్-సిరియా తలపడనున్నాయి.

క్రీడా రాజధానిగా హైదరాబాద్



● కాంటినెంటల్ సాకర్ కప్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రెండు దశాబ్దాల తర్వాత హైదరాబాద్ వేదికగా జరిగిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు భాగ్యనగర సాకర్ అభిమానులు పోటెత్తారు. మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అంతర్జాతీయ ఫుట్‌బాల్ స్టేడియంలో ఆరంభమైన ఇంటర్ కాంటినెంటల్ సాకర్ కప్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ కప్ నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఫుట్‌బాల్‌తో పాటు భవిష్యత్‌లో ఇతర క్రీడలకు సంబంధించిన మరిన్ని అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌ను దేశ క్రీడా రాజధానిగా తయారు చేస్తామని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్మాణాత్మకంగా, ప్రణాళికబద్ధంగా పనిచేస్తోందని తెలిపారు.

బిజినెస్

జొన్నగిరిలో డీజీఎంఎల్ 'పసిడి' వేట

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ త్వరలో భారత పసిడి ఉత్పత్తి మ్యాప్‌లో చేరనుంది. రాష్ట్రంలోని కర్నూలు జిల్లా జొన్నగిరి గనుల నుంచి త్వరలో బంగారం నిక్షేపాల వెలికితీత ప్రారంభం కానుంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఈ గనుల నుంచి పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి ప్రారంభిస్తామని దక్కన్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్) తన తాజా వార్షిక నివేదికలో తెలిపింది. ఈ గనుల్లో పసిడితో కూడిన సిల్వనైట్, కల్వరైట్ ఖనిజ నిక్షేపాలు దాదాపు 65 లక్షల టన్నుల మేరకు ఉన్నట్టు అంచనా. ఈ ఖనిజాలను వెలికి తీయడం ద్వారా జొన్నగిరి గనుల నుంచి ఏటా 750 కిలోల వరకు పసిడి ఉత్పత్తి చేయవచ్చని డీజీఎంఎల్ భావిస్తోంది. జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ (జీఎంఎస్ఐ) అనే కంపెనీతో కలిసి డీజీఎంఎల్ ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఈ ప్రాజెక్టు ఈక్విటీలో డీజీఎంఎల్‌కు 40 శాతం, జీఎంఎస్ఐకి 60 శాతం వాటా ఉంది.

ఈ ఏడాది భారత వృద్ధి 7 శాతం

అంచనాను పెంచిన ప్రపంచ బ్యాంక్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత దేశ వృద్ధి రేటును ప్రపంచబ్యాంక్ పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7 శాతం వృద్ధిని సాధిస్తుందని తాజాగా అంచనా ప్రకటించింది. గత జూన్‌లో ప్రకటించిన అంచనా 6.6 శాతం కన్నా ఇది అధికం. వ్యవసాయ రంగం రికవరీ సాధించడంతో పాటు గ్రామీణ డిమాండు జోరందుకోవడం అంచనా పెంచేందుకు దారి తీసిన అంశాలని తాజా నివేదికలో తెలిపింది. ప్రపంచ బ్యాంక్ తాజా అంచనా ఐఎంఎఫ్, ఏడీబీ అంచనాలకు దీటుగా ఉంది. రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ఉండటం, ప్రైవేటు వినియోగం, ఎగుమతుల్లో వృద్ధి ఆధారంగా తాము అంచనాను ఎగువకు సవరించామని ప్రపంచబ్యాంక్ సీనియర్ ఆర్థికవేత్త రాన్ లీ చెప్పారు. ప్రపంచ దేశాల నుంచి పలు సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత మధ్యకాలిక దృక్పథం పాజిటివ్‌గానే ఉన్నదని తాజా నివేదికలో తెలిపారు. ఆదాయాల వృద్ధి బలంగా ఉండడంతో పాటు జీడీపీలో రుణాల నిష్పత్తి 2024 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 83.9 శాతం నుంచి 2027 ఆర్థిక సంవత్సరంలో 82 శాతానికి తగ్గుతుందని అంచనాగా ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరం వరకు కరెంట్ ఖాతా లోటు 1-1.6 శాతం మధ్యన ఉంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం తగ్గి దుర్భర దారిద్ర్యం తగ్గడానికి దోహదపడుతుందని పేర్కొంది. 2030 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని సాధించాలంటే భారత్ తన ఎగుమతి వస్తువుల జాబితాలో మరిన్ని వస్తువులను చేర్చాల్సి ఉంటుందని ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్ (ఐడీయూ) తెలిపింది.

మార్కెట్లోకి జావా 42 ఎఫ్‌జే బైక్

ధర రూ.1.99 లక్షలు



న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ యాజమాన్యంలోని క్లాసిక్ లెజెండ్స్ మంగళవారం జావా 42 ఎఫ్‌జె మోటార్ సైకిల్‌ను మార్కెట్లోకి తెచ్చింది. దీని ధర రూ.1.99 లక్షలు. జావా వంటి బ్రాండ్లను పునరుజ్జీవింపచేయడంలో ఎలాంటి సవాలునైనా ఎదుర్కొంటామని ఈ బైక్‌ను విడుదల చేసిన సందర్భంగా మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. ఈ బ్రాండ్లు మనకి ఎన్నో కథలు చెబుతాయంటూ ఒకప్పుడు ఎంతో ఆదరణ పొందిన ఇలాంటి బ్రాండ్లు ఎలాంటి ఉత్సుకత రేపుతాయో చూసేందుకు మనందరం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తూ ఉంటామని చెప్పారు. 42 లైఫ్ సీరీస్‌కు చెందిన జావా డిజైన్, ధర, పనితీరు అన్నింటిలోనూ చక్కని సమతూకాన్ని తెస్తుందని గ్రూప్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ తెలిపారు. ప్రీమియం మోటార్ సైకిల్ విభాగంలో తాము ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్నామని, అగ్రస్థానం సాధించడం తమ లక్ష్యమని చెప్పారు.

ఎఫ్‌డీఐ పెట్టుబడులు రూ.1.36 లక్షల కోట్లు

క్యూ1లో 48 శాతం వృద్ధి.. మూడో స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు బాగానే కలిసొచ్చింది. ఈ కాలంలో మన దేశానికి 1,617 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.36 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐ పెట్టుబడులు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన 1,094 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది 47.8 శాతం ఎక్కువ. ఈక్విటీకి తోడు లాభాలను తిరిగి పెట్టుబడి పెట్టడం, ఇతర పెట్టుబడులను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో 2,249 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐ నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 28 శాతం ఎక్కువ. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన 1,617 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలో 848 కోట్ల డాలర్ల (రూ.71,230 కోట్లు) ఎఫ్‌డీఐతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉండగా, 228 కోట్ల డాలర్ల (రూ.19,150 కోట్లు)తో కర్ణాటక రెండో స్థానంలో, 108 కోట్ల డాలర్ల (రూ.9,070 కోట్లు) ఎఫ్‌డీఐతో తెలంగాణ మూడో స్థానంలో నిలిచాయి. పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా చెప్పుకునే గుజరాత్ 102 కోట్ల డాలర్ల (రూ.8,560 కోట్లు) ఎఫ్‌డీఐతో నాలుగో స్థానానికి పడిపోవడం విశేషం.

ఈ రంగాల్లోనే ఎక్కువ: విదేశీ సంస్థల సేవలు, కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, టెలికాం, ఫార్మా, కెమికల్స్ రంగాల్లో ఎక్కువగా పెట్టుబడి పెడుతున్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మన దేశానికి వచ్చిన ఎఫ్‌డీఐలో ఎక్కువ భాగం మారిషస్, సింగపూర్, అమెరికా, నెదర్లాండ్, యూఏఈ, కేమన్ ఐలాండ్స్, సైప్రస్ దేశాల నుంచి వచ్చింది. ఇదే సమయంలో యూకే, జపాన్, జర్మనీ దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డీఐ తగ్గిపోయింది.

బీఓఐ 'స్టార్ ధన వృద్ధి ఎఫ్‌డీ' పథకం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 'స్టార్ ధన వృద్ధి' పేరుతో కొత్త ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకం ప్రారంభించింది. 333 రోజుల గడువు ఉండే ఈ ఎఫ్‌డీపై 80 సంవత్సరాలు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లకు బ్యాంక్ 7.9 శాతం వార్షిక వడ్డీ రేటు చెల్లిస్తుంది. ఇదే ఎఫ్‌డీపై 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, ఇతరులకు 7.25 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఈ ఎఫ్‌డీ పథకం హామీపై రుణాలు, గడువు కంటే ముందుగానే వెనక్కి తీసుకునే సౌలభ్యం ఉందని బీఓఐ తెలిపింది.

వరద బాధితులకు ఉపశమన చర్యలు

ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వరద బాధిత ఖాతాదారుల కోసం ఎయిర్‌టెల్ పలు ఉపశమన చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా పోస్ట్ పెయిడ్ హోమ్ ఖాతాదారుల బిల్ పేమెంట్ గడువుని వారం రోజుల పాటు పొడిగించింది. ఈ వారం రోజులు, ఈ ఖాతాదారుల ఇళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వైఫై సేవలు అందుతాయి. అలాగే రీచార్జి గడువు ముగిసిన ప్రీపెయిడ్ హోమ్స్ ఖాతాదారుల వ్యాలిడిటీ గడువుని నాలుగు రోజుల పాటు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నాలుగు రోజులు వారి ఇళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వైఫై సేవ అందుతాయి. బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులతో పాటు ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ మొబైల్ వినియోగదారుల రీచార్జి, వ్యాలిడిటీ గడువునీ నాలుగు, ఏడు రోజుల పాటు పెంచినట్టు ఎయిర్‌టెల్ తెలిపింది.

రికార్డుల ర్యాలీకి విరామం



మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: వరుసగా పది రోజులు పరుగు తీసిన సెన్సెక్స్ మంగళవారం కాస్త విరామం తీసుకుంది. ఇంట్రాడేలో 159 పాయింట్ల వరకు క్షీణించిన సూచీ.. చివరికి 4.40 పాయింట్ల నష్టంతో 82,555.44 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో మదుపరులు ఐటీ, మెటల్, ఆయిల్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. కాగా, నిఫ్టీ వరుసగా 14వ రోజూ పాజిటివ్‌గా ముగిసింది. 1.15 పాయింట్ల పెరుగుదలతో 25,279.85 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.54 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో యుటిలిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, టెక్ అర శాతానికి పైగా నష్టపోయాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు తగ్గి రూ.83.96 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 3.75 శాతం తగ్గి 74.62 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ప్రీమియర్ ఎనర్జీస్ బంపర్ లిస్టింగ్

తొలిరోజే 87% ఎగబాకిన షేరు

హైదరాబాద్‌కు చెందిన సోలార్ సెల్, మాడ్యూల్స్ తయారీ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ లిస్టింగ్‌కు మార్కెట్ వర్గాల నుంచి అపూర్వ స్పందన లభించింది. గత వారంలో ఐపీఓ పూర్తి చేసుకున్న ఈ కంపెనీ.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.450తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 120.22 శాతం ప్రీమియంతో రూ.991 వద్ద లిస్టయింది. ఆ తర్వాత 120.76 శాతం వృద్ధిని కనబర్చింది. తర్వాత మళ్లీ తగ్గుతూ వచ్చింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి ప్రీమియర్ ఎనర్జీస్ షేరు 86.58 శాతం లాభంతో రూ.839.65 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.37,849.27 కోట్లుగా నమోదైంది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 50.30 లక్షల షేర్లు చేతులు మారాయి. కాగా, గత గురువారంతో ముగిసిన ప్రీమియర్ ఎనర్జీస్ ఐపీఓకు సైతం ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు ఏకంగా 74.09 రెట్ల బిడ్లు లభించాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ రూ.2,830 కోట్లు సమీకరించింది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.66-70

ఈ నెల 9న ఇష్యూ ప్రారంభం

బజాజ్ ఫైనాన్స్ అనుబంధ విభాగమైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.66-77గా నిర్ణయించింది. బజాజ్ గ్రూప్‌నకు చెందిన ఈ సంస్థ ఐపీఓ ద్వారా రూ.6,560 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది. అందులో తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.3,560 కోట్లు, మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్ వాటాకు చెందిన రూ.3,000 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. కాగా, వాహన విడిభాగాల తయారీదారు క్రాస్ లిమిటెడ్‌తో పాటు టోలిన్స్ టైర్స్ లిమిటెడ్ ఐపీఓలు సైతం ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనున్నాయి. ఐపీఓ ద్వారా క్రాస్ లిమిటెడ్ రూ.500 కోట్లు, టోలిన్స్ టైర్స్ రూ.230 కోట్ల వరకు సమీకరించాలనుకుంటున్నాయి. ఈ రెండు కంపెనీలు తమ ఇష్యూ ధరల శ్రేణిని ఇంకా ప్రకటించాల్సి ఉంది.

జీఐసీలో 6.78 శాతం వాటా విక్రయం

ప్రభుత్వ రంగ బీమా సంస్థ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ ఆర్ఈ)లో కేంద్ర ప్రభుత్వం 6.78 శాతం వాటాకు సమానమైన 11.90 కోట్ల షేర్లను బుధవారం విక్రయించనుంది. షేరు కనీస ధరను రూ.395గా నిర్ణయించింది. తద్వారా కేంద్రానికి రూ.4,700 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. బీఎస్ఈలో జీఐసీ షేరు ధర మంగళవారం 0.13 శాతం తగ్గి రూ.421.25 వద్ద ముగిసింది. ఈ లెక్కన, కేంద్రం కంపెనీ షేరును 6.23 శాతం తక్కువకు విక్రయించనుంది. ప్రస్తుతం జీఐసీలో కేంద్ర ప్రభుత్వం 85.78 శాతం వాటా కలిగి ఉంది.

- వైర్‌లెస్ ఆడియో సొల్యూషన్స్ సంస్థ మివీ.. మార్కెట్లోకి సరికొత్త ట్రూ వైర్‌లెస్ స్టీరియో (టీడబ్ల్యూఎస్) ఇయర్‌బడ్స్ ఒపేరా విడుదల చేసింది. దీని ధర రూ.2,199 మూడోతరం సూపర్‌పాడ్స్ సిరీస్‌లో భాగంగా వీటిని తీసుకువచ్చింది. జపాన్ ఆడియో సొసైటీ ద్వారా హై-రెస్ వైర్‌లెస్ ఆడియో సర్టిఫికేషన్ పొందిన తొలి ఇండియన్ బ్రాండ్ ఇదని మివీ తెలిపింది. ఫ్లిప్‌కార్ట్, మివీ వెబ్‌సైట్‌తో పాటు ఎంపిక చేసిన ఆఫ్‌లైన్ స్టోర్లలో ఇది అందుబాటులో ఉండనుంది.
- మారుతి సుజుకీ ఎరీనా భారత్‌లో అతిపెద్ద రిటైల్ నెట్‌వర్క్‌గా అవతరించిందని మారుతి సుజుకీ ఇండియా ప్రకటించింది. 2017లో కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 82 లక్షలకు పైగా వినియోగదారులకు పైగా సేవలందిస్తోందని తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2,596 నగరాల్లో మొత్తం 3,069 ఔట్‌లెట్స్‌ను ఎరీనా నిర్వహిస్తోంది.
- ఫ్లిక్స్‌బస్ దక్షిణాదికి తన కార్యకలాపాలను విస్తరించింది. బెంగళూరు- చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, విజయవాడ- తిరుపతి సహా మొత్తం 6 మార్గాల్లో సర్వీసులు ప్రారంభించనుంది. ఈ నెల 10 నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,720 ▼	66,640 ▼	90,900 ▼
ముంబై	71,494 ▼	65,489 ▼	82,278 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ

హైదరాబాద్	470	విజయవాడ	505
వరంగల్	472	గోదావరి	500
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	92
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

రాష్ట్రంలో1.53 లక్షల ఎకరాల్లో పంట నష్టం

» 4 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం: తుమ్మల



ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా 1,53,278 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నష్టం 4 లక్షల ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉదని అధికారులు అంచనా వేస్తున్నారని, అయితే పూర్తి వివరాల కోసం ఆయా జిల్లాల్లో సర్వే చేపట్టాలని ఆదేశించామన్నారు. ఖమ్మంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పంట నష్టం సర్వే మంగళవారం నుంచే ప్రారంభించామన్నారు. మూడురోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. రాష్ట్రంలో వానాకాలంలో 1,18,23,166 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారని, ఇంకా మిర్చి, కంది, వంటి పంటలు వేయాల్సి ఉందన్నారు. దురదృష్టవశాత్తు గత వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా మున్నేరు పరివాహకంలో ఇటీవల 42 నుంచి 46సెంమీ. వర్షపాతం నమోదు కావడంతో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీగా పంట నష్టం జరిగిందని తెలిపారు. మున్నేరు ప్రవాహంతో పాటు వరదతో ఖమ్మం జిల్లాలో 68,345, సూర్యాపేట జిల్లాలో 34,149, మహబూబాబాద్ జిల్లాలో 25,275, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2వేల ఎకరాలు, నారాయణపేట జిల్లాలో 6వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వివరించారు. మూడురోజులుగా పంటలు నీట మునగడంతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వరద ప్రాంతాల్లో పంటలు కోల్పోయిన రైతులకు కొత్తపంట వేసుకునేందుకు వీలుగా విత్తనాలు, ఎరువులు సత్వరం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పంట నష్టంపై ప్రభుత్వ నివేదికలు రాగానే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.10వేలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఖమ్మం నగరంలో జరిగిన గొడవలో తన ప్రమేయం ఉందని బీఆర్ఎస్ మాజీ మంత్రులు విమర్శించడం తగదని మంత్రి తుమ్మల అన్నారు. దాడులు చేయించే సంస్కృతి తన రాజకీయ చరిత్రలోనే లేదని చెప్పారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ: పొంగులేటి



ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలు, సహాయక చర్యలపై పాలేరు నుంచే జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్తుల నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడి వరద ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంట నష్టం, ఆస్తి నష్టం వివరాలను పక్కాగా నమోదు చేయాలని, పూర్తి వివరాలను జిల్లాల నుంచి తెప్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కేంద్రాలకు 11300 మందిని తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల 3039 మంది ప్రాణాలు కాపాడామని, ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి కొత్తగా మంజూరు చేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించామని వెల్లడించారు.

నష్టం వివరాలను వారంలో ఇవ్వండి: సీఎస్

రాష్ట్రంలో కురుస్తోన్న భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన ప్రాణ, ఆస్తి నష్టంపై పూర్తి వివరాలను వారం రోజుల్లోగా అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఈమేరకు ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, విభాగాధిపతుల(హెచ్ఓడీ)తో సచివాలయంలో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికీ పలు జిల్లాల్లో వానలు, వరదలు తగ్గుముఖం పట్టలేదని సీఎస్ అన్నారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్రస్థాయికి పంపించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థల ఏర్పాటుకు అవసరమైన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలను జిల్లా కలెక్టర్లు వెంటనే సమర్పించాలని తెలిపారు.



ఖమ్మంలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు

ఖమ్మంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ

ఖమ్మం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి)/ఖమ్మం క్రైం: ఖమ్మంలో మున్నేరు వరద బాధితుల పరామర్శలో రాజకీయ వివాదం రాజుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి పలువురు స్వల్పంగా గాయపడ్డారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, జగదీశ్ రెడ్డి కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. సీఎం రేవంత్ మంగళవారం జిల్లాలో పర్యటన ముగించుకుని వెళ్లగానే బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేక్‌గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు వరద బాధితుల పరామర్శకు ఖమ్మం చేరుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్పలో వరద బాధితులను పరామర్శించారు. అనంతరం నగరంలోని బొక్కలగడ్డ, మంచికంటి నగర్ వరద బాధితులను పరామర్శించి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తున్నా బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు స్పందిస్తూ వరద బాధితులకు సహాయం అందడం లేదని ఆరోపించారు. దాంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగంది. ఈ క్రమంలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ కార్లపై రాళ్లు విసిరారు. రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. సంతోష్ రెడ్డి అనే బీఆర్ఎస్ కార్యకర్తకు గాయాలయ్యాయి. కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు మాజీ మంత్రులు ఉన్న కార్లకు రాళ్లు తగలగకుండా వాటిని పక్కకు పంపిస్తుండగా కారు కింద పడి ఓ కార్యకర్త కాలు విరిగింది. ఇరు వర్గాల తోపులాటలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు మాజీ మంత్రుల కార్లను అక్కడి నుంచి పంపించారు. ఇరు వర్గాలను వారించడంతో గొడవ సద్దుమణిగింది. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారంటూ ఈ ఘటనపై ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

గిరిజనులను కాపాడ్డానికి హెలికాప్టర్ ఉండదా?

» బాధితులను కాపాడటంలో సర్కారు అలసత్వం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట ప్రాంతంలో ఓ కెనాల్‌లో మూడురోజుల పాటు చిక్కుకుపోయిన 10మంది గిరిజనులను రక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎటువంటి ప్రయత్నం చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వారిని కాపాడ్డానికి హెలికాప్టర్ ఉండదా? అని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు అలసత్వం వహించినప్పటికీ కెనాల్‌లో చిక్కుకున్న వారిని పోలీసులు కాపాడటం అభినందనీయమన్నారు. తెలంగాణలో వరద బాధితులను రక్షించేందుకు హెలికాప్టర్ల అవసరంలేదని ప్రభుత్వం చెప్పడం తగదని, మీ నాయకుల పుట్టిన రోజులకు, మీ ఎమ్మెల్యేలు ప్రయాణించేందుకు హెలికాప్టర్లుంటాయి.. పేద గిరిజనులను రక్షించేందుకు మాత్రం ఎందుకు ఉండవు అంటారా? అని ఆయన ప్రశ్నించారు.

హమ్మయ్య.. వాళ్లను రక్షించారు

» చేపల వేటకు వెళ్లి డిండి వాగులో చిక్కుకున్న చెంచులు సురక్షితం

» ఆరు నెలల పసికందు సహా 10 మందిని కాపాడిన సహాయక బృందాలు





చెంచు కుటుంబంతో ఎమ్మెల్యేలు, పోలీసు అధికారులు, (ఇన్‌సెట్లో) చెంచులను పుట్టి సహాయంతో బయటకు తీసుకొస్తున్న దృశ్యం

డిండి / అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 3: చేపల వేటకు వెళ్లి నాలుగు రోజులుగా డిండి వాగులో చిక్కుకున్న చెంచులు ప్రాణాలతో బయటపడ్డారు. ఆరు నెలల పసికందు సహా పది మందిని సహాయక బృందాలు మంగళవారం సురక్షితంగా తీసుకొచ్చాయి. నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లికి చెందిన జల్లా గురువయ్య, అతని కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం సిద్ధాపూర్ శివారులోని డిండి వాగు మధ్యలో దెయ్యం గుండ్ల బండపై తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకొని చేపలు వేటాడుతుంటారు. ఆరు నెలల పసికందు సహా మొత్తం పది మంది నాలుగు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లగా వరదలో చిక్కుకుపోయారు. ఎగువన కురిసిన వర్షాలకు డిండి రిజర్వాయర్ నుంచి దిగువకు నీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో గురువయ్య కుటుంబం ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసాన్ని ఈ నెల 1న వరద చుట్టుముట్టింది. సోమవారం తెల్లవారేసరికి ఆ కుటుంబం ఎటూ కదల్లేని పరిస్థితి ఏర్పడింది. సోమవారం సాయంత్రం ఈ విషయం తెలుసుకున్న పోలీసులు.. గురువయ్య కుటుంబాన్ని రక్షించేందుకు వెళ్లారు. కానీ, వరద ఉధృతంగా ఉండటం, చీకటి పడడంతో కాపాడలేకపోయాయి. అయితే, నల్లగొండ, నాగర్‌కర్నూలు జిల్లాల రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో అచ్చంపేట అగ్నిమాపక శాఖ బృందం మంగళవారం ఉదయం మరోమారు సహాయక చర్యలు చేపట్టింది. తాళ్ల సాయంతో మగవారిని, పుట్టిల్లో ఆరు నెలల పసికందు, ఇద్దరు మహిళలను సురక్షితంగా బయటికి తెచ్చింది. అనంతరం ఆ చెంచులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శాంతించిన కృష్ణమ్మ

ఆల్మట్టి జలాశయం గేట్లు మూసివేత



వరి పాడైపోయిందంటూ రోదిస్తున్న సీతారాంపురం తండాకు చెందిన మహిళారైతు

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉగ్రరూపం చూపిన కృష్ణమ్మ శాంతిస్తోంది. రెండు రోజుల పాటు ఉధృతంగా ప్రవహించి మంగళవారం ఉధృతి తగ్గించింది. దీంతో మంగళవారం ఆలమట్టి జలాశయం గేట్లను మూసివేశారు. ఇన్‌ఫ్లో 60 వేల క్యూసెక్కులు ఉండగా విద్యుదుత్పత్తి ద్వారా 28 వేల క్యూసెక్కులను నారాయణపూర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. 20 వేల క్యూసెక్కుల నీరు చేరుతున్న నారాయణపూర్ నుంచి 8,296 క్యూసెక్కులను జూరాలకు వదులుతున్నారు. జూరాలకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 27 గేట్ల ద్వారా 2.07 లక్షల క్యూసెక్కులను విడుస్తున్నారు. శ్రీశైలానికి 4.77 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 గేట్ల ద్వారా 3.56 లక్షల క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 3,37,687 క్యూసెక్కులు వస్తుండగా.. 26 గేట్ల నుంచి 3.16 లక్షల క్యూసెక్కులను దిగువకు పంపుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గుముఖం పడుతోంది. మంగళవారం రాత్రి 10 గంటలకు 6,61,335 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. మొత్తం 70 గేట్లను పూర్తిస్థాయికి ఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, గేటు మరమ్మతు అనంతరం తుంగభద్ర జలాశయం మళ్లీ నిండనుంది. బుధవారం పూర్తి నీటి మట్టానికి చేరనుంది. 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 15,441 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు.

- శ్రీరాంసాగర్‌కు వరద కొనసాగుతోంది. మంగళవారం 2.45 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. రెండో రోజూ 41 గేట్లను ఎత్తి ఉంచారు. 2.83 లక్షల క్యూసెక్కులను కిందకు వదిలారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 34,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

శుభకార్యానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

ఆళ్లపల్లి, టేకులపల్లి, నెక్కొండ: భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం కిన్నెరసాని వాగులో గల్లంతైన బావాబామ్మర్దులు కోరం వెంకటేశ్వర్లు (29), దొడ్డా సాయికుమార్ (23)ల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. వీరు టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన వారు. ఆదివారం సాయికుమార్ మేనల్లుడి పుట్టువెంట్రుకల వేడుకకు గుండాల మండలం వేపలగడ్డ గ్రామంలోని సమ్మక్క గద్దెల వద్దకు బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ కిన్నెరసాని వాగులో పడిపోయారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారు వాగులో గల్లంతైనట్లు గుర్తించారు. లక్ష్మీదేవిపల్లి మండలం చింతకుంట సమీపంలో మృతదేహాలను గుర్తించారు. కాగా, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన రైతు షేక్ అజ్మత్ మంగళవారం పొలంనుంచి తిరిగొస్తుండగా పట్టివాగులో గల్లంతయ్యాడు.

నేడు 4 జిల్లాల్లో భారీ వర్షాలు

» రేపు, ఎల్లుండి తేలికపాటి వానలు

» మెదక్ జిల్లా శంకరంపేటలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షపాతం



హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్నిచోట్ల కురుస్తాయని తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పది మండలాల్లో 6-10 సెంటీమీటర్ల మధ్య, 103 మండలాల్లో 1.5-6 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. సెప్టెంబరు 3 నాటికి 148 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 293 మండలాల్లో అధిక వర్షపాతం రికార్డు అయినట్లు వెల్లడించింది. 170 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఒక్క మండలంలో ఇప్పటికీ లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. మెదక్ జిల్లా శంకరంపేటలో అత్యధికంగా 8.8 సెంటీమీటర్ల వర్షపాతం, అదే జిల్లా కుల్చారంలో 8.7, సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో 8.6, మెదక్ జిల్లా టేక్మల్‌లో 8.1, పాపన్నపేటలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు పేర్కొంది. మరోవైపు సెప్టెంబరు నెలవారీ వర్షపాత అంచనాను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ నెలలో రాష్ట్రంలోని పశ్చిమ, తూర్పు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా, మిగతా జిల్లాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

నేటి సాయంత్రం నుంచి రైళ్ల రాకపోకలకు పచ్చ జెండా..?



మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె సమీపంలో రైల్వేట్రాక్ వేలాడిన ప్రాంతంలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): మహబూబాబాద్ జిల్లాలో ఆరు చోట్ల ధ్వంసమైన రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ఒక్కో ప్రాంతంలో 100 మంది చొప్పున సుమారు 600 మంది కూలీలు పనులు చేస్తున్నారు. సుమారు 200 మంది అధికారులు, సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి సికింద్రాబాద్-విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు. ఆదివారం వరద ఉధృతికి ఇంటికన్నె-కేసముద్రం సెక్షన్‌లో రెండు చోట్ల 70 మీటర్ల చొప్పున ట్రాక్ కొట్టుకుపోయింది. మహబూబాబాద్-కేసముద్రం సెక్షన్‌లో నాలుగు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. మొత్తం 420 మీటర్ల ట్రాక్ కొట్టుకుపోయింది. మహబూబాబాద్- కేసముద్రంమధ్య పునరుద్ధరణ పనులను పూర్తి చేసి గూడ్స్ రైలుతో ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే, ఇంటికన్నె-కేసముద్రం సెక్షన్‌లో వరద ఉధృతి తగ్గకపోవడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

పంప్‌హౌస్‌ల నిర్వహణ గాలికి..!

» ఉన్నతాధికారుల తనిఖీల్లో వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంప్‌హౌస్‌ల నిర్వహణను గాలికొదిలేశారా? మోటార్లు పాడైనా.. మోటార్ల డిఫెక్ట్ లయబిలిటీ సమయం పూర్తయ్యేలోపు యంత్రాంగం మేల్కొని, సరి చేయించడంలో నిర్లక్ష్యం వహించిందా? ఈ ప్రశ్నలకు ఉన్నతాధికారుల తనిఖీల్లో అవుననే సమాధానం వచ్చింది. రెండ్రోజుల క్రితం కాళేశ్వరం ఆన్‌లైన్ రిజర్వాయర్ల వద్ద పంప్‌హౌస్‌ల పరిస్థితిని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం పరిశీలించింది. ఈ పరిశీలనలో నిర్వహణ లోపాలు బయటపడ్డాయి. కాళేశ్వరం ఎత్తిపోతలకు సంబంధించిన పంప్‌హౌస్ నిర్వహణను క్షేత్రస్థాయిలో గాలికొదిలేసినట్లు తేలింది. అనంత గిరి(అన్నపూర్ణ) పంప్‌హౌస్‌లో 106 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లలో ఒకటి లోపాలతో పాడైనట్లు గుర్తించారు. మల్లన్నసాగర్‌లో 43 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 8 మోటార్లలో 2 పనిచేయడం లేదని తేల్చారు. ఈ పంప్‌హౌస్‌ల డిఫెక్ట్ లయబిలిటీ కాలం కూడా పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి మోటార్లకు మరమ్మతులు వస్తే.. స్థానిక అధికారులు వెనువెంటనే చర్యలు తీసుకోవాలి. అయితే.. ఆ దిశలో చర్యలు తీసుకోకుండా నిర్వహణను గాలికి వదిలినట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను బట్టి స్పష్టమవుతోంది. గత ఏడాదే మరమ్మతులపై చర్యలు తీసుకుని ఉండాల్సిందనే అభిప్రాయాలున్నాయి. ఇప్పుడు వరదలతో రిజర్వాయర్లు నిండుగా ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో పనిచేయని రెండు మోటార్లకు మరమ్మతులు చేయించాలంటే.. నీటి నిల్వలు తగ్గేదాకా ఆగాల్సిందే.!

గోలివాడ పైనే ఆశలు!

నిర్వహణ, నిర్మాణ లోపాలతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్‌లు ప్రస్తుతం వాడుకలో లేవు. గత ఏడాది అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిందే.! అంతకు ముందు సంవత్సరం భారీ వరదలతో కన్నెపల్లి పంప్‌హౌస్ పూర్తిగా దెబ్బతిన్నది. సిరిపురం పంప్‌హౌస్‌లోకి నీరు చేరగా.. మోటార్లను మళ్లీ సిద్ధం చేశారు. ఈ రెండు పంప్‌హౌస్‌లు రెండేళ్లుగా మూతపడ్డాయి. గోలివాడ ఒక్కటే కాస్త సురక్షితంగా ఉంది. దానిపైనే ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. డాక్టర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి దిగువన రబ్బర్ డ్యామ్ కట్టి, అక్కడి నుంచి నీటిని నేరుగా సుందిళ్ల బ్యారేజీకి తరలించి.. అక్కడినుంచి ఎల్లంపల్లిలోకి ఎత్తిపోయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో రానున్న రోజుల్లో సుందిళ్ల బ్యారేజీతోపాటు గోలివాడ పంప్‌హౌస్‌పై సర్కారు ఆశలు పెట్టుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్-1లో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు/పంప్‌హౌస్‌లు ఉండగా.. ఈ లింక్‌లో అన్నారం, మేడిగడ్డలను వదిలేసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. తుమ్మిడిహెట్టి దిగువన రబ్బర్ డ్యామ్ కట్టి, ఎల్లంపల్లి నుంచి తుమ్మిడిహెట్టి మధ్య లింక్‌కు జీవం పోసే దిశలో చర్యలు తీసుకుంటోంది. ఈలోగా అన్ని పంప్‌హౌస్‌లను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఈఎన్‌సీ నేతృత్వంలోని బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది.

జెన్‌కోకు 100 కోట్ల నష్టం

వరద జలాలను విద్యుదుత్పత్తికి వాడుకోలేని దుస్థితి

» యూనిట్ రిపేర్లను పట్టించుకోని వైనం

» జలవిద్యుత్‌పై జెన్‌కో నిర్లక్ష్యం!

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కళ్ల ముందే లక్షల క్యూసెక్కుల వరద జలాశయాల నుంచి దుంకుతూ పోతున్నా.. ఆ నీటిని పూర్తి స్థాయిలో కరెంటు ఉత్పత్తికి వాడుకోలేని దుస్థితి. ప్రధాన జల విద్యుత్ కేంద్రాల్లో మరమ్మతులను ఏడాది కాలంగా పట్టించుకోకపోవడంతో.. పైసా ఖర్చు లేకుండా తయారయ్యే కరెంటు అందని పరిస్థితి. ఫలితంగా ఈ వరద సీజన్‌లో ఇప్పటిదాకా జెన్‌కో 25 కోట్ల యూనిట్లకు పైగా ఉత్పత్తిని కోల్పోయింది. దీని విలువ సుమారు రూ.100 కోట్లు. రాష్ట్రంలో ప్రధానంగా జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కేంద్రాలు ఉన్న కృష్ణా బేసిన్‌లోని జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. రెండు నెలలుగా జలాశయాలకు భారీగా వరద వస్తోంది. ప్రతీ చుక్కను ఒడిసిపట్టుకుంటే పైసా ఖర్చు లేకుండా కరెంటు వస్తుంది. అయితే, ప్రాజెక్టుల్లో రోజూ లక్షల క్యూసెక్కుల వరద వచ్చిచేరుతున్నా.. రోజుకు 331.8 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోలేని నిస్సహాయత నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 2441.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. ఇందులో 2,371.6 మెగావాట్ల కేంద్రాలు కృష్ణా బేసిన్‌లో ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 2111.8 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. ఈ ఏడాది కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చిచేరుతోంది. జెన్‌కో అధికారుల నిర్లక్ష్యంతో ఈ బేసిన్‌లో 321.8 మెగావాట్ల కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో రోజుకు 7.93 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తికి గండిపడింది. వానాకాలానికి ముందే జలవిద్యుత్ కేంద్రాల్లో మరమ్మతులు చేయాల్సి ఉండగా.. జెన్‌కో యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

మళ్లీ వారే..


పదేళ్లలో నిబంధనలకు విరుద్ధంగా నియమితులయ్యారనే అభియోగాలతో ట్రాన్స్‌కో, జెన్‌కోలలో డైరెక్టర్లను తొలగించారు. కొత్త డైరెక్టర్లు వచ్చేదాకా బాధ్యతలు వారే చూస్తారని గతంలో సీఎండీగా పనిచేసిన రిజ్వీ ఉత్తర్వులిచ్చారు. అయితే వారే ప్రస్తుతం మళ్లీ చక్రం తిప్పుతున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరించినా.. నియామక ప్రక్రియ ముందుకు కదలడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే.. కొత్త నియామకాలను అడ్డుకుంటున్నారనే ఫిర్యాదులున్నాయి. నిబంధనల ప్రకారం గతంలో జరిగిన తప్పిదాలకు వీరిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. మళ్లీ వారికే పట్టం కట్టడంపై పలువురు మండిపడుతున్నారు.

నీళ్లున్నా.. ఉత్పత్తిలో లేని కేంద్రాలు..

- రాష్ట్రంలోనే అత్యంత పెద్ద జలవిద్యుత్ కేంద్రమైన శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 900 మెగావాట్లు కాగా, అందులో 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4వ యూనిట్ గతేడాది ఆగస్టు 17 నుంచి పనిచేయడం లేదు. స్టేటర్ వైండింగ్ కాలిపోవడంతో పాటు రోటర్ పోల్‌లో సమస్య రాగా ఏడాదిగా మరమ్మతులు చేయలేదు.
- నాగార్జునసాగర్ స్థాపిత సామర్థ్యం 815.6 మెగావాట్లు. అందులో 100.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో సమస్య రావడంతో గత నవంబరు 10 నుంచి వినియోగంలో లేదు. జపాన్ నుంచి ఇంజనీర్లు వస్తేనే దీనికి మరమ్మతులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.
- పులిచింతల సామర్థ్యం 120 మెగావాట్లు కాగా, 2022 అక్టోబరు 1 నుంచి 30 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడో యూనిట్ నిరుపయోగంగా మారింది. దాదాపుగా రెండేళ్లు గడుస్తున్నా చెడిపోయిన రన్నర్ బ్లేడ్‌ను మార్చలేదు.
- జూరాల ప్రాజెక్టులో 39 మెగావాట్ల యూనిట్-3 స్టేటర్ వైండింగ్ కారణంగా 2023 ఆగస్టు 7 నుంచి ఉత్పత్తి ఆగింది.
- నిజాంసాగర్ ప్రాజెక్టు 10 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉండగా, మరమ్మతులు చేయకపోవడంతో 2022 నవంబరు 9 నుంచి పనిచేయడం లేదు.
- పాలేరు మినీ హైడ్రో పవర్‌స్టేషన్ సామర్థ్యం 2 మెగావాట్లు కాగా, ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ఒకటో యూనిట్ గత మార్చి 6 నుంచి నిరుపయోగంగా ఉంది. తాజాగా వరదలతో మరో యూనిట్ కూడా ఆగిపోయింది.

వట్టెం పంప్‌హౌస్ మునక

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని నిర్మాణమే ఇది.. 4 మోటార్లపై ప్రభావం.. నష్టం భారీగానే?



పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్‌లో వరద నీటిలో మునిగిన పంపులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్ నీట మునిగింది. ఇటీవలి భారీ వర్షాలకు వరద టన్నెళ్ల ద్వారా సర్జ్‌పూల్, పంపుహౌస్‌లోకి చేరింది. ఈ పంప్‌హౌస్‌లో 10 మోటార్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా నాలుగు బిగించారు. మరోటి సిద్ధంగా ఉంది. అయితే, ఎడతెరిపి లేని వానలతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని గొలుసుకట్టు చెరువులైన తూడికుర్తి, శ్రీపురం, నాగనూల్ చెరువులు అలుగు పారాయి. వీటి దగ్గర్లోనే పాలమూరు లిఫ్ట్ టన్నెల్ ఉంది. దీనికోసం ఏర్పాటు చేసిన మార్గం మీదుగా చెరువుల నీరు సర్జ్‌పూల్‌లోకి వచ్చింది. గేట్ల ద్వారా పంప్‌హౌస్‌లోకి వెళ్లింది. ఈ ఘటనతో భారీగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. కాగా, 12.50 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా పాలమూరు ఎత్తిపోతల పథకంలో నాలుగు దశల్లో ఒక్కొక్కటి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్లను బిగించాల్సి ఉంది. ఒక్కొక్క మోటారు డిశ్చార్జ్ సామర్థ్యం 2,646 క్యూసెక్కులు. అయితే, శ్రీపురం నుంచి వట్టెం వరకు 15 కిలోమీటర్ల టన్నెల్ చేపట్టారు. దీని ఎగువన 30 నుంచి 40 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయని సర్వేలో తేలింది. అయినా, జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే పంప్‌హౌస్‌లోకి నీరు వచ్చిందనే విమర్శలు వస్తున్నాయి. ఆడిట్-3 టన్నెల్ ఎగువన శ్రీపురం, తూడుకుర్తి నుంచి వరద సర్జ్‌పూల్‌లోకి చేరింది. సాగునీటి అధికారులు, గుత్తేదారులు.. వరదను గమనించి ప్యానెల్ బోర్డులు, ఎలక్ట్రానిక్ వస్తువులను బయటకు తీసుకెళ్లారు. సర్జ్‌పూల్‌లో చేరిన వరద నీటిని తీసివేసేందుకు కనీసం 20 రోజులు పట్టే అవకాశం ఉంది. శ్రీపురంలోని టన్నెల్ ద్వారా.. వరద సర్జ్‌పూల్‌కు చేరకుండా ప్రయత్నిస్తున్నారు. ఆడిట్-3 ఎగువ నుంచి దాదాపు పది మీటర్ల వెడల్పున వరద చేరుతుండడంతో ఇది కొలిక్కిరాలేదు. 3 రోజులపాటు వర్షాలు రాకుంటేనే పనులు ముందుకు కదులుతాయని స్పష్టం చేస్తున్నారు. నీటి తోడివేతకు 800 హెచ్‌పీ మోటార్లను వినియోగిస్తున్నామని పాలమూరు ఎత్తిపోతల ఎస్ఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. వట్టెం పంపుహౌస్ మునకను గోప్యంగా ఉంచిన అధికారులు మీడియాపై ఆంక్షలు విధించారు. మంగళవారం కవరేజీకి వెళ్లిన ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు.

పాలమూరులో తొలిసారి

పాలమూరు ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్ మునగడం ఇదే తొలిసారి. కాగా, కేఎల్ఐలో మూడుసార్లు ఇలాంటి సందర్భం ఎదురైంది. నిర్మాణ పనులు తొలి దశలో ఉండగా కేఎల్ఐలో 2009లో వరదల కారణంగా పంప్‌హౌజ్‌లోకి నీరు చేరింది. 2014లోనూ వరద నీరు చేరి పంపులన్నీ నీట మునిగాయి. 2020లో మూడోసారి వరదతో ఐదు మోటార్లు దెబ్బతిన్నాయి. మూడింటిని పునరుద్ధరించినా రెండు మోటార్లకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. నిధులు మంజూరైనా అప్రోచ్ చానళ్ల వద్ద షట్టర్లు బిగించని కారణంగానే పంపుహౌజ్‌లు మునుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగుల స్థాయికి చేరితే కల్వకుర్తి ఎత్తిపోతలకు ఇబ్బంది తప్పదని ఇంజనీర్లు అంటున్నారు.

విరాళాల్లో పోటాపోటీ!

- ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్య పోరు
- రూ.100 కోట్ల ప్రకటించిన లచ్చిరెడ్డి
- రూ.130 కోట్లు ఇస్తున్నామన్న జగదీశ్వర్
- మహబూబాబాద్‌లో సీఎంను కలిసి లేఖ అందజేత
- గందరగోళంలో ఉద్యోగులు

హైదరాబాద్, మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు ఇవ్వడంలో ఉద్యోగ సంఘాల నాయకులు పోటీ పడ్డారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరఫున ఆ సంఘం చైర్మన్ వి.లచ్చిరెడ్డి మంగళవారం ఉదయం వరద బాధితుల సహాయార్థం రూ.100 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, దీనికి ఉద్యోగుల తరఫున చేయూతగా ఒక రోజు మూలవేతనం రూ.100 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణలోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల తరఫున సమష్టి నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసి అంగీకార పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే మారం జగదీశ్వర్ నేతృత్వంలోని ఉద్యోగుల ఐకాస స్టీరింగ్ సమావేశం నిర్వహించింది. సీఎం సహాయ నిధికి ఉద్యోగుల ఒక రోజు మూల వేతనం రూ.130 కోట్లు అందజేస్తున్నట్లు ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఇతర సంఘాల నాయకులు తీర్మానం చేశారు. అనంతరం ఐకాస నాయకులు మహబూబాబాద్‌లో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి లేఖను అందజేశారు. సంఘాల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, ఇతర పెండింగ్ బిల్లులపై మాట్లాడని నాయకులు.. ఎవరికి తోచినట్లు వారు ఒక రోజు మూలవేతనంపై ప్రకటనలు చేస్తున్నారన్న విమర్శలు వినిపించాయి. రెండు సంఘాల నాయకులు ఎవరికి తోచినట్లు వారు నిర్ణయాలు తీసుకోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఉద్యోగులు వాపోతున్నారు.

పింఛనుదారుల ఐకాస రూ.33 కోట్ల విరాళం

తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల ఐకాస చైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. వరదల వల్ల నష్టపోయిన వారి సహాయార్థం పింఛనుదారుల ఒక రోజు మూల వేతనం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.80 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారని, వారి ఒక రోజు మూలవేతనం రూ.33 కోట్లు ఉంటుందని, సెప్టెంబరు నెల పింఛను నుంచి మినహాయించాలని సీఎస్ శాంతి కుమారిని కోరినట్లు లక్ష్మయ్య తెలిపారు.


మహబూబాబాద్ జిల్లా సీతారాంతండాలోని బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న సీఎం


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీరోలు ఎస్సై నగేష్‌ను సన్మానించి అభినందిస్తున్న సీఎం రేవంత్

రాష్ట్రమంతా హైడ్రా

(మొదటిపేజీ తరువాయి)

ఒత్తిడి వచ్చినా.. వెనక్కి తగ్గేదే లేదని, తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమంగా కట్టడాలు చేపట్టి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని పిలుపునిచ్చారు. ఆక్రమణలకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. హైడ్రా తరహాలో జిల్లాలో ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

30 వేల ఎకరాల్లో పంటనష్టం

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సహాయక చర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులను అభినందించారు. జిల్లాలో అత్యధికంగా 28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనా అధికారుల సమన్వయంతో పని చేయడం వల్ల ఆస్తినష్టం, ప్రాణనష్టం తగ్గిందని చెప్పారు. నలుగురు ప్రాణాలు కోల్పోయారని, 215 పశువులు చనిపోయాయని, 45 ట్యాంక్‌లు, మూడు పక్కా ఇళ్లు, 15 కచ్చా ఇళ్లు కూలిపోయాయని, 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని చెప్పారు. 125 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, 680 మందికి వసతి కల్పించామని చెప్పారు. వందమందిని సురక్షితంగా తరలించడంలో ప్రత్యేక కృషి చేసిన సీరోలు ఎస్సై నగేష్‌ను అభినందించారు. పురుషోత్తమయగూడెం ఆకేరువాగులో కారు గల్లంతుతో మృతి చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ కుటుంబాన్ని వారి స్వగ్రామానికి వెళ్లి సీఎం పరామర్శించారు. మోతీలాల్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. మోతీలాల్ కుమారుడికి గ్రూప్ 1 ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించారు. నాలుగు తండాల వారికి మెరక ప్రాంతంలో మోడల్ కాలనీ ఏర్పాటు చేసి, ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. వరదల్లో పశువులు మృతి చెందితే రూ.50 వేలు, మేకలు, గొర్రెలకు రూ.5 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు శుభ్రం చేయడానికి నల్లాలు, ట్యాంకర్ల ద్వారా నీరందించాలని చెప్పారు. ప్రమాదాలు, వరదల నష్టం తరచూ జరిగే ప్రాంతాలను గుర్తించి, బ్లూబుక్ తయారు చేసి కలెక్టరేట్‌లో ఉంచాలని చెప్పారు.

విపత్తును గుర్తించడానికి పీఎంకు ఆహ్వానం

వరదల్లో రూ.6 వేల కోట్లు నష్టం వాటిల్లిందని, విపత్తు గుర్తించి అర్థం చేసుకుని తగిన సాయం అందించడానికి ప్రధాని మోదీని రాష్ట్రానికి ఆహ్వానిస్తూ లేఖ రాశామని రేవంత్ తెలిపారు. జాతీయ విపత్తుగా గుర్తించి రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. ప్రధాని వస్తే నష్టం నివేదిక అందించడానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర వివరాలతో సమాచారం అందించాలని ఆదేశించారు.

పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడైనా వచ్చారా?

గత పదేళ్లలో కేసీఆర్ పాలనలో వర్షాలు.. వరదలు వచ్చినప్పుడు ఏనాడైనా ప్రజలను పరామర్శించేందుకు వచ్చాడా? అని రేవంత్ ప్రశ్నించారు. కేసీఆర్ సొంత నియోజకవర్గంలో మరణాలు సంభవించినా పోలేదన్నారు. కొందరు నాయకులు ఇప్పుడే సీఎం అయ్యారుగా.. అందుకే తిరుగుతున్నారని అనడం విచారకరమని వ్యాఖ్యానించారు. నాలుగు రోజులుగా రాష్ట్రంలో వర్ష బీభత్సం కొనసాగుతుంటే కేటీఆర్ అమెరికాలో జల్సా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు నాలుగు రోజుల తర్వాత బయటకు వచ్చి, నాలుగు ప్రాంతాలు తిరిగి తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. హరీశ్‌కు చిత్తశుద్ధి ఉంటే ఖమ్మంలో పువ్వాడ అజయ్ చేసిన ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేయగలరా? వాటిని తొలగించడంలో చిత్తశుద్ధితో సహకరిస్తారా అని ప్రశ్నించారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితుల సాయం కోసం ముందుకు రావాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.


సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో పత్తిచేనులో ఇసుక మేటలు

సీఎం అంకుల్.. ఇది నావంతు

కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3 వేలు విరాళమిచ్చిన విద్యార్థిని

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వయసులో చిన్నదాన్నే కానీ తోటి మనుషులకు సాయం చేసే విషయంలో తన మనస్సు చాలా పెద్దదని నిరూపించింది మహబూబాబాద్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సింధు. అమ్మానాన్న పాకెట్ మనీగా ఇచ్చిన డబ్బులో నుంచి కిడ్డీ బ్యాంకులో తాను భద్రంగా దాచుకున్న రూ.3వేలను సింధు వరద బాధితులకు సాయం చేసేందుకు ఇచ్చేసింది. మహబూబాబాద్‌కు చెందిన ముత్యాల గీతవాణి, ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె సింధు స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కిడ్డీ బ్యాంకులో తాను పోగుచేసిన రూ.3 వేలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం స్వయంగా అందజేసిన సింధు.. వరద బాధితులకు సాయం చేసేందుకు వాటిని వినియోగించాలని కోరింది. సింధు చేసిన పనికి ముఖ్యమంత్రి ఆమెను అభినందించారు.

ప్రధాని రాకపోతే ఢిల్లీ వెళతాం

మహబూబాబాద్ జిల్లా పర్యటనకు ముందు ముఖ్యమంత్రి ఖమ్మంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వరద నష్టాన్ని ప్రధాని వచ్చి చూడక పోయినా రాష్ట్ర ప్రభుత్వం తరుఫున ఢిల్లీ వెళ్లి కేంద్రం దృష్టికి వరద నష్టాన్ని తీసుకెళ్తామని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్న ఈటల రాజేందర్ డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, కేంద్రం వాటాగా రూ.25 లక్షలు ఇప్పించేందుకు కృషి చేయాలని సూచించారు. తెలంగాణలో గొలుసుకట్టు చెరువులను ఆక్రమించుకుని ప్రవాహాలకు అడ్డంకులు సృష్టించడం వల్లే వరద సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మున్నేరు నది వరద ఖమ్మం పట్టణంలోకి రాకుండా గోడ నిర్మించడంపై నిపుణుల కమిటీ సలహా తీసుకుంటామని చెప్పారు. ఇంజనీర్లే వరదల నివారణకు ఏం చేయాలో తేలుస్తారని, తాను 80 వేల పుస్తకాలు చదవలేదని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి రాగానే మున్నేరు గోడకు మొదటి టెండర్ వేశామని, ఈ లోగానే వరద వచ్చిందని చెప్పారు. సర్వే ఇండియా మ్యాప్‌ల ఆధారంగా చెరువులు, ఏర్ల విస్తృతిని గుర్తిస్తామని, వాటి ఆధారంగా ఆక్రమణను తొలగిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం మట్టిని దోచుకునేందుకే మిషన్ కాకతీయ పథకాన్ని తీసుకొచ్చిందని రేవంత్ ఆరోపించారు. ఇది 'కమిషన్ కాకతీయ' పథకం అన్నారు. చెరువుల్లో మట్టిని ఇష్టానుసారంగా రోడ్లకు, ఇటుక బట్టీలకుఅమ్ముకున్నారని ఆరోపించారు. నాణ్యత లేకుండా పునర్నిర్మించడం వల్లే చెరువులు తెగిపోయాయని వ్యాఖ్యానించారు. చెరువులను బలోపేతం చేస్తే ఎందుకు తెగుతున్నాయో హరీశ్ సమాధానం చెప్పాలన్నారు. ఖమ్మంలో పువ్వాడ అజయ్‌కుమార్ మమతా మెడికల్ కాలేజీలో ఆక్రమించుకున్న భూములను హరీశ్ దగ్గరుండి తొలగించి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. స్థానికులతో నిజ నిర్ధారణ కమిటీ వేస్తామని, వారితో పువ్వాడ ఆక్రమణలపై చర్చించేందుకు హరీశ్ రావాలని పిలుపునిచ్చారు.

75 ఏళ్లలో అత్యధిక వర్షపాతం

ఖమ్మం కృష్ణా సరిహద్దు జిల్లాలని, కవల పిల్లల్లాంటివని, ఈ రెండు జిల్లాల్లో వరదల వల్ల ఎంత నష్టం జరిగిందో జర్నలిస్టులు అంచనా వేయాలని సూచించారు. 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా 42 సెంటీమీటర్ల వర్షం కురవడం తోనే ఇంత భారీ వరదలొచ్చాయని చెప్పారు. రెండు జిల్లాల నష్టాన్ని పోల్చి చూడాలన్నారు. మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి స్థానికంగా ఉండి ఎలా సహాయ చర్యల్లో పాల్గొన్నారో తెలుసుకోవాలన్నారు. పక్క రాష్ట్రం ముఖ్యమంత్రి అద్భుతంగా చేస్తున్నారని హరీశ్ పొగుడుతున్నారని, ఇక్కడ మంత్రుల పని కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం దగ్గర లక్ష కోట్ల ఆస్తులున్నాయని, రెండు వేల కోట్లు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందించాలని సూచించారు.

ఖమ్మం హెలికాప్టర్లు విజయవాడలో

ఖమ్మం కోసం ఉద్దేశించిన రెండు హెలికాప్టర్లను సమీపంలో ఉన్న విజయవాడలో ఉంచామని చెప్పారు. హెలికాప్టర్లే లేవనడం అబద్ధమన్నారు. ఒడిశాలో వరదలప్పుడు విశాఖ నుంచి హెలికాప్టర్లు పని చేశాయని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లాకు అన్ని విధాల సాయం చేస్తామని, రోడ్లపై బురద తొలగిస్తున్నామని, రాష్ట్రస్థాయి అధికారులను ఖమ్మానికి రప్పిస్తున్నామని తెలిపారు. నాలుగు జిల్లాల కలెక్టర్లకు రూ.5 కోట్లు చొప్పున కేటాయించామని ప్రకటించారు. రాష్ట్రంలో 8 చోట్ల టీడీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసి, 800 మందికి శిక్షణ ఇస్తామని సీఎం ప్రకటించారు.

కదిలిస్తే కన్నీటిగాథలే..

ఖమ్మంలో మున్నేరు విలయంతో నిరుపేదల బతుకులు ఆగమాగం

ఎటుచూసినా మట్టికొట్టుకున్న వస్తువులు..

ఇళ్లు, వీధుల్లో బురద బాధలు.. అందని తాగునీరు, నిత్యవసరాలు

కూలీ పనులు చేసుకుంటూ జీవించే మిరియాల సరోజ మున్నేరు తీరంలోని పద్మావతినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. వరద పెరుగుతుండగా హుటాహుటిన బయటకు వెళ్లిపోయింది. ఉధృతి తగ్గాక వచ్చి చూస్తే.. రేకులు సహా, సామాన్లు, దుస్తులు కొట్టుకుపోయి, బురదమయంగా మారిన ఇంటిని చూసి బోరున విలపించింది.. వీరేకాదు.. ఖమ్మం నగరంలోని పదుల కాలనీల్లో ఎక్కడికి చూసినా ఇదే తీరు.


మున్నేరు వరదతో ధ్వంసమైన ఇళ్లు

ఎగిరిపోయిన పైకప్పులు, కూలిన గోడలు, కొట్టుకుపోయిన ఇళ్లు..! ఖమ్మంలో మున్నేరు విలయంతో ఎటుచూసినా విషాద గాథలే..! ఏ వీధిలో తిరగాలన్నా అంతా బురదే..! ఏ ఇంట్లో చూసినా మట్టికొట్టుకున్న వస్తువులు, దుస్తులే..! కొందరికి ఇవీ లేవు. ఆయా ప్రాంతాల్లో ఏ ఇల్లాలిని కదిలించినా కన్నీరే. మున్నేరు ఉగ్రరూపం దాల్చి 36 అడుగుల మేర ప్రవహించడంతో నది తీరాన ఉన్న ప్రాంతాల్లో వేల ఆవాసాలు నీట మునిగాయి. వాటిని 'ఆంధ్రజ్యోతి' మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించగా హృదయాలను కదిలించే దృశ్యాలు కనిపించాయి. కాగా, ముంపు తీవ్రత రీత్యా మరో రెండు రోజులు పునరావాస కేంద్రాలను కొనసాగించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. 13 మంది తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర ఉద్యోగులకు ఖమ్మంలో విధులు కేటాయించారు.

నీళ్లు లేవు.. నిత్యవసరాలు అందలేదు

వరద ఉధృతి తగ్గిన అనంతరం బాధితులు ఇళ్లకు చేరుకున్నా తాగేందుకే కాదు.. బురదను తొలగించేందుకు, వంట సామగ్రి శుభ్రానికీ నీళ్లు లేవు. ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్లు తెప్పించినా రోజులో ఒక సారే నీళ్లందుతున్నాయి. ప్రభుత్వ ట్యాంకర్లు సరిపోక ప్రైవేటు నీళ్ల ట్యాంకర్లను ఆశ్రయిస్తుంటే రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. చాలామంది బాధితులు మధ్యాహ్నం వరకు తమవైపు చూసే దిక్కే లేదని వాపోతున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న పులిహోర ప్యాకెట్లను పిల్లలకు పెట్టి తాము పస్తులుంటున్నామని కొందరు తెలిపారు. ఫైర్ ఇంజన్లతో రోడ్ల శుభ్రం ప్రధాన రహదారులకే పరిమితమైంది. బియ్యం, నూనె వంటి నిత్యవసరాలతో ప్రభుత్వం 30 వేల ప్యాకెట్లను సిద్ధం చేయించినప్పటికీ ఒకటి, రెండు ప్రాంతాలకే అందాయి. కొందరు తెలిసినవారి నుంచి ఆర్థిక సాయం పొంది పూట గడుపుకోగా, ఇంకొందరు మూడు రోజులుగా ఒకటే దుస్తులతో ఉంటున్నారు. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్తు పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఇళ్లను పరిశీలించాకే సరఫరా చేస్తున్నారు. భారీగా వస్తువులు బయటపడేస్తుండడంతో ఒక్కో వీధిలో పదుల ట్రాక్టర్లను ఉంచారు. ముంపు ప్రాంతాల్లో చాలా వాహనాలు కొట్టుకుపోగా.. వేల కొద్దీ నీట మునిగాయి. మున్నేరు దగ్గరలోని ఖమ్మం లారీ అసోసియేషన్‌లో 200 లారీలను వరద ముంచెత్తింది. మరమ్మతులకు రూ.50 వేల వరకు ఖర్చవుతోందని యజమానులు చెబుతున్నారు. ఒక్కోదాంట్లో 60 లీటర్ల డీజిల్ పనికిరాకుండా పోయిందన్నారు. వెయ్యికి పైగా కార్లు గ్యారేజీలకు చేరగా.. సగటున రూ.లక్ష, ఇంజన్‌లోకి నీళ్లు పోయిన ద్విచక్ర వాహనాలకు రూ.10 వేల వరకు ఖర్చవుతోందని మెకానిక్‌లు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం


ఖమ్మంలోని ఓ కాలనీలో పైకప్పు ధ్వంసమైన ఇంట్లో పేరుకుపోయిన బురదను చూపుతున్న బాధితులు

24 కు చేరిన మృతుల సంఖ్య

వానలు, వరదలతో రాష్ట్రంలో తీవ్ర నష్టం

- 14 వేల మూగజీవాల మరణం
- 6,000 ఇళ్లు, 1900 కి.మీ రోడ్లు విధ్వంసం
- 130 గ్రామాలపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శనివారం నుంచి కురిసిన కుండపోత వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. వర్షాలు, వరదల దెబ్బకు భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. విపత్తుల నిర్వహణ విభాగం సంయుక్త కార్యదర్శి హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్షాలు, వరదల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 24 మంది ప్రాణాలు కోల్పోయారు. వరదల వల్ల ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు అధికంగా దెబ్బతిన్నాయి. సూర్యాపేట, భద్రాది కొత్తగూడెం, ములుగు ప్రాంతాల్లోనూ తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలు, వరదల వల్ల సుమారు 130 గ్రామాలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో అయిదుగురు, కామారెడ్డిలో నలుగురు, కొత్తగూడెంలో ముగ్గురు, మహబూబాబాద్‌లో ముగ్గురు, ములుగులో ఇద్దరు, నారాయణపేట్‌లో ఇద్దరు, పెద్దపల్లిలో ఇద్దరు, సిద్దిపేటలో ఇద్దరు, వనపర్తిలో ఒకరు మరణించారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి 14వేల మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అలాగే ఆరు వేల ఇళ్లు, 84 ప్రభుత్వ పాఠశాలలు ధ్వంసమయ్యాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరదల్లో చిక్కుకున్న 4500 మందిని రక్షించగా, ప్రభుత్వ పునరావాస శిబిరాల్లో 11,300 మంది ఆశ్రయం పొందుతున్నారు. అలాగే, వర్షాల దెబ్బకు రహదారుల భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సుమారు 1900 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. ఖమ్మం, ములుగు, భద్రాది కొత్తగూడెం జిల్లాలోని రోడ్లు అధికంగా ధ్వంసమయ్యాయి.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

వరద బాధితులకు మంత్రుల భరోసా.. దెబ్బతిన్న ప్రాంతాలు, పంటల పరిశీలన

- నిత్యావసర సరుకుల పంపిణీకి భట్టి ఆదేశం
- ఇళ్లు కోల్పోయినవారికి పరిహారం అందిస్తాం
- ప్రాజెక్టుల రక్షణకు సబ్ కమిటీ: ఉత్తమ్
- ప్రతిపక్ష నేత ఎక్కడ?: మహేశ్‌కుమార్ గౌడ్

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 3: భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు మంగళవారం పర్యటించారు. బాధిత ప్రజలు, రైతులను ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. పంట నష్టం అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని మున్నేరు వరద ముంపు ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పరిశీలించారు. పండ్రేగుపల్లి మున్నేరు కరకట్ట తెగి డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి నీరు రాగా అక్కడి పరిస్థితిని పరిశీలించి బాధితులకు మనోధైర్యం చెప్పారు. తక్షణ సాయం కింద నిత్యావసర సరుకులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటించారు. ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న వారికి రూ.10 వేలు సాయం అందిస్తామన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో వరద నీరు భారీగా రోడ్లపైకి వచ్చిందన్నారు. హుజూర్‌నగర్ ట్యాంక్‌బండ్ డిజైన్‌ను ఇష్టానుసారంగా మార్చి ఇళ్లలోకి వరద రావడానికి కారణమైన నీటి పారుదల శాఖ ఏఈ తుమ్మల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని సీఈ రమేశ్‌బాబును ఆదేశించారు. ప్రాజెక్టుల రక్షణకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మఠంపల్లిలోని మామిళ్లచెరువును పరిశీలించేందుకు ఉత్తమ్... రైతులతో కలిసి 5 కిలోమీటర్లు ట్రాక్టర్‌పై వెళ్లారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు పనులు పూర్తికావడంతో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో నీటమునిగిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులను పరామర్శించారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో, కేటీఆర్ విదేశాల్లో ఎంజాయ్ చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలను జనాలు తిరగబడి చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ కార్యకర్తలు 24 గంటలూ కృషి చేస్తున్నా కేటీఆర్, హరీశ్‌రావు విచక్షణ లేకుండా మాట్లాడుతున్నారన్నారు.


సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మామిళ్ల చెరువు పరిశీలనకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్


ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పండ్రేగుపల్లిలో వరద బాధితులతో మాట్లాడుతున్న భట్టి

బీజేపీ నిజస్వరూపం బయటపడింది: వీహెచ్

కులగణన కేవలం ఉద్యోగ నియామకాలకే కానీ రాజకీయాలకు ఉపయోగించుకూడదన్న ఆర్ఎస్ఎస్ ప్రకటనతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు అన్నారు. బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాలా అంటూ నిలదీశారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌లు సమాధానం చెప్పాలన్నారు.



వరద బాధితులకు గవర్నర్ ఆర్థికసాయం

రెడ్ క్రాస్‌కు రూ.30 లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆర్థిక సాయం ప్రకటించారు. తన నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఛైర్మన్ అజయ్ మిశ్రాకు మంగళవారం అందజేశారు. వరద బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులను ఈ నిధులతో అందజేయాలని సూచించారు. వర్షాలు, వరదల వల్ల ఇబ్బంది పడుతోన్న ప్రజలు ధైర్యంగా ఉండాలని, నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని గవర్నర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, ఖమ్మం వరద బాధితులకు అవసరమైన సాయం చేసేందుకు గాను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన నెల జీతాన్ని విరాళంగా ఇచ్చారు.

సాగర్ ఎడమ ఉప కాల్వకు భారీ గండి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 3: సూర్యాపేట జిల్లాలో సాగర్ ఎడమ కాల్వ 13వ బ్రాంచ్ కెనాల్‌కు భారీ గండి పడింది. హుజూర్‌నగర్ పరిధిలోని ముక్త్యాల కాల్వ కట్ట కరక్కాయలగూడెం సమీపంలో(14వ కి.మీ వద్ద) ఈ నెల 1న ధ్వంసం కాగా.. ఎన్నెస్పీ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి వచ్చే కాలువకు కుడివైపున గండి పడడంతో హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం ప్రాంతంలోని పంట పొలాలు నీటమునిగాయి. ఈ వరద ప్రవాహం కరక్కాయలగూడెం, మర్రిగూడెం ప్రాంతాల మీదుగా బూరుగడ్డలోని నల్లచెరువుకు వరద రావడంతో చెరువు కట్ట తెగింది. దీంతో వేములూరు వాగు ఉధృతంగా ప్రవహించి బూరుగడ్డ నల్లచెరువు తెగిపోవడంతో సుమారు 500ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 14వ కి.మీ వద్ద కెనాల్‌కు గండి పడిన రోజే 18వ కి.మీ. వద్ద కాలువ లైనింగ్ కొట్టుకుపోయింది. 22వ కి.మీ. వద్ద రెండు చోట్ల గండ్లు పడ్డాయి.

'మార్కెట్ వాల్యూ' సర్టిఫికెట్ మీసేవల్లో..

» త్వరలో కొత్తగా 9 రకాల సేవలు

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భూములు, గృహాలు, అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్‌కు మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ తప్పనిసరి. అది తెలుసుకోవాలంటే సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాల్సిందే. ఇక నుంచి దీన్ని రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా తీసుకునే వెసులుబాటు లభించనుంది. త్వరలో ఈ సేవలు మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి రానున్నాయి. ప్రజల సౌకర్యార్థం మీసేవ ద్వారా అదనంగా మరిన్ని సేవలు అందుబాటులోకి తేవాలని సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఇటీవలే ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ(ఈఎస్‌డీ) కమిషనర్‌కు లేఖ రాశారు. మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్‌తో పాటు మరో 8 రకాల సేవలు కూడా మీసేవ కేంద్రాల ద్వారా అందించాలని ఆయన కోరారు. ఇందులో విద్యార్థుల చదువు మధ్యలో విరామం వస్తే అందించే గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పు, స్థానికతను ధ్రువీకరించే లోకల్ సర్టిఫికెట్, మైనార్టీ సర్టిఫికెట్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కొనసాగింపుగా అందించే రీ ఇష్యూ సర్టిఫికెట్, పోటీ పరీక్షల దరఖాస్తుకు విద్యార్థులకు అవసరమయ్యే క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్, పాత పహాణీ రికార్డులు, ఆర్వోఆర్ సర్టిఫైడ్ కాపీలు.. మీసేవ ద్వారా పొందవచ్చు. ఈ సేవలు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

ఏఐతో బోధన మరింత మెరుగు

» డీజీఐ సర్వేలో 97% మంది అధ్యాపకుల అభిప్రాయం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా బోధనలో కృత్రిమ మేధ(ఏఐ)ను జోడించడం వల్ల మెరుగైన ఫలితాలను సాధించవచ్చని దాదాపు 97% మంది విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నట్లు డీజీఐ సంస్థ నిర్వహించే ఓ సర్వేలో వెల్లడించింది. హైదరాబాద్ సహా ఢిల్లీ, బెంగళూరు లాంటి 15 నగరాల్లో 20 విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా ఉపాధ్యాయులపై ఈ సర్వే నిర్వహించారు. ఏఐతో తమ బోధన మరింత సులభతరమవుతుందని దాదాపు 93% మంది అభిప్రాయపడగా, 41% మంది తాము ఇప్పటికే బోధనాపరంగా ఏఐని వినియోగిస్తున్నామని చెప్పారు. ఈ సర్వే వివరాలను మంగళవారం ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజీఐ సీఈవో హేమంత్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మల్లారెడ్డి యూనివర్సిటీ సహా దేశవ్యాప్తంగా పలు ప్రతిష్ఠాత్మక సంస్థల ఫ్యాకల్టీపై ఈ సర్వే చేశామన్నారు.

'కాళోజీ' పురస్కారాల కమిటీ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక 'కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారానికి అర్హులను ఎంపిక చేసేందుకు ప్రముఖ కవి అందెశ్రీ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మొదటి సమావేశం మంగళవారం సచివాలయంలో నిర్వహించారు. సభ్యులు ఏనుగు నర్సింహారెడ్డి, సంగనభట్ల నర్సయ్య, పొట్లపల్లి శ్రీనివాస్, మెంబర్ కన్వీనర్ మామిడి హరికృష్ణ ఇందులో పాల్గొన్నారు. ప్రజాకవి, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు పేర ఏటా సాహితీ అవార్డు కింద జ్ఞాపికతోపాటు రూ.1,01,116 నగదును అందజేయనున్నారు. ఈ పురస్కారం కోసం 40 మంది సాహితీవేత్తలు దరఖాస్తు చేసుకున్నట్లు అవార్డు కమిటీ పేర్కొంది.

స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ నిర్మాణం షురూ

కందుకూరు, సెప్టెంబరు 3: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 57 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ఈ వర్సిటీని నిర్మిస్తుండగా అధికారులు ప్రస్తుతం ప్రహరీ నిర్మాణాన్ని ప్రారంభించారు. దీంతోపాటు భూ నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల ప్లాట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇంటర్నేషనల్ స్కూల్, కమ్యూనిటీ హాల్‌తో పాటు ప్రహరీ, డ్రైనేజీ పనులనూ మొదలుపెట్టారు.

దొరలు కార్పొరేట్ ఆస్పత్రులకు.. పేదలు గాంధీ ఆస్పత్రికి

» నేను గాంధీలోనే పుట్టా: మంత్రి దామోదర

హైదరాబాద్ సిటీ/అడ్డగుట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పేదోళ్ల ఆస్పత్రిగా పేరొందిన గాంధీ ఆస్పత్రిలో సమయానికి వైద్యం అందాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. అన్ని సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. అవుట్ పేషంట్ విభాగంలో వైద్యులందరూ సమయ పాలన పాటించాలని ఆదేశించారు. దొరలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తారని, కానీ గరీబోళ్లు మాత్రం గాంధీ ఆస్పతికే వస్తారని అన్నారు. తాను దొరని కాదని, గాంధీ ఆస్పత్రిలోనే పుట్టానని చెప్పారు. గాంధీ ఆస్పత్రి, కింగ్ కోఠీ ఆస్పత్రులను మంత్రి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత గాంధీకి వచ్చిన ఆయన.. ఓపీ విభాగానికి వెళ్లి అక్కడ రోగులతో మాట్లాడారు. తర్వాత సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజాకుమారి చాంబర్‌కు వెళ్లి ఆర్ఎంవో, వైద్యులతో చర్చించారు. వైద్య విద్యార్థుల కోరిక మేరకు గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో కొత్తగా హాస్టల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కింగ్ కోఠీ ప్రభుత్వ ఆస్పత్రిని కూడా మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుకు వెళ్లి రోగులను పరామర్శించారు. కింగ్ కోఠీ ఆసుపత్రి లో అందిస్తున్న సేవలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చేనేత శాలువాలే వాడండి: మంత్రి పొన్నం

హైదరాబాద్/రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో చేనేత శాలువాలనే ఉపయోగించాలనివిద్యాశాఖ అధికారులను మంత్రి పొన్నం కోరారు. చేనేత వస్త్రాలను వినియోగిస్తే నేతన్నలను ఆదుకున్నట్లవుతుందన్నారు. గణేష్ ఉత్సవాలతో పాటు వివిధ కార్యక్రమాల్లో సాధారణంగా సింథటిక్ శాలువాలు వాడుతారని, వీటి బదులు చేనేత కాటన్ శాలువాలు, టవళ్లు వాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సింథటిక్ శాలువాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. కాగా, జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మరణించడం బాధాకరమన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, జిల్లా కలెక్టర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలసి హిమాయత్ సాగర్ జలాశయాన్ని పరిశీలించారు.

అల్లాపూర్ గురుకులంలో.. జూనియర్లపై దాడి చేసిన ఓ విద్యార్థికి టీసీ

తూప్రాన్, సెప్టెంబరు 3: మెదక్ జిల్లా అల్లాపూర్ గురుకులంలో ఆదివారం రాత్రి జూనియర్ విద్యార్థులపై సీనియర్లు దాడి చేసిన ఘటనపై అధికారులు చర్యలు చేపట్టారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ శివానందం మంగళవారం గురుకులంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంఈవో బుచ్యానాయక్, గురుకులాల డిప్యూటీ కమిషనర్ ప్రసాద్ ఘటనపై విచారించి, తొమ్మిదో తరగతి విద్యార్థులపై దాడి చేసిన తొమ్మిది మంది సీనియర్ విద్యార్థుల్లో ఒక విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించారు. మరో 8 మంది విద్యార్థులకు కూడా టీసీలు ఇచ్చి పంపేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

మరో 6 గ్రామాలు విలీనం!

(మొదటి పేజీ తరువాయి)

కలిసిపోయాయి. కానీ, పౌర సేవలు మాత్రం వేర్వేరు సంస్థల నుంచి అందుతున్నాయి. సౌకర్యాల కల్పనలోనూ కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీలో శివారులోని కొన్ని పురపాలికలు, గ్రామ పంచాయతీలను విలీనం చేసి నగర పరిధిని పెంచాలని సంకల్పించింది. ఓఆర్ఆర్ లోపల ఉండే ప్రాంతాలన్నింటినీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సహాయం తీసకుంది. విలీన ప్రక్రియపై అధ్యయనం చేసే బాధ్యత అప్పగించింది. అదే సమయంలో రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లతో మునిసిపల్ శాఖ నేతృత్వంలో మరో కమిటీని నియమించి.. విలీన ప్రక్రియపై నివేదిక కోరింది. ఈ రెండు నివేదికలు ఓఆర్ఆర్‌కు ఇరువైపులా విస్తరించిన గ్రామాలతో పాటు జనాభా రీత్యా వీటితో సమానంగా ఉన్న కొన్ని ఓఆర్ఆర్ వెలుపలి గ్రామాలను కూడా విలీనం చేయాలని సూచించాయి. 45 గ్రామాల్ని సమీప మునిసిపాలిటీల్లో కలిపేయవచ్చని సూచించాయి. ఈ విషయాన్ని సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఆగస్టు 1న క్యాబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ సభ్యులుగా కమిటీ ఏర్పడింది. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన సబ్ కమిటీ ఆగస్టు 22న తన నివేదికను ఇచ్చింది. 45 గ్రామాలకు అదనంగా మరో 6 గ్రామాలను చేర్చాలని సిఫారసు చేసింది. దీంతో ప్రభుత్వం తెలంగాణ మునిసిపాలిటీల చట్టం, 2019కి సవరణ చేసి 51 గ్రామాలను మునిసిపాలిటీల్లో విలీనం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. త్వరలో ఇవి మరో చట్ట సవరణ ద్వారా జీహెచ్ఎంసీలో విలీనం అవుతాయి. ప్రస్తుతం శాసన సభ సమావేశాలు లేనందున, విలీన ప్రక్రియకు గవర్నర్‌కు ఆమోదం తెలిపారు.

మేడ్చల్ జిల్లాలో..

మునిసిపాలిటీ	విలీన గ్రామాలు
ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనపూర్, అంకుషాపూర్, అవుషాపూర్
నాగారం	బోగారం, గొడుమకుంట, కరీంగూడ, రాంపల్లి, దాయర
తూంకుంట	బాబాగూడ, బొమ్మరాశిపేట, శామీర్‌పేట
మేడ్చల్	రాయిలాపూర్, పూడురు
గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
దమ్మాయిగూడ	కీసర, యాద్గార్‌పల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల్, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి
పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, కొర్రెముల, ప్రతాప్‌సింగారం

రంగారెడ్డి జిల్లాలో..

మునిసిపాలిటీ	విలీన గ్రామాలు
పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారామతిపేట, గౌరెల్లి, బాచారం
శంషాబాద్	రషీద్‌గూడ, బహదూర్‌గూడ హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, ఘాంసీమియాగూడ
నార్సింగి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ

సంగారెడ్డి జిల్లాలో

మునిసిపాలిటీ	విలీన గ్రామాలు
అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్
తెల్లాపూర్	పోచారం, ముత్తంగి, కర్దనూర్, పాటి, ఘనాపూర్

ఫార్మాసిటీ ఉందా? రద్దయిందా?

అధీకృత వ్యక్తుల సమాధానం సమర్పించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

భూములపై ఆంక్షలు తొలగించాలని పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 12 వేల ఎకరాల్లో నిర్మించతలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టు ఇప్పటికీ కొనసాగుతోందా? రద్దయిందా? చెప్పాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఫార్మా సిటీ రద్దయిందంటూ పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా కేసుల విచారణ చేపట్టడం సాధ్యంకాదని తెలిపింది. ప్రభుత్వంలో ఉన్న అధీకృత వ్యక్తుల సమాధానంతో స్టేట్‌మెంట్ సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాదికి ఆదేశాలు జారీచేసింది. దీనిపై స్పష్టత వస్తేనే భూములకు సంబంధించిన కేసులపై విచారణ చేపట్టడానికి అవకాశం ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఫార్మాసిటీ భూసేకరణను గతేడాది హైకోర్టు కొట్టేసినప్పటికీ తమ భూములపై ఇప్పటికీ ప్రభుత్వం ఆంక్షలు కొనసాగిస్తోందని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి తదితర గ్రామాలకు చెందిన ఆరేపల్లి జంగయ్య సహా 49 మంది రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫార్మా సిటీ రద్దయిందంటూ నూతన ప్రభుత్వంలోని ప్రముఖులు ప్రకటించారని తెలిపారు. అందుకు సంబంధించిన వార్తల క్లిప్పింగ్స్‌ను సమర్పించారు. భూసేకరణను హైకోర్టు రద్దు చేసినప్పటికీ భూములపై ఆంక్షలు తొలగించకపోవడం వల్ల వాటిని అమ్ముకోవడం, వారసులకు ఇవ్వడం సాధ్యం కావడం లేదని చెప్పారు. రైతుబంధు, పంటరుణాలు, రుణమాఫీ వంటి పథకాలు అమలుకాక నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ న్యాయవాది దివ్య ఆడెపు వాదనలు వినిపిస్తూ.. ఫార్మా సిటీ భూసేకరణ అవార్డు, నోటిఫికేషన్లను గతేడాది సింగిల్ జడ్జి కొట్టేశారని, దానిపై ఇటీవల ప్రభుత్వం చీఫ్ జస్టిస్ కోర్టులో అప్పీల్ దాఖలు చేసిందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అసలు ఫార్మా సిటీ ప్రాజెక్టు కొనసాగుతోందా ? రద్దయిందా ? అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని తెలిపింది. రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి వంటి అధీకృత వ్యక్తుల నుంచి స్పష్టత తీసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదికి ఆదేశాలు జారీచేసింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

ఎన్వోసీ అధికారం ఇవ్వాలి

» శివారు మున్సిపల్ చైర్మన్ల వినతి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

మున్సిపాలిటీల పరిధిలో హెచ్ఎండీఏ ఇచ్చే అనుమతులకు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) జారీ చేసే అధికారం తమకు ఇవ్వాలని హైదరాబాద్ శివారు మున్సిపల్ చైర్మన్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. అనుమతుల రుసుములను మొత్తం హెచ్ఎండీఏనే తీసుకుంటోందని, నిబంధనల మేరకు స్థానిక సంస్థలకు రావాల్సిన వాటాను నేరుగా ఇక్కడే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, మున్సిపల్ ఛైర్మన్లు సమావేశమయ్యారు. ఫీజులు మొత్తం హెచ్ఎండీఏనే తీసుకుంటే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రాను ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ఆశావర్కర్‌ను కొట్టిన వైద్య ఉద్యోగి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 3: ఆశావర్కర్‌ను అసభ్యంగా దూషించి, ఆమెపై చేయిచేసుకున్నాడు ఓ వైద్య ఉద్యోగి. దీంతో ఆగ్రహించిన ఆశావర్కర్లు ఆందోళనకు దిగారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల వైద్యాధికారి డాక్టర్ సాయి సింధు ఆధ్వర్యంలో ఆశావర్కర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి ధర్పల్లి ఆశావర్కర్ ఆలస్యంగా వచ్చారు. ఈ క్రమంలో సమావేశంలో ఉన్న వైద్య ఉద్యోగి అనిల్ డేవిడ్ ఆమెను అసభ్యంగా దూషిస్తూ, చేయిచేసుకున్నాడు. ఈ ఘటనతో ఆగ్రహించిన ఆశావర్కర్లు వైద్య ఉద్యోగిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ ఎదుట ఆందోళనకు దిగారు. బాధ్యుడిపై చర్యలు తీసకుంటామని వైద్యాధికారి సాయిసింధు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రకాశం బ్యారేజీలో మరో 'కౌంటర్' కట్!

» 67వ ఖానా వద్ద దెబ్బతిన్న సిమెంట్ దిమ్మె

» మొత్తం 3 కౌంటర్ వెయిట్లు ధ్వంసం

విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని ప్రకాశం బ్యారేజీలో మరో కౌంటర్ వెయిట్ దెబ్బతింది. వరదలో కొట్టుకొచ్చిన ఇనుప బోట్లు ఢీకొని ఇప్పటికే 64, 69వ నంబర్ల వద్ద ఉన్న రెండు కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్న విషయం తెలిసిందే. జలవనరుల శాఖ సలహాదారు కన్నయ్య నాయుడు, డ్యాం సేఫ్టీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, వర్క్‌షాపు అధికారులు మంగళవారం మరోసారి బ్యారేజీని, వరద తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇనుప బోటు కారణంగా 67వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్ కూడా మధ్యకు విరిగిపోయినట్లు గుర్తించారు. 69, 64వ వద్ద ఉన్న కౌంటర్ వెయిట్లు ఇప్పటికే దెబ్బతిన్నాయి. ఈ రెండింటిని తక్షణం మార్పు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు మూడో వెయిట్ కూడా తయారు చేయాలని నిశ్చయించారు. వాటికి సంబంధించిన డిజైన్లను రూపొందించే పనిలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు ఉన్నారు. కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్న గేట్లకు సంబంధించిన మోటర్లతోపాటు ఇతర మోటర్లను కన్నయ్యనాయుడి బృందం పరిశీలించింది. వరద తగ్గుముఖం పట్టాక ఈ మూడు కౌంటర్ వెయిట్లు ఉన్న గేట్లను కిందికి దించాలని సూచించింది. కిందికి దింపే క్రమంలో మోటార్లను ఉపయోగించవద్దని కన్నయ్యనాయుడు స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్యారేజీకి 7.76లక్షల క్యూసెక్కుల వరద వస్తోందని, ఇది 5లక్షల క్యూసెక్కులకు తగ్గిన తర్వాత నెమ్మదిగా దింపాలని సూచించారు. మోటార్ల ద్వారా దింపితే గేటు వేగంగా దిగి దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సర్వశక్తులు ఒడ్డుతున్నాం



» బాధితుల కోసంఎంతైనా ఖర్చు చేస్తాం

» ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విపరీతంగా వచ్చిన వరదలతో ఇబ్బంది పడుతున్న విజయవాడ, పరిసర ప్రాంతాలకు చెందిన బాధితులను ఆదుకొనేందుకు మూడురోజులుగా తన సర్వశక్తులు ఒడ్డి పని చేస్తున్నానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆరు హెలికాప్టర్లు, 30డ్రోన్లు తెప్పించి బాధితులకు ఆహారం అందజేస్తున్నామని తెలిపారు. 32 మంది ఐఏఎస్ అధికారులు విధుల్లో ఉన్నారని, 10 జిల్లాల నుంచి బాధితుల కోసం ఆహారం తెప్పిస్తున్నామని తెలిపారు. మూడు పూటలా ఆహారం అందిస్తున్నామని, చివరి వ్యక్తి వరకూ సాయం అందిస్తామని చెప్పారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టే క్రమంలో మూడో రోజు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాధితుల వద్దకు ట్రాక్టర్లు, వ్యాన్లు, పొక్లెయిన్లు, బోట్లు... ఎలా వెళ్లడానికి సాధ్యమైతే ఆ విధంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వరద సహాయకచర్యల్లో పాల్గొంటున్న అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని, వాటిని పాటించకపోతే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని చెప్పారు. ప్రజలకు నష్టం జరిగితే ఊరుకునేది లేదన్నారు. బాధితుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తామని, అందరూ సంయమనం పాటించాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సాయం అందించాలని తాను ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు పనిచేయడం లేదని బాధితులు చెప్తున్నారన్నారు. సరిగా పనిచేయని అధికారులు రేపటిలోగా తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు.

జగన్‌ది ఐదు నిమిషాల షో

మాజీ సీఎం జగన్ వరద ప్రాంతాలకు వెళ్లి ఐదు నిమిషాలు షో చేశారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. "కనీసం ఒక్కరికైనా ఒక పొట్లం ఆహారం అందించారా? కనీసం ఒక్కరినైనా రక్షించారా? కనీసం పలకరించారా?" అని ప్రశ్నించారు. వరదల సమయంలోనూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. "కొందరు చెత్త రాజకీయాలు చేస్తున్నారు. ప్రజాహితం కోసం ఎవరైనా పనిచేయాలి. కానీ, ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. సహాయకచర్యలకు భంగం కలిగించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని ప్రయత్నిస్తున్నారు. మీడియాప్రతినిధులు కూడా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సమంజసం కాదు" అని చంద్రబాబు హితవు పలికారు.

బుడమేరు బాధితులకు కన్నీళ్లే!

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని 15 డివిజన్లు బుడమేరు వరదలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారి నుంచి బాగా లోపలున్న వారికి మంగళవారం కూడా సాయం అందలేదు. మొదటి అంతస్తు దాటి పైన ఉన్న వారికి ఇళ్లలో అన్నీ ఉన్నా నీళ్లు లేవు. పాలు లేవు. కరెంటు లేదు. మూడు రోజులుగా ఆహారం, నీరు లేక నీరసించడంతో బతుకు కాపాడుకునేందుకు.. ప్రాణాలకు తెగించి వరద బాధితులే వరద నీళ్లలో బయటకు వచ్చారు. మెడలోతు, నడుములోతున్న నీళ్లలో కర్రలు ఆసరాగా చేసుకుని, ఒకరి చేతులు మరొకరు పట్టుకుని ఒడ్డుకు చేరుతున్న వారు కోకొల్లలుగా కనిపించారు. చాలామంది ఆహారం, నీరు లేక బలహీనంగా కనిపించారు. కీలకమైన సమయంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పనితీరు మొక్కుబడిగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్‌కు ఫోన్లు చేసినా స్పందించటం లేదని, కంట్రోల్ రూమ్ శుద్ధ దండగ అని బాధితులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి వస్తే తప్ప ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సహాయక చర్యలను పర్యవేక్షించటానికి క్షేత్రస్థాయికి రావటం లేదని చెబుతున్నారు. ముంపులో చిక్కుకున్న ప్రాంతంలో 30 శాతం ప్రాంతానికి మాత్రమే ఆహారం, మంచినీళ్లు అందించినట్లు తెలుస్తోంది.

వారంలో 'కమిషన్ల' నియామకాలు!?

కసరత్తు పూర్తి చేసిన రేవంత్.. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరు మురళి

» రైతు కమిషన్‌కు కోదండరెడ్డి..?

» బీసీ కమిషన్‌కు గోపిశెట్టి నిరంజన్!

» సభ్యులతో కలిపి 25 మందికి పైగా పదవులు

» ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై తర్జనభర్జనలు

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన నాయకులకు త్వరలోనే పదవులు దక్కనున్నాయి. పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి పదవులివ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. వివిధ కమిషన్లకు చైర్మన్లు, సభ్యుల నియామకాల కసరత్తును దాదాపు పూర్తి చేశారు. ఇటీవల తన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయిన రేవంత్‌రెడ్డి.. నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించారు. అయితే ఒక్కో కమిషన్‌కు చైర్మన్, సభ్యులు కలిపి కనీసం నలుగురికి పదవులు దక్కే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆయా పదవులపై దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. విద్య, రైతు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కులు తదతర కమిషన్లకు చైర్మన్లు, సభ్యుల నియామకాలపై చర్చించారు. వారం పది రోజుల్లో ఈ నియామకాలు పూర్తి కానున్నాయని, 25 మందికి పైగా నేతలకు పదవులు దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరు మురళి, రైతు కమిషన్ చైర్మన్‌గా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిల పేర్లు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు కమిషన్‌పైనా ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనుంది. ఆయా కమిషన్లకు ఆకునూరి మురళి, కోదండరెడ్డిలను చైర్మన్లుగా, ఆరుగురిని సభ్యులుగా నియమించనుంది. అలాగే బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో వారం పది రోజుల్లోనే కొత్త చైర్మన్, సభ్యులను నియమించనున్నట్లు తెలిసింది. కమిషన్ చైర్మన్‌గా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక ఎస్సీ, ఎస్టీ కమిషన్ విషయంలో తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్లుగా విడగొట్టాలా? లేక యథాతథంగా కొనసాగించి కొత్త చైర్మన్, సభ్యులను నియమించాలా? అన్నదానిపై సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కమిషన్‌ను యథాతథంగా కొనసాగిస్తే తొందర్లోనే చైర్మన్, సభ్యుల నియామకం జరుగుతుందని.. విడదీయాలని నిర్ణయిస్తే మాత్రం చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

తెలంగాణ విద్యా కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని తీర్చి దిద్దడానికి వీలుగా కమిషన్ పని చేయాల్సి ఉంటుంది. పూర్వ ప్రాథమికం నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిల్లో తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తుంది. కమిషన్ చైర్మన్, ముగ్గురు సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. ఈ మేరకు త్వరలోనే నియామకాలు చేపడతారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి. కమిషన్‌కు సభ్య కార్యదర్శిగా ఉన్నతాధికారి వ్యవహరించనున్నారు. కమిషన్ విద్యారంగ భాగస్వాములందరితో, నిపుణులు, ఇతర ప్రముఖులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి మార్గదర్శ ప్రణాళికను రూపొందించనుంది. విద్యారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు, సలహాలను ఇవ్వనుంది.

కమిషన్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశాలు

- పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ బాల్య దశ విద్యలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వాలి
- బడుల్లో నాణ్యమైన విద్యను పెంపొందించడం, విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందించడం.
- ఉద్యోగాలను పొందే విధంగా ఉన్నత విద్యలో నైపుణ్యాలను పెంచడం
- ప్రాథమికం నుంచి ఉన్నత విద్య వరకు అన్ని స్థాయిల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యార్థులను తయారు చేయడం, బాధ్యతాయుత ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దడం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● బుధవారం 4 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

మౌలానా ఆజాద్ వర్సిటీలో
డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) మోడ్‌లో నిర్వహిస్తున్న పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. డిగ్రీ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. సర్టిఫికెట్ కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఒక సెమిస్టర్ ఉంటుంది. డిప్లొమా(టీచ్ ఇంగ్లీష్/ఎంప్లాయిబిలిటీ స్కిల్స్), ఎంఏ(ఇంగ్లీష్), సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో మిగిలినవాటిని ఉర్దూ మాధ్యమంలో బోధిస్తారు.



ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, ఇంగ్లీష్, హిస్టరీ, అరబిక్, హిందీ
- **డిగ్రీ ప్రోగ్రామ్‌లు:** బీఏ, బీకాం, బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్), బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)
- **డిప్లొమా:** టీచ్ ఇంగ్లీష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్
- **సర్టిఫికెట్ కోర్సులు:** ఫంక్షనల్ ఇంగ్లీష్, ప్రొఫిషియెన్సీ ఇన్ ఉర్దూ త్రూ ఇంగ్లీష్

అర్హత: సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత; డిప్లొమా, డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఇంటర్ ఉత్తీర్ణత చాలు. డిప్లొమా(టీచ్ ఇంగ్లీష్)కు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీలో ప్రవేశానికి సంబంధిత స్పెషలైజేషన్‌తో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గాగానీ, ఉర్దూ మాధ్యమంలో గానీ చదివి ఉండాలి. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **ఆన్‌లైన్ ఇండక్షన్ ప్రోగ్రామ్ తేదీ:** నవంబరు 1
- **ఆఫ్‌లైన్ ఇండక్షన్ ప్రోగ్రామ్ తేదీ:** నవంబరు 3
- **వెబ్‌సైట్:** manuu.edu.in/dde

బెంగళూరు ఐఐఎంలో
పీజీపీఈఎం

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్(పీజీపీఈఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఎంబీఏ డిగ్రీని ప్రదానం చేస్తారు.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2025 మార్చి 31 నాటికి కనీసం నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. క్యాట్ 2024/జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ఐఐఎంబీ ఎంట్రెన్స్ టెస్ట్: ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్, వెర్బల్, లాజికల్, డేటా ఇంటర్‌ప్రిటేటివ్ ఎబిలిటీస్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 జనవరి 22
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** రౌండ్ 1 టెస్ట్ తేదీ-నవంబరు 17న; రౌండ్ 2 టెస్ట్ తేదీ-2025 ఫిబ్రవరి 2న
- **ఇంటర్వ్యూ సెంటర్:** బెంగళూరు
- **ఇంటర్వ్యూలు:** 2025 ఫిబ్రవరి 15, 16
- **వెబ్‌సైట్:** iimb.ac.in





నీలిట్‌లో
ఎంటెక్ ప్రోగ్రామ్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గేట్ 2022/2023/2024 స్కోర్ లేదా సీయూఈటీ పీజీ 2024 స్కోర్ లేదా ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు సంస్థ నెలకు రూ.9,000ల అసిస్టెంట్‌షిప్/స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో(బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ 2022/2023/2024 స్కోర్ లేదా సీయూఈటీ పీజీ 2024 స్కోర్ ఉన్నవారికి నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు. మిగిలినవారు ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **అభ్యర్థులు గోరఖ్‌పూర్ క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** సెప్టెంబరు 5
- **ఇన్‌స్టిట్యూట్ లెవెల్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 5
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఎన్‌పీటీఐలో
పోస్ట్ డిప్లొమా

దుర్గాపూర్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)- పోస్ట్ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైమ్ కోర్సు. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ వ్యవధి 26 వారాలు. ప్రోగ్రామ్‌లో భాగంగా థర్మల్ పవర్ స్టేషన్లు, హైడ్రో పవర్ స్టేషన్లు, సోలార్ పవర్ ప్లాంట్స్, ఈహెచ్‌వీ సబ్‌స్టేషన్స్, లోడ్ డిస్పాచ్ సెంటర్లు, మాన్యుఫాక్చరింగ్ యూనిట్లను విజిట్ చేసే అవకాశం కల్పిస్తారు. అకడమిక్ ప్రతిభ, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీట్ల వివరాలు: ఈ కోర్సులో మొత్తం 72 సీట్లు ఉన్నాయి. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన టెక్నికల్ బోర్డు నుంచి మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్) పూర్తిచేసి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు. ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,77,140
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 23
- **మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** సెప్టెంబరు 26, 27
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 30 నుంచి
- **వెబ్‌సైట్:** nptidurgapur.co.in



SCHOLARSHIP ALERT

OakNorth STEM Scholarship and Mentorship Programme

Description: OakNorth STEM Scholarship and Mentorship Programme aims to provide financial support to meritorious and underprivileged female students belonging to Uttarakhand, Bihar and Haryana pursuing graduation in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects from government colleges/universities.

Eligibility: Female students from Haryana, Uttarakhand and Bihar who have passed Class 12 and are currently pursuing graduation (any year) in STEM-related subjects from government universities/colleges are eligible. The annual family income of the applicants must be less than INR 3.5 lakh from all sources. Aggregate marks secured by candidates in the Class 12 (or equivalent) examination must be 80% or above (with the exception of children with single parents or orphans) and 65% in the previous class/semester/year (if applicable).

Prizes & Rewards: INR 30,000 (fixed amount)

Last Date to Apply: 18-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ONSS3

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

Nikon Scholarship Program 2024-25

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/NIKON12

U-Go Scholarship Program

Description: U-Go Scholarship Program 2024-25 is a CSR initiative by U-Go to financially support young women pursuing professional graduation courses.

Eligibility: Open to young women pursuing the first year of professional graduation courses such as teaching, nursing, pharmacy, medicine, engineering, architecture, law, etc., in India. Applicants must have secured at least 70% marks in Classes 10 and 12. The annual family income of the applicant from all sources must be less than INR 5 lakh.

Prizes & Rewards: Up to INR 60,000 per year for the length of the program

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/UGO3



Intuit Rise Girl Child Education Program 2024-25

Description: Intuit India is dedicated to empowering underprivileged girl students from Class 8 through graduation by providing comprehensive educational support. This support will help these students achieve their full potential, paving the way for a brighter future!

Eligibility: Female students from Class 8 up to the graduation are eligible to apply.

- To quality, applicants must have secured over 60% in their previous academic year
- The annual family income of applicants must be less than INR 3.5 lakh.
- Children of employees of Intuit India and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of up to INR 46,305

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/IRGC3




buddy4study.com

దాన ఫలం



అవంతీపురాన్ని పరిపాలించే రాజు ప్రసేనుడికి తన గురువు ఆనందుడు అంటే అమితమైన భక్తి, గౌరవం. తనకు పాలనలో ముఖ్యమైన సలహాలనిచ్చి, తనకు సాయం చేసినందుకు కృతజ్ఞతగా గురువుకు ఒకరోజు మంచి పట్టు బట్టలు కానుకగా సమర్పించాడు రాజు. గురువుగారు తన ఆశ్రమానికి తిరిగి వెళుతూ ఆ బట్టలనుదారిలో చలికి వణికిపోతున్న ఒక బిచ్చగాడికి ఇచ్చేసాడు. తాను గురువు గారికి కానుక ఇచ్చిన కొత్త పట్టు బట్టలు ఒక బిచ్చగాడి వద్ద ఉన్నట్టు భటుల ద్వారా తెలుసుకున్న రాజుకు చాలా కోపం వచ్చింది. తన గురువు తనను అవమానించాడని భావించి, వెంటనే గురువు గారికి ఎందుకిలా చేసారని ప్రశ్నిస్తూ, ఒక లేఖ పంపాడు. ఆ లేఖ చదువుకుని రాజు ఆగ్రహాన్ని అర్థం చేసుకున్న ఆనందుడు ఇలా ప్రత్యుత్తరం పంపాడు. 'రాజా.. ఒకరికి మనం ఏదైనా ఇచ్చాము అంటే దాని మీద హక్కును పూర్తిగా వదులుకున్నట్టే, అది ఇకపై మనది కాదు. పట్టుబట్టల విషయం మీరు ఇంకా గుర్తుంచుకుని నన్ను అడుగుతున్నారంటే, ఇంకా మీరు వాటిని మీవిగా భావిస్తూనే ఉన్నారు అన్నమాట. వాటి మీద హక్కును కలిగి ఉంటూ మీరు ఎన్ని దానాలు చేసినా మీకు దాన ఫలం రాదు, తృప్తి కూడా కలగదు.. ఆ పట్టు బట్టల అవసరం ఆ సమయానికి నాకంటే ఆ బిచ్చగాడికే ఎక్కువ ఉందని నేను అతనికి ఇచ్చేసాను మీరొకసారి నాకు ఇచ్చివేసాక నేను వాటిని ఎలా ఉపయోగించుకుంటాను అనేది పూర్తిగా నా ఇష్టం కదా' అని. గురువు గారి ప్రత్యుత్తరం చదువుకున్న రాజు అందులో ఉన్న పాఠం అర్థం చేసుకున్నాడు మరెపుడూ ఎవరికి ఏమి దానమిచ్చినా మనస్ఫూర్తిగా ఇచ్చివేసి, మరల దానీ గురించిన ఆలోచనే మరచిపోయాడు.

10 తేడాలను కనిపెట్టండి



జంతువులు ఎన్ని ఉన్నాయి?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 401

				7	
9		4			
5	2		4		
	8				5
	1	7	3		8
			1		

సుడోకు - 400 సమాధానం

2	8	6	7	3	9
1	4	9	6	8	5
7	3	5	4	2	1
8	9	3	5	6	7
6	7	1	2	4	3
5	2	4	9	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.